18

# "జ్ఞానుల వలె నడుచుకొనుడి" (రెండవ భాగము)

## (6:1-20)

### తల్లిదండ్రులు పిల్లల మధ్య గౌరవపూర్వకమైన సంబంధములు (6:1-4)

6:1-4లో, క్రైస్తవులు జ్ఞానుల వలె నడుచుకొనవలసినదని 5:15లో మొదలైన తన చర్చను పౌలు కొనసాగించాడు.

గ్రీకు-రోమా రాజ్యములో తండ్రికి తన పిల్లలపై పూర్తి అధీనాధికారము మరియు బాధ్యత ఉండింది. ఆయన తన అధీనాధికారం ప్రకారం వారికి శిక్షణనిచ్చుచు వారిని క్రమశిక్షణలో ఉంచాడు, మరియు తన హక్కుల ప్రకారం ఆయన తన బిడ్డలను అమ్ముకొనవచ్చు లేక హతమార్చవచ్చు. ఏది ఏమైనా, కఠిన శిక్ష ప్రజలందరి అభిప్రాయాల చేత విమర్శింపబడింది. యూదా మతంలో, తల్లిదండ్రుల, మరి ముఖ్యంగా తండ్రుల అధికారం ఇదే విధంగా ఉద్ఘాటింపబడింది. పాత నిబంధన ప్రకారం వారి తల్లిదండ్రులను గౌరవించుటలో అవిధేయులైన పిల్లలకు మరణ దండన విధింపబడింది (లేవీయకాండము 20:9; ద్వితీయోపదేశకాండము 21:18-21). అవిధేయులైన పిల్లలను మందలించవలెనని ఫ్లేవియస్ జోసెఫస్ యూదా మత తల్లిదండ్రులకు సలహా ఇచ్చాడు. అప్పుడు, ఆ పిల్లలు తమ తల్లిదండ్రుల మందలింపును లెక్కచేయకపోయినట్లయితే, తరువాతి చర్య యీ విధంగా చేపట్టబడవలెనని తల్లిదండ్రులకు సూచింపబడింది, "... అతని తల్లిదండ్రులే అతని పట్టుకొని జనసమూహములు వాని వెంటరాగా ఊరి గవినియొద్దకు అతని తీసికొని వచ్చి, ... రాళ్లతో అతని చావగొట్టవలెను ..."[1] ఇంతటి తీవ్రమైన శిక్ష వాస్తవంగా అభ్యసింపబడిందో లేదోయని కొంత తర్జనభర్జన కొనసాగుచున్నను, తల్లి లేదా తండ్రి, ముఖ్యంగా తండ్రి, తన పిల్లలపై పూర్తి అధీనాధికారం కలిగియుండెనను వాస్తవం నిలిచిపోయింది.

మోషే ధర్మశాస్త్రం పిల్లల శిక్షణ కొరకైన యూదుల పాఠ్యపుస్తకమై యుండింది. అందులో తల్లిదండ్రుల బాధ్యత గూర్చి ఇలా చెప్పబడింది,

> నేడు నేను నీకాజ్ఞాపించు ఈ మాటలు నీ హృదయములో ఉండవలెను. నీవు నీ కుమారులకు వాటిని అభ్యసింపజేసి నీ ఇంట కూర్చుండునప్పుడును త్రోవను నడుచునప్పుడును పండుకొనునప్పుడును లేచునప్పుడును వాటిని గూర్చి మాటలాడవలెను (ద్వితీయోపదేశకాండము 6:6, 7).

ఆయన ఇశ్రాయేలీయులతో మాటలాడుట ముగిసిన మీదట, మోషే, "మీతో సాక్ష్యముగా నేడు పలికిన మాటలన్నటిని మీ మనస్సులలో పెట్టుకొని, మీ సంతతి వారు ఈ ధర్మశాస్త్ర వాక్యములన్నిటిని అనుసరించి నడుచుకొనవలెనని వారికాజ్ఞాపించుము" అని

పలికాడు (ద్వితీయోపదేశకాండము 32:46).

పాత నిబంధనలో ఇవ్వబడిన ఆదేశములలో పిల్లల క్రమశిక్షణ ఒక ప్రాముఖ్యమైన అంశమై యుండింది. సామెతలు 22:6లో, "బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము, వాడు పెద్దవాడైనప్పుడు దాని నుండి తొలగిపోడని" సొలొమోను పలికిన మాటలు వ్రాయబడి ఉన్నాయి. ఇంకా, "బెత్తము వాడనివాడు తన కుమారునికి విరోధి, కుమారుని ప్రేమించువాడు వానిని శిక్షించును" (సామెతలు 13:24), మరియు "నీ బాలురను శిక్షించుట మానుకొనకుము, బెత్తముతో వాని కొట్టిన యెడల వాడు చావకుండునని" (సామెతలు 23:13) కూడా రచించాడు.

ఈ నేపథ్య దృశ్యంతో, పిల్లలపై తల్లిదండ్రులకు గల అధికారమును పౌలు నొక్కివక్కాణించాడు. పౌలు 6:1-4లో తల్లిదండ్రులకు మరియు పిల్లలకు సెలవిచ్చిన విషయాలు క్రీస్తు అధికారము క్రింద ఉంటూ అన్యోన్య మర్యాద సూత్రమును అభ్యసించుచున్న ప్రతి ఒక్కరికి సంబంధించినవై యున్నవి. ఇచ్చట పేర్కొనబడిన బాధ్యతల నెరవేర్పు పిల్లలకు సంబంధించినంత వరకు విధేయతను మరియు గౌరవమును, తల్లిందండ్రులకు ముఖ్యంగా తండ్రులకు సంబంధించినంత వరకు వారు తమ బాధ్యతాయుతమైన అధికారమును దూషింపకుండునట్లు సహనము కలిగియుండుట, ఉపదేశముల నిచ్చుట మరియు నిగ్రహమును పాటించుట అనివార్యమైన విషయాలుగా చేయుచున్నది.

### పిల్లలు: "సన్మానింపుము మరియు లోబడుము" (6:1-3)

**[1]పిల్లలారా, ప్రభువునందు మీ తల్లిదండ్రులకు విధేయులైయుండుడి; ఇది ధర్మమే. [2-3]నీకు మేలు కలుగునట్లు నీ తండ్రిని తల్లిని సన్మానింపుము, అప్పుడు నీవు భూమిమీద దీర్ఘాయుష్మంతుడవగుదువు, ఇది వాగ్దానముతో కూడిన ఆజ్ఞలలో మొదటిది.**

**వచనము 1. పిల్లలు,** *tekna* యొక్క అనువాదము, లేఖనములలో దేవుని పిల్లలైన విశ్వాసుల గూర్చి (రోమీయులకు 8:16, 17; 1 యోహాను 3:10) మరియు లోక రీతియైన కుటుంబములలోని పిల్లల గూర్చి ప్రయోగింపబడింది. లోక రీతియైన కుటుంబములలోని పిల్లల విషయంలో వాడబడినప్పుడు, అది వారి వయస్సును దృష్టిలో ఉంచుకొనదు. అది ఒక చిన్న బిడ్డను (మత్తయి 18:1-6లో అర్థమిచ్చుచున్నట్లుగా) లేదా పెద్దగా పెరిగిన పిల్లవానిని కూడా సూచింపవచ్చును (1 తిమోతి 5:4 చూడుము).

ఎఫెసీ పత్రికలో సంబోధింపబడుచున్న "పిల్లలు" వారికియ్యబడిన ఆదేశములను అర్థంచేసుకొనగల వయస్కులై యుందురు; ఇంకా, వారు సంఘ సభ్యులై యుండిరని మూల గ్రంథ పాఠము ద్వారా అర్థమగుచున్నది. **ప్రభువునందు** ఉండుట, ఈ పదజాలము ఇదే పత్రికలో మరొక చోట కూడా వాడబడింది (2:21; 5:8; 6:10, 21), తప్పక ఒక క్రైస్తవుడైయుండుట అనే అర్థమిచ్చును. ఈ పదజాలమును మనము తల్లిదండ్రులతో జోడించినప్పుడు, ఒక ప్రశ్న తలెత్తుతుంది: క్రైస్తవేతరులైన తల్లిదండ్రుల పిల్లలు తమ తల్లిదండ్రులకు లోబడవలసిన ఆవశ్యకత లేదా? ఇది, సహజంగానే, పాత నిబంధనలో మరియు ప్రాచీన ప్రపంచంతో గుర్తింపబడిన దాని చేత వ్యతిరేకింపబడింది. పిల్లలు ఎల్లప్పుడు వారి తల్లిదండ్రుల అధికారం క్రింద ఉండిరి. "ప్రభువునందు" అను పదజాలము

"పిల్లల"కు ముడిపెట్టబడి, "ప్రభువునందలి పిల్లలు," లేదా క్రీస్తునంగీకరించి క్రైస్తవులైన పిల్లలు అని ప్రస్తావించుకొంటే అది బహు చక్కగా అర్థం చేసుకొనబడుతుంది. కాబట్టి, ఇచ్చట సంబోధింపబడుచుండిన పిల్లలు మరియు తల్లిదండ్రులు క్రైస్తవులై యుండిరని మనము భావింపవచ్చును, ఏలయనగా ఈ ఇరువురును సంఘ సమూహములో భాగమై యుండిరని ఎంచబడుచున్నది.

ఈ పిల్లలు "ప్రభువుతో వారు కలిగియుండిన సంబంధము గూర్చి చైతన్యవంతులై యుండుటకును దాని ఆధారంగా వారు విన్నవించుకొనబడుటకును చాలినంత వయస్కులై యుండిరి, కానీ పెంచబడుచుండిన ప్రక్రియలోనే ఉండుటకు ఇంకా పిన్న వయస్కులై యుండిరని [ఎఫెసీయులకు 6:4 చూడుము]" ధ్రువీకరిస్తూ ఆండ్రూ టి. లింకన్ ఈ పరిస్థితిని క్రోడీకరించాడు.[2] అనగా, ఈ మూల గ్రంథ పాఠము క్రైస్తవులై యుంటూ వారి తల్లిదండ్రుల అధీనాధికారం క్రింద జీవించుచున్న పిల్లలకు వర్తించునని మరొక మాటలో చెప్పుకొనవచ్చును.

పిల్లలు తమ తల్లిదండ్రులకు లోబడుట, వారు "ప్రభువునకువలె" తమ భర్తలకు లోబడియుండవలెనని ఆదేశింపబడిన (5:22) భార్యలు తమ భర్తలకు లోబడుట వంటిదై యున్నది. క్రైస్తవ పిల్లలు తమ తల్లిదండ్రులకు **లోబడినప్పుడు**, వారు ప్రభువునకు లోబడుచున్నవారౌదురు. తల్లిదండ్రులకు అవిధేయులగుట అనగా, వారు అవిశ్వాసులైన అన్యజనులను పోలి నడుచుకొనుచున్నవారే అనియు (రోమీయులకు 1:30) "అంత్య దినముల" లక్షణమై యుండు దుష్టత్వములో భాగమయ్యారనియు అర్థం (2 తిమోతి 3:1, 2).

**ఇది ధర్మమే** అను పదజాలము పిల్లలు వారి తల్లిదండ్రులకు లోబడుటకు గల అదనపు హేతువును సమకూర్చుచున్నది. మొదటిదిగా, తల్లిదండ్రుల అధికారము మరియు ఈ అధికారమునకు పిల్లలు లోబడుట ప్రాచీన ప్రపంచంలోను దేవుడు ఇశ్రాయేలు ప్రజలతో చేసిన నిబంధనలోను గుర్తింపబడినవి. రెండవదిగా, పిల్లలు తమ తల్లిదండ్రులకు లోబడుచున్నారంటే వారు ప్రభువునకు లోబడుచునట్లే అని పౌలు పట్టుబట్టి పలుకుచుండెను. మూడవదిగా, "ఇది ధర్మమే" అని అపొస్తలుడు చెప్పుచున్నాడు; అనగా, లోబడుట సరైన విషయమై యున్నదని మరొక మాటలో చెప్పుకొనవచ్చును. ఇంకా, పిల్లలు తమ తల్లిదండ్రులకు లోబడుట గూర్చిన సముచితమును ధర్మశాస్త్రము నుండి ఉల్లేఖించి చెప్పుచూ కూడ ఆయన గట్టిగా సమర్థించాడు.

**వచనములు 2, 3. నీ తండ్రిని తల్లిని సన్మానించుము** అని వ్రాయబడియున్న మాటలు కూడ మనము చదువుదుము.[3] "సన్మానింపుము" అని అర్థమిచ్చుచున్న గ్రీకు క్రియాపదము *timaō* అయియున్నది; ఇది ప్రజల గూర్చి చెప్పుకొనబడిన సందర్భములో వాడబడినదిగా, "మూల్యాంకనము గావించుట, మూల్యము నిర్ధరించుట" అని అర్థమిచ్చుచున్నది.

> కాబట్టి, ఎవరినో ఒకరిని సన్మానించుట అనగా, జీవితంలో అతని/ఆమె స్థానమునుబట్టి లేదా అతని/ఆమె గుణగణముల ప్రకారము, అతనికి/ఆమెకు కచ్చితంగాను నిజాయితీతోను విలువకట్టుచు, అతని/ఆమె యెడల భిన్నంగా, మర్యాదపూర్వకంగా, పూజనీయంగా, దయతో, సభ్యతతో, మరియు విధేయతతో మెలగుటయని అర్థము.[4]

ఒక బిడ్డ తన తల్లిదండ్రులను సన్మానించకుండానే వారికి లోబడుటకు అవకాశములుండగా, వారికి లోబడకుండా ఆ బిడ్డ తన తల్లిదండ్రులను సన్మానించజాలదు. కాబట్టి, పిల్లలు తమ తల్లిదండ్రులకు లోబడవలెనని పౌలు తెలియజెప్పుచుండిన హేతువులలో ఇది నాలుగవదై యుండెను. లోబడుటకు గల మనస్సు సన్మానించవలెనను ఆశలో నుండి పుట్టవలెను. లోబడుటకు గల అవసరతను ఆయన స్థిరపర్చాడు, అది సన్మానమునకు ఒక స్వాభావిక సత్ఫలితమై యున్నది. పది ఆజ్ఞలలో, సన్మానించుట ఐదవ ఆజ్ఞయై యుండినదని ఆయన గుర్తించాడు (నిర్గమకాండము 20:12).

**ఇది వాగ్దానముతో కూడిన ఆజ్ఞలలో మొదటిది** అని పౌలు చెప్పుచుండిన వ్యాఖ్యానకర్తలను తికమకపర్చాయి ఎందుకనగా పది ఆజ్ఞలలో దీని కంటె ముందున్న ఒక వాగ్దానమును కొందరు గమనించారు. "వెయ్యి తరముల వరకు కరుణించువాడనై యున్నానని" దేవుడు రెండవ ఆజ్ఞ తరువాత సెలవిచ్చాడు (నిర్గమకాండము 20:6). ఏది ఏమైనా, ఇది సామాన్యంగా దేవుడు తన స్వభావాన్ని వర్ణించుచుండిన విధానంలో భాగమై యుండింది:

> ఏలయనగా నీ దేవుడనైన యెహోవానగు నేను రోషము గల దేవుడను; నన్ను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరముల వరకు, తండ్రుల దోషమును కుమారులమీదికి రప్పించుచు, నన్ను ప్రేమించి నా ఆజ్ఞలు గైకొనువారిని వెయ్యితరములవరకు కరుణించు వాడనై యున్నాను (నిర్గమకాండము 20:5, 6).

అది వాగ్దానముతో కూడిన మొదటి ఆజ్ఞయై యున్నదని పౌలు చెప్పుచుండినప్పటికిని, పది ఆజ్ఞలలో ఐదవ ఆజ్ఞ ఒక్కటే వాగ్దానముతో కూడినదని కూడ కొందరు తిరుగబడవచ్చును. ఏది ఏమైనా, ఆరు వందలకుపైబడిన ఆజ్ఞలు మరియు అనేక వాగ్దానములు కలిగియుండిన ధర్మశాస్త్రమంతటిని, పది ఆజ్ఞలు పరిచయము గావించుచున్నవి.

ఇచ్చట పౌలు పరోక్షంగా ప్రస్తావించుచుండిన "వాగ్దానము" యొక్క ప్రాముఖ్యత ఏమైయున్నది? ఐదవ ఆజ్ఞ క్రొత్త నిబంధనలో కనీసము యింకా ఐదు పర్యాయాలైనా ఉల్లేఖింపబడి యుండగా, సంబంధిత వాగ్దానము ఎఫెసీ పత్రికలో మాత్రమే పేర్కొనబడింది. ఈ వాగ్దానము – **అప్పుడు నీవు భూమి మీద దీర్ఘాయుష్మంతుడవగుదువు** – ఇశ్రాయేలీయులు కనాను దేశాన్ని నిరంతరము తమ స్వాధీనములో ఉంచుకొందురను సందర్భములో చేయబడింది. పౌలు తన పత్రికను ఎఫెసీయులకు వ్రాసినప్పుడు, కనాను ఇశ్రాయేలీయుల స్వాధీనములో ఉండిన విషయము అతని మనస్సులో లేదు. పాత నిబంధనలో ఇశ్రాయేలీయులకు ఈయబడిన వాగ్దానాలు యేసు క్రీస్తు రాకడలోను ఆయన సంఘములోను నెరవేరినవని పౌలు ఎరిగియుండెను (రోమీయులకు 4; 8; గలతీయులకు 3; 4 చూడుము). కనాను దేశము గూర్చి అబ్రాహాము మరియు అతని వంశస్థులకును ఇవ్వబడిన వాగ్దానము (ఆదికాండము 12:7; 13:15; 15:18–21 చూడుము) ఎంతో కాలం క్రితం ఆ దేశం యెహోషువ చేత జయింపబడినప్పుడు నెరవేరింది (యెహోషువ 21:43–45; 23:14 చూడుము). ఇంకా, ఎఫెసీ సంఘములో యూదేతరులుండిరి, వారు ఈ మాటలు చదివినప్పుడు కనాను దేశం గూర్చి ఎన్నడును అనుకొని యుండలేదు. ఎఫెస్సు పట్టణ సంఘములో ఉండిన పిల్లలందరు వారి తల్లిదండ్రులకు లోబడుచుండుటను

ప్రోత్సాహించుటకు పౌలు ఈ వాగ్దానమును ప్రయోగించాడు.

"అప్పుడు నీవు భూమి మీద దీర్ఘాయుష్మంతుడవగుదువని" పౌలు చెప్పినప్పుడు ఆయన, కచ్చితంగా ఏ విషయాన్ని సూచించాడు? పౌలు తను వ్రాసిన ఇతర పత్రికలలో ప్రతిఫలముల గూర్చి మాటలాడినప్పుడు, ఆయన వాటిని అంత్య దిన తీర్పుకు ముడిపెట్టినంత ఎక్కువగా ఇహలోక ప్రతిఫలములకు ముడిపెట్టలేదు (1 కొరింథీయులకు 3:8, 12-15; 2 కొరింథీయులకు 5:10 చూడుము). "... దైవ భక్తి యిప్పటి జీవము విషయములోను రాబోవు జీవము విషయములోను వాగ్దానముతో కూడినదైనందున అది అన్ని విషయములలో ప్రయోజనకరమవునని" పౌలు చెప్పినప్పుడు ఆయన ఇహలోక జీవితమందలి ప్రతిఫలముల సందర్భమునకు అతి సమీపముగా ఉండినాడు (1 తిమోతి 4:8). ఈ ఆజ్ఞకు వాగ్దానము జతచేయబడినంత మాత్రాన తన తల్లిదండ్రులకు లోబడుచు వారిని సన్మానించు ప్రతి బిడ్డకు సఫలీకృతమును సుదీర్ఘమునైన జీవితము గూర్చిన హామీ ఇవ్వబడినదని భావించనవసరము లేదు. ఇతరమైన ప్రతి విషయంతో పాటుగా, తన తల్లిదండ్రులకు లోబడుచు వారిని సన్మానించు బిడ్డ సాధారణ సంక్షేమమును ఆనందంగా అనుభవించునని మాత్రమే పౌలు భావించుచుండెను. ఈ ఆజ్ఞలను అలక్ష్యము చేయు వారి జీవితముల కంటె వాని జీవితం ఆనందభరితమును సంపూర్ణమైనదియునై యుండును.[5]

ఆజ్ఞానుల వలె గాక జ్ఞానుల వలె నడుచుకొనునట్లు, పిల్లలు తమ తల్లిదండ్రులను సన్మానించుచు వారికి లోబడుచుండవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. చిన్న పిల్లలు తమ తల్లిదండ్రులకు లోబడుట ద్వారా వారిని సన్మానింపవలెను, మరియు పెద్ద పిల్లలు వయస్సు మళ్లిన తమ తల్లిదండ్రుల గూర్చి తగు శ్రద్ధ వహించుట ద్వారా వారిని సన్మానింపవలెను (1 తిమోతి 5:4, 8 చూడుము).

### తండ్రులు: "క్రమశిక్షణలో ఉంచుచు ఉపదేశించుము" (6:4)

**4తండ్రులారా, మీ పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడి.**

**వచనము 4.** పౌలు మొదటి వచనంలో "తల్లిదండ్రులు" అని పేర్కొన్నప్పుడు, ఆయన *goneus* అను గ్రీకు నామ వాచక పదమును ప్రయోగించాడు; అదే సమయంలో ఆయన "నీ తండ్రిని నీ తల్లిని" అని రెండవ వచనంలో పేర్కొన్నప్పుడు, *patēr* మరియు *mētēr* అను సర్వ సామాన్యమైన పదములను ప్రయోగించాడు. ఏది ఏమైనా, హెబ్రీ పత్రిక రచయిత మోషే తల్లిదండ్రుల గూర్చి ప్రస్తావించినప్పుడు, ఆయన తండ్రి మరియు తల్లి అని అర్థమిచ్చునట్లు అనువదింపబడిన *patēr* యొక్క బహు వచన రూపమును ఉపయోగించాడు (హెబ్రీయులకు 11:23). 6:1-4లో పౌలు మూడు భిన్నమైన పదములను ఉపయోగించినందు వలన - ఒకటి "తండ్రి"ని సూచించుటకు, ఒకటి "తల్లి"ని సూచించుటకు మరియు మూడవది తల్లిదండ్రులను సూచించుటకు - నాలుగవ వచనంలో ఆయన ప్రాథమికంగా **తండ్రుల**నుద్దేశించి మాటలాడుచుండెనని మనము చెప్పుకొనవచ్చును, ఏలయనగా ఆ పదము *patēr* యొక్క బహువచనమై యున్నది. తల్లులు,

సహజంగానే, తమ పిల్లలకు శిక్షణ నిచ్చుటలో నిమగ్నమై యుందురు, కానీ తండ్రులకు ప్రాథమిక బాధ్యత ఇవ్వబడి యున్నది మరియు వారు శిక్షణ నిచ్చుటలో నేతృత్వము వహించవలసినవారై యున్నారు. గ్రీకు మూల గ్రంథ పాఠములోని 4వ వచన ప్రారంభంలో "మరియు" అని అర్థమిచ్చు *kai* వ్రాయబడి యున్నది (KJV చూడుము). పిల్లలు మరియు తండ్రులు సహితము వారి సంబంధములలో దేవుడిచ్చిన బాధ్యతలు కలిగియున్నారని ఈ వాస్తవము సూచిస్తుంది.

**మీ పిల్లలకు కోపము రేపకుడి** అను మాటలు వారు అజ్ఞానుల వలె గాక జ్ఞానుల వలె నడుచుకొనవలెనని పౌలు తండ్రులకిచ్చుచుండిన ఆదేశములకు ప్రారంభ వాక్కులై యుండినవి. "రేపుట," *parorgizō* అను మాట నుండి ఉత్పన్నమగుచున్నది, "ఉగ్రత కలుగునట్లు రెచ్చగొట్టుట, రెచ్చగొట్టుట, ఉద్వేగపర్చుట, కోపము పుట్టించుట" అని నిర్వచింపబడినది.[6]

> పిల్లలకు కోపంతో కూడిన ఉద్వేగమును లేదా ఏవగింపును పుట్టించు వైఖరులు, నోటిమాటలు, మరియు చర్యలకు దూరముగా నుండుట ఇందులో కలిసియున్నది మరియు ఈ విధంగ అది మితిమీరిన తీవ్ర క్రమశిక్షణను, సబబుకాని కఠినమైన సాధికార కోరికలను,అధికార దుర్వినియోగమును, నిర్హేతుకమైన విషయాలను, అన్యాయమును ఎప్పుడు చూచినా నసపెట్టుట మరియు ఖండనను రద్దుచేస్తుంది ...[7]

దీనికి సమాంతరముగానున్న వాక్యభాగములో, అనగా కొలొస్సయులకు 3:21లో, "మీ పిల్లల మనస్సు క్రుంగకుండునట్లు" అను మాటలను పౌలు అదనంగా చేర్చాడు. పిల్లలతో పదే పదే అన్యాయముగా ప్రవర్తించుట వలన, వారు యిక ఎప్పుడైనా గాని వారి తండ్రులకు సంతోషము కలిగించజాలరను క్రుంగుదల గల మనస్సును కలుగజేయవచ్చును.

పిల్లలకు శిక్షణ నిచ్చుటలో గల నిర్మాణాత్మకమైన విషయంలో, **ప్రభువు యొక్క శిక్షణలోను బోధలోను వారిని పెంచుడని** పౌలు చెప్పుచున్నాడు. "పెంచుట" అని అర్థమిచ్చు గ్రీకు క్రియా పదము (*ektrephō*), 5:29లో "పోషించుట" అని అనువదింపబడింది. ఎక్కువ నిర్దిష్టమైన విద్యాభ్యాస కోణములను సూచిస్తూ దీని తరువాత గల రెండు పదములనుబట్టి, ఈ పదమునకు మొత్తం మీద పిల్లలకు శిక్షణ నిచ్చుట గూర్చి ఒక విశాలమైన అర్థము కలదని అర్థమగుచున్నది. క్రొత్త నిబంధనలో, *ektrephō* ఒక సమగ్ర అర్థము (అపొస్తలుల కార్యములు 7:22; 22:3; 2 తిమోతి 3:16, 17; తీతు 2:12, 13 చూడుము) మరియు ఒక నిర్దిష్టమైన అర్థము కలిగియున్నది (1 కొరింథీయులకు 11:32; 2 కొరింథీయులకు 6:8–10; హెబ్రీయులకు 12:5–8, 11 చూడుము).[8] "క్రమశిక్షణ" మరియు "బోధ" అను మాటలు, దండన గూర్చిన అవగాహన చొప్పున ప్రయోగింపబడి, "పెంచుట" అను పదము సామాన్యమైనదిగాను, "క్రమశిక్షణ" మరియు "బోధ" అను పదములు నిర్దిష్టమైనవిగాను ఉండునట్లు "పెంచుట" అను పదమునకు విశేషణా గుణమును ఆరోపించుచున్నవి.

"క్రమశిక్షణ" (*paideia*) "బాధ్యతాయుతముగా జీవించుట కొరకు మార్గనిర్దేశనమును సమకూర్చు చర్యను" సూచిస్తుంది.[9] ఈ పదములో "పిల్లల సంపూర్ణ శిక్షణ మరియు విద్యాభ్యాసము" మరియు "మనస్సును మరియు నైతిక విలువలను, ... ఆజ్ఞలు మరియు మందలింపులను, [అంతమాత్రమేగాక గద్దింపు మరియు దండనను] సాగుచేయుట"

కలిసియున్నవి.[10]

"క్రమశిక్షణ" తదుపరి పౌలు "బోధ"ను (*nouthesia*) పేర్కొన్నాడు. ఈ పదము ప్రాథమికంగా "బుద్ధిచెప్పుట" అను అర్థమిచ్చుచున్నది (రోమీయులకు 15:14; 1 కొరింథీయులకు 4:14; 10:11; కొలొస్సయులకు 1:28; 3:16; తీతు 3:10 చూడుము). అది "పరిష్కరింపబడవలసియున్న లేదా అధికమింపబడవలసి యున్న ఏదో ఒక వ్యతిరేకత, బుద్ధిచెప్పబడుచున్న వారి వైఖరిలో లేదా ప్రవర్తనలో ఎంతో కొంత కష్టము లేదా ఏదో ఒక సమస్య ఉన్నదను ధ్వనింపు నిచ్చుచున్నది."[11]

వారి పిల్లలు సమాజంలోను సంఘములోను ప్రయోజనకరమైన పౌరులై యుండునట్లు వారిని పెంచుటలో (*ektrephō*) అవసరమైయుండు శిక్షణ అంతటిని తండ్రులు సమకూర్చవలె ననునది తుది అభిప్రాయమై యున్నది. ఇది బుద్ధిచెప్పుట మరియు క్రమశిక్షణ (*paideia*) గల విద్యాభ్యాసము మరియు తప్పుడు ప్రవర్తనను సరిదిద్దుట మరియు సరైన ప్రవర్తననుబట్టి ప్రశంసించుట గల ప్రోత్సాహము (*nouthesia*) ద్వారా సాధ్యమౌతుంది.

"ప్రభువు యొక్క" అను మాటలు తండ్రుల "క్రమశిక్షణ మరియు బోధ"కు విశేషణా గుణాన్ని ఆరోపించుచున్నవి. 4వ వచనం "క్రైస్తవ శిక్షణను, అనగా క్రీస్తు యొక్క శిక్షణను, ఆయన నుండి కలుగునది మరియు ద్వారా వర్ణింపబడిన దానిని" సూచించుచున్నదని ఉత్తమంగా అర్థంచేసుకొనవచ్చును.[12]

అంతకు మునుపు, వారు క్రీస్తును నేర్చుకొన్నవారు, ఆయన మాట వినినవారు, మరియు ఆయనలో సత్యము ఉపదేశింపబడినవారై యున్నారంటూ పౌలు ఎఫెసీయుల గూర్చి మాటలాడాడు (4:20, 21). తండ్రులు వారి పిల్లలకు ఇవ్వవలసిన "క్రమశిక్షణ మరియు బోధ" మొత్తం మీద సంఘము యొక్క గుణగణమై యుండవలసి యున్నదని ఈ మాటలు సూచించాయి.[13]

### యజమానులు మరియు దాసుల మధ్య గౌరవపూర్వకమైన సంబంధములు (6:5–9)

గ్రీకు–రోమా సామ్రాజ్యంలో దాసత్వము అభ్యసింపబడుట ఒక అంగీకరింపబడిన వాస్తవమై యుండింది. దాసత్వము దైనందిన జీవిత విధానమై యుండిన సమాజంలో, వారి దాసులు క్రీస్తునంగీకరింపకపోగా, దాసుల యజమానులు కొందరు క్రైస్తవులగుదురని ఆశింపబడుతుంది. వారి యజమానులు క్రీస్తునంగీకరింపకపోగా, కొందరు దాసులు క్రైస్తలగుదురని ఆశింపబడుతుంది. కొన్ని సందర్భాల్లో దాసులు మరియు యజమానులు క్రీస్తునంగీకరించి ఆయన అనుచరులగుదురు. వారు ఒకరి యెడల మరొకరు ఆ యా పరిస్థితుల్లో ప్రవర్తించు తీరుల గూర్చి క్రైస్తవ యజమానులు మరియు దాసుల కొరకు అవసరమైయున్న ఆదేశములను క్రొత్త నిబంధన నివేదించుచున్నదంటే మనము ఆశ్చర్యపడనవసరము లేదు.[14]

దాసత్వమును క్రొత్త నిబంధన ఒక ప్రక్క ఆమోదించలేదు సరికదా, మరొక ప్రక్క ఆమోదించకుండా ఉండలేదు. ఈ గొప్ప సామాజిక చెడును ఖండించుటకు బదులుగా, ప్రేరేపింపబడిన మొదటి శతాబ్దము నాటి రచయితలు దాసత్వమును క్రమబద్ధీకరణము గావించారు. సువార్త సూత్రములు మానవ సంబంధముల విషయంలో సంపూర్తిగా అన్వయింపబడినప్పుడు (మత్తయి 7:12; 22:39 చూడుము), దాసత్వము దానంతట

అదే రద్దువుతుంది. అది జరుగనంత వరకు, క్రొత్త నిబంధన రచయితలు దాసత్వము రద్దుచేయబడవలెననిగాని లేదా దాసులు తిరుగబడవలెనని గాని పిలుపునియ్యలేదు. వారు సామాన్యంగా కొన్ని దైవికమైన మార్గనిర్దేశక సూత్రములను ఏర్పాటు చేసారు.

ఎఫెసీయులకు 6:5–9లో, దాసులైనా లేదా యజమానులైనా, వారు ఒకే యజమానుడైన వానిని, అనగా క్రీస్తును సేవించుచున్నారని పౌలు క్రైస్తవ దాసులను మరియు యజమానులను మందలించాడు. దాసత్వము నెలకొని యుండిన ఈ సమయంలో క్రైస్తవులకు మార్గనిర్దేశనము నిచ్చుటకు ఎఫెసీ పత్రికకు ఆవల నుండిన వాక్య భాగాలు సహితము సహాయపడినవి.

### దాసులు: "విధేయులై యుండుడి" (6:5–8)

**5దాసులారా, యథార్థమైన హృదయముగలవారై భయముతోను వణకుతోను క్రీస్తునకువలె, శరీర విషయమై మీ యజమానులైనవారికి విధేయులైయుండుడి. 6మనుష్యులను సంతోషపెట్టువారు చేయునట్లు, కంటికి కనబడుటకే కాక, క్రీస్తు దాసులమని యెరిగి, దేవుని చిత్తమును మనఃపూర్వకముగా జరిగించుచు, 7మనుష్యులకు చేసినట్టుకాక ప్రభువునకు చేసినట్టే యిష్టపూర్వకముగా సేవచేయుడి. 8దాసుడైనను స్వతంత్రుడైనను మీలో ప్రతివాడును ఏ సత్కార్యముచేయునో దాని ఫలము ప్రభువువలన పొందునని మీరెరుగుదురు.**

"అదనపు అధ్యయనము: దాసత్వము"లో గల చారిత్రాత్మకమైన నేపథ్యం మరియు దాసులు మరియు యజమానులకు సంబంధించిన బైబిలు సంబంధమైన బోధనలు ఎఫెసీ పత్రికలోని ఈ విభాగమునకు అర్థవివరణ చెప్పుటకు సహాయకరముగా నుండును. వారు అన్యజనుల వలె గాక జ్ఞానుల వలె నడుచుకొనవలెనని చెప్పుచుండిన విషయాన్ని సంఘములోని యజమానులు మరియు దాసులకు అన్వయిస్తూ, పౌలు యింకను అదే అంశమును చర్చించుచుండెను.

**వచనము 5.** యజమానులు మరియు దాసులు ఒకే అంతిమ యజమానుడైనవానిని కలిగియుండిరి, యజమానుడు క్రీస్తె యుండెను (6:6, 9). ఏది ఏమైనా, గృహ సంబంధి విధులలో, **దాసులు** వారి **యజమానులకు**, అనగా "పరలోకమందున్న యజమానునికి" తారతమ్యముగా నుండిన ఇహలోక యజమానులకు, **శరీర విషయమై లోబడవలసినవారై యుండిరి** (6:9). **విధేయుడైన** అని అర్థమిచ్చు గ్రీకు క్రియా పదము *hupakouō*, *hupo*, అనగా ("క్రింద") మరియు *akouō*, అనగా ("వినుటకు") నుంచి ఉత్పన్నమైన ఒక సంయుక్త పదమై యున్నది. "ఈ పదము అత్యధికంగా లోబడుట, శ్రద్ధగా ఆలకించుట, అనుసరించుట, లొంగిపోవుట అని అర్థమిచ్చుచున్నది."[15] "లోబడి యుండుడి" అను మాటలు కొనసాగుచుండు చర్యను సూచించు ఒక క్రియా పద రూపమును అనువదించుచున్నవి, కాబట్టి దాసులు వారి యజమానులకు నిరంతరాయంగా **భయముతోను వణకుతోను** లోబడవలసినవారై యున్నారు. ఇటువంటి పదజాలములే పౌలు (1 కొరింథీయులకు 2:3), కొరింథీయులు (2 కొరింథీయులకు 7:15), మరియు ఫిలిప్పీయుల (ఫిలిప్పీయులకు 2:12) విషయంలో ప్రయోగింపబడినవి.

"భయము," *phobos* యొక్క అనువాదమై యుండి భార్యలు తమ భర్తల పట్ల (5:33; 1 పేతురు 3:2) మరియు పౌరులు వారి దేశము యెడల (రోమీయులకు 13:7) కలిగియుండవలసిన మర్యాదను గుర్తిస్తున్నది. ఈ సందర్భములో అది "పూజనీయము"[16] లేక "మర్యాద" అను అర్థమిచ్చుచున్నది. దాసులు తమ యజమానులకు ఇచ్చిన మర్యాద *tromos* యొక్క అనువాదమైయున్న "వణకు"తో కూడినదై యుండవలసి యుండింది. "వణకు" గూర్చి వ్యాఖ్యానించువారు దీని అర్థమును మృదుమధురం చేయుటకు అతిగా ప్రయాసపడాల్సిన అవసరం లేదు. దాసులు తమ యజమానులకు అదురు చేత ప్రేరేపింపబడు విధేయతతో, లేక, ఎస్. డి. ఎఫ్. సాల్మండ్ చెప్పుచున్నట్లు, "విధులను నిర్వర్తించుటకు గల ఆతృతతో కూడిన అమితోత్సాహముతో," "లోటు లేకుండా లోబడుటకు ఆతురత గల శ్రద్ధతో" లోబడవలసి యుండింది.[17]

**మనఃపూర్వకముగా అను పదము విధేయతకు** ప్రోత్సాహకమిచ్చు స్వచ్ఛమైన ప్రేరేపణను వర్ణిస్తుంది. "మనఃపూర్వకము" (*haplotēs*) నకు హృదయములోని "నిర్మలత్వము" లేక "విశ్వసనీయతకు" అను అర్థము కూడ కలదు.[18] "హృదయము" ఒకని వ్యక్తిత్వమునకు కేంద్రమై యున్నది; ఆలోచనలు, వైఖరులు, మరియు చర్యలు పుట్టుకొచ్చేది అక్కడనుంచే. దాసులు తమ యజమానుల యెడల కలిగియుండవలసిన విధేయతకు మూలాధారముగా, "హృదయము" నిర్మలముగాను, నిజాయితీతో నిండినదిగాను ఉండవలసినదై యుండింది. వారు తమ యజమానులకు ఉపచారము చేయుట **క్రీస్తు పట్ల** విధేయత చూపినట్లే అని వారు గుర్తించినప్పుడు దాసులు ఇటువంటి హృదయము కలిగియుందురు. అనుదినము లోబడుట నుండి క్రైస్తవులు మినహాయింపబడలేదు. వారు తమ ఇహలోక విధులను నిర్వర్తించుట ద్వారా వారు క్రీస్తు ఆధిపత్యమును గౌరవించుచుండిరి.

**వచనము 6.** వారిని తమ యజమానులు గమనించుచుండినా, గమనించకపోయినా, దాసులు తగిన విధంగా ఉపచారము చేయవలసినవారై యుండిరి. వారు కేవలము తమ యజమానులను సంతోషపెట్టవలెనని పనులు చేయకూడదు, కానీ దేవుని అనగా, తమ నిజమైన యజమానుని, రహస్యముగానైతేనేమి బహిరంగముగానైతేనేమి చేయబడు పనులను చూడువానిని, సంతోషపెట్టవలెనను తాత్పర్యముతో చేయుచుండవలెను. వారు **మనుష్యులను సంతోషపెట్టువారై** యుండకూడదు, కానీ **దేవుని సంతోషపెట్టువారై** యుండవలెను (కొలొస్సయులకు 3:22 చూడుము). వారి యజమానులను విశ్వసనీయంగా సేవించుట ద్వారా, దాసులు దేవుని చిత్తమును జరిగించుచుండిరి; ప్రేరేపణలో నిర్మలులై యుండుట ద్వారా, వారు **మనఃపూర్వకముగా**, అనగా "వారి పూర్ణ మరియు హృదయముతో" సేవచేయుచుండిరి.

**వచనములు 7, 8.** దాసుని హృదయము గూర్చి పౌలు తన వివరమును పొడిగించాడు. **యిష్టపూర్వకము**, *eunoia* యొక్క అనువాదమై యుండి, "అమితోత్సాహము, అత్యాసక్తి" అని అర్థమిచ్చుచున్నది.[19] దాసులు తమ యజమానులకు "భయముతోను వణకుతోను" మరియు "యిష్టపూర్వకముగాను" నిశ్చయాత్మకముగా లోబడవలసి యుండింది. వారు వ్యతిరేకార్థముగా కూడ లోబడవలసినవారై యుండిరి – అనగా, "కంటికి కనబడుటకే కాక" (అనగా, "యజమానుడు గమనించుచున్నప్పుడు మాత్రమే" చేయుట కాదు), కానీ అత్యాసక్తితో, "ఒకని శ్రేయస్సు కోరుచుండు మనస్తత్వంతో"[20] చేయుచుండవలెను. వారు

వాస్తవముగా **ప్రభువును** సేవించుచుండిరని గ్రహించినప్పుడు, దాసులు అత్యాసక్తితో లోబడగలుగుచుండిరి. ఇంకా, **ప్రతివాడు ఏ సత్కార్యము చేయునో దాని ఫలము ప్రభువు వలన పొందునని** దాసులు అర్థంచేసుకోవాలని పౌలు ఆశించుచుండెను.

తమ యజమానులను ఈ విధంగా సేవించినవారి యెడల, నిస్సందేహంగా, వారి యజమానులు వారి యెడల ఉత్తమంగా వ్యవహరిస్తారు గనుక వారు తమ జీవిత ప్రయాణమును మెరుగుపర్చుకొందురు. దాసులు తమ యజమానుల నుంచి గుర్తింపు పొందినా పొందకపోయినా, ప్రభువు, సమస్తమును చూచువాడు, చివరకు వారి విధేయతనుబట్టి వారికి సముచితమైన ప్రతిఫలము నిచ్చునని అభయమియ్యబడవచ్చును. "మీరు చేసిన కార్యమును ... మరచుటకు దేవుడు అన్యాయస్థుడుకాడని" హెబ్రీ పత్రిక రచయిత చెప్పుచున్నాడు (హెబ్రీయులకు 6:10). దేవుడు తరచుగా విధేయతకు గల ప్రతిఫలమును ఈ జీవితములో ఇచ్చును. కొండ మీద ప్రసంగములో, సరైన పనులు చేసినందుకు కొన్ని ప్రతిఫలములు ఇప్పుడే పొందవచ్చునను భావమును యేసు అభివ్యక్తము చేసాడు (మత్తయి 6:4, 6, 18 చూడుము), మిగిలినవి తరువాతి జీవితమునకు సురక్షితము చేయబడి యున్నవి. క్రైస్తవునికి పరలోకమందు ఇవ్వబడు "ప్రతిఫలము" మత్తయి 5:12, 46 మరియు 1 కొరింథీయులకు 3:8, 14లో పేర్కొనబడి యున్నది.

2 కొరింథీయులకు 5:10లో, "ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున, అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు, మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును." తమ యజమానులకు లోబడిన దాసులకు వారు ఈ జీవితములో చేసిన సేవలనుబట్టి దేవుడు వారికి అంత్య తీర్పు సమయంలో ప్రతిఫలము నిచ్చును. రక్షింపబడినవారందరు దేవుని కృప చేత సంపూర్తిగా రక్షింపబడి యున్నారు. ఏది ఏమైనా, "వాడు చేసిన సత్కార్యము ప్రకారము" తీర్పు దినాన క్రైస్తవుడు పొందవలసిన ప్రతిఫలము యింకా వున్నది.

**దాసుడైనను స్వతంత్రుడైనను** అను మాటలు దేవుడు తన ప్రజలతో నిష్పక్షపాతముగా వ్యవహరించునని తెలియజెప్పుచున్నవి (అపొస్తలుల కార్యములు 10:34 చూడుము). మొదటి శతాబ్దము నాటి గృహములలో దాసులు మరియు యజమానుల పరపతి ఎత్తిపట్టబడింది, కానీ అంత్య తీర్పు సమయాన సామాజికపరమైన ఈ తేడాలు లక్ష్యపెట్టబడవు. అంత్య విశ్లేషణలో, క్రీస్తునందున్నవారు సమానులై యుందురు (గలతీయులకు 3:27, 28).

### యజమానులు: "ఆదరాభిమానములను అభ్యసించుడి" (6:9)

**[9]యజమానులారా, మీకును వారికిని యజమానుడైనవాడు పరలోక మందున్నాడనియు, ఆయనకు పక్షపాతము లేదనియు ఎరిగినవారై, వారిని బెదరించుట మాని, ఆ ప్రకారమే వారియెడల ప్రవర్తించుడి.**

**వచనము 9.** దాసులు మరియు యజమానులకు మధ్య ఉండాల్సిన సంబంధముల గూర్చి ఇచ్చుచుండిన తన ఆదేశములను పౌలు ముగిస్తూ, ఆయన **యజమానుల** బాధ్యత గూర్చి మాటలాడాడు. **మరియు** (NASB) అను మాట ఈ విభాగమును

ప్రవేశపెట్టుచూ యజమానుడు మరియు అతని బాధ్యతను, దాసులు మరియు వారి బాధ్యతతో ముడిపెట్టుచున్నది. **ఆ ప్రకారమే వారి యెడల ప్రవర్తించుడి** అను మాటలు వారు ఒకే యజమానుని, ప్రభువైన యేసు క్రీస్తును, సేవించుచున్నారని దాసులు మరియు యజమానులు గుర్తించవలసిన అవసరమున్నదను వాస్తవమును సూచించుచున్నవి. యజమానులు, వారి దాసుల వలెనే, క్రీస్తునకు దాసులై యున్నారనియు గనుక వారు ఆయనకు జవాబుదారులై యున్నారనియు వారు అర్థంచేసుకొన్నట్లయితే, వారు తమ దాసుల యెడల ఎక్కువ శ్రద్ధ చూపించగలరు. యజమానులు **బెదరించుట మానవలెనని** ఆదేశింపబడుచున్నారు. దాసులు తమ యజమానుల యెడల కలిగియుండవలసిన అదే "యిష్టపూర్వకము"ను (6:7) యజమానులు వారి దాసుల యెడల కలిగియున్నట్లయితే, ఇరుపక్షములవారు ప్రయోజనపడుదురు. మొదటిదిగా, వారు జవాబుదారులై యున్న ఒక యజమానుడు వారికున్నాడని యజమానులు గుర్తించుదురు. రెండవదిగా, ఇరువురి మధ్య నుండు సంబంధములు అధికంగా ఆహ్లాదకరమైనవౌతాయి. మూడవదిగా, దాసులు విధేయతతో కూడిన ఆసక్తితో వారి యజమానులను సేవించునట్లు ప్రోత్సాహింపబడుదురు.

**ఆయనకు పక్షపాతము లేదు** అను మాటలు దేవుని యెదుట ప్రజలందరును సమానులే అను సత్యమును నొక్కివక్కాణించుచున్నవి. *Prosōpolēmpsia* అను గ్రీకు నామవాచక పదము, "పక్షపాతము" అను అర్థమిచ్చుచున్నది, అది "పక్షపాతము చూపించుట, కేవలము బాహ్య కారణాంశముల ఆధారంగా తీర్పు తీర్చుట" అను అర్థమిచ్చు హెబ్రీ వ్యక్తీకరణము నుండి ఉత్పన్నమగుచున్నది.[21] వారు తమ దాసుల కంటె ఉన్నతమైనవారను భావము గల అనుభూతి యజమానులలో ఉండింది. ఒక ప్రక్క ఇట్టి ఔన్నత్యము గృహసంబంధిత విషయములలో గుర్తింపబడుట కొనసాగుచుండగా, దేవుని యెదుట అందరు సమానులే అని మరొక ప్రక్క యజమానులు గుర్తుచేయబడుచుండిరి. కాబట్టి, వారు తమ దాసులు సహితము అత్యున్నతమైన యజమానికి, అనగా యేసు క్రీస్తునకు, తోటి దాసులై యున్నారని గుర్తుంచుకొంటూ వారి యెడల తగు విధంగా ప్రవర్తించవలసి యున్నదని యజమానులు గ్రహించవలెను. వారు ఈ బాధ్యతను నెరవేర్చినప్పుడు, యజమానులు అజ్ఞానుల వలె గాక జ్ఞానుల వలె నడుచుకొనుచున్నవారౌదురు.

### ప్రభువునందు బలముగా నిలిచియుండుట (6:10–20)

వారు అజ్ఞానుల వలె గాక జ్ఞానుల వలె నడుచుకొనవలెనని పౌలు క్రైస్తవుల నుద్దేశించి జారీచేయుచుండిన తన ఆదేశాలను, వారు దేవుడిచ్చు సర్వాంగ కవచాన్ని ధరించుకొనినవారై, ప్రభువు నందు బలవంతులై యుండవలెనను మందలింపుతో ముగించాడు. 4:1లో మొదలైన మహిమాన్వితమైన సంఘ అభ్యాసముల గూర్చిన తన చర్చను ఈ విభాగము ముగించుచున్నది. ఈ వచనములను మూడు భాగాలుగా భాగింపవచ్చును: "దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొని" "ప్రభువు నందు బలవంతులై యుండుడి" అంటూ విశ్వాసుల కియ్యబడిన మందలింపు (6:10–13), క్రైస్తవుని సర్వాంగ కవచమును గూర్చిన వర్ణన (6:14–17), మరియు దేవుని మీద ప్రార్థనలో ఆధారపడుటకు గల ఆవశ్యకత (6:18–20).

**మందలింపు: "బలవంతులై యుండుడి" (6:10)**

**[10]తుదకు ప్రభువుయొక్క మహా శక్తినిబట్టి ఆయనయందు బలవంతులై యుండుడి.**

**వచనము 10.** పౌలు వ్రాయుచున్న పత్రిక, నిస్సందేహంగా, సంఘము యెదుట బహిరంగముగా చదువబడింది. "తుదకు" అను మాట చదువబడినప్పుడు, సంఘ సభ్యులు వారి పైవస్త్రములను సర్దుకొని ఇంటికి వెళ్లిపోవుటనట్లు సిద్ధపడుటకు అది సమయం కాదు. సంఘము తమ మనుగడను సజీవంగా సాగించుటకు తరువాతి ఆదేశాలు ప్రాణాధారమైనంతగా ప్రాముఖ్యమైనవై యుండినవి. ఇట్టి ఆదేశాలు చదువబడవలెను, వాటిని వినవలెను, మరియు శ్రద్ధగా అన్వయించవలెను.

**తుదకు** (*tou loipou*)[22] అను మాట పౌలు తన పత్రికలో యింకా చెప్పాల్సి వుండిన విషయాన్ని పరిచయం చేస్తుంది. ఈ పదము 1 కొరింథీయులకు 7:29లోను హెబ్రీయులకు 10:12, 13లోను "ఇప్పటి నుంచి" అను అభిప్రాయాన్ని కలిగి వున్నది. ఈ సహోదరులు ఒక శక్తివంతమైన శత్రువును ఎదుర్కొనుచుండిరని పౌలు చెప్పుచుండి యుండవచ్చును గనుక వారు వర్తమాన కాలంలోను భవిష్యత్ కాలంలోను "ప్రభువునందు బలవంతులై యుండవలసి యుండింది."

**బలవంతులై యుండుడి** అను మాటలు క్రైస్తవులు ఎదుర్కొనుచుండిన పోరాటము గూర్చి పౌలు చేయుచున్న చర్చలోనికి మనలను నడిపిస్తూ, కనాను దేశం కోసం వారు చేయుటకు ఆరంభించిన పోరాట సమయంలో దేవుడు ప్రాచీన ఇశ్రాయేలుకిచ్చిన బాధ్యతను మనకు గుర్తుచేయుచున్నవి (యెహోషువ 1:6, 7, 9 చూడుము). "బలవంతులై యుండుడి" అనగా, క్రైస్తవులు తమ్మునుతాము "బలపర్చుకొనవలసి యున్నదని" అర్థం.[23] బలపర్చుబడు కార్యము ఒక బాహ్య మూలము, **ప్రభువు,** నుంచి జరుగవలసి యున్నది. ఈ పత్రికయందంతటను, "క్రీస్తు నందు" మరియు "ప్రభువు నందు" అను పదజాలమలు ప్రస్ఫుటంగా పేర్కొనబడినవై, వారేమైయున్నారో మరియు వారు, సంఘముగా, ఏమి నెరవేర్చవలెనని ఉద్దేశింపబడియున్నారో, ఎఫెసీయులకు గుర్తుచేయుచుండినవి.

ప్రభువు నుంచి పొందబడాల్సిన బలము "విశ్వసించు మన యెడల గల దేవుని సాటిలేని శక్తి యొక్క గొప్పతనము" (1:17–19) మరియు "అంతరంగ పురుషుని యందు ఆయన ఆత్మ ద్వారా" అబ్బజేయబడిన బలము (3:15–18) గూర్చిన గత విషయాలను జ్ఞప్తికి తెచ్చుచుండినదై యుండింది. "ప్రభువు నందు" అను పదజాలము క్రైస్తవులు కనుగొనవలసి యుండిన బలము యొక్క మూలమును మరియు పరిధిని గుర్తిస్తుంది.

ఈ శక్తిని రెండు పదములు వర్ణించుచున్నవి: **బలము** మరియు **శక్తి**. పౌలు చేత ప్రయోగింపబడిన గ్రీకు పదములు, *kratos* ("బలము") మరియు *ischus* ("శక్తి") పర్యాయపదములై యున్నవి. అవి దేవుని శక్తి యొక్క వెవ్వేరు కోణాలను సూచించుట కంటే ఎక్కువగా క్రైస్తవులకు అందుబాటులో ఉండిన గొప్ప శక్తిని నొక్కివక్కాణించు నిమిత్తము ప్రయోగింపబడినవి.

**ఆదేశము: "దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి" (6:11–17)**

**[11]మీరు అపవాది తంత్రములను ఎదిరించుటకు శక్తిమంతులగునట్లు దేవుడిచ్చు సర్వాంగ**

**కవచమును ధరించుకొనుడి. 12ఏలయనగా మనము పోరాడునది శరీరులతో కాదు, గాని
ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకారసంబంధులగు లోక నాథులతోను,
ఆకాశమండలమందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము. 13అందుచేతను
మీరు ఆపద్దినమందు వారిని ఎదిరించుటకును, సమస్తము నెరవేర్చినవారై నిలువబడుటకును
శక్తిమంతులగునట్లు, దేవుడిచ్చు సర్వాంగకవచమును ధరించుకొనుడి. 14ఏలాగనగా మీ
నడుమునకు సత్యమను దట్టి కట్టుకొని నీతియను మైమరువు తొడుకొని, 15పాదములకు
సమాధాన సువార్తవలననైన సిద్ధమనస్సను జోడుతొడుగుకొని నిలువబడుడి. 16ఇవన్నియుగాక
విశ్వాసమను డాలు పట్టు కొనుడి; దానితో మీరు దుష్టుని అగ్ని బాణమలన్నిటిని ఆర్పుటకు
శక్తిమంతులవుదురు. 17మరియు రక్షణయను శిరస్త్రాణమును, దేవుని వాక్యమును ఆత్మ
ఖడ్గమును ధరించుకొనుడి.**

**వచనములు 11, 12.** రోమా సామ్రాజ్య సైనికుడొకడు ధరించునటువంటి **కవచము** అను మాటలో దేవుని బలము మరియు కాపుదల చిత్రీకరింపబడి ఉన్నాయి. క్రైస్తవులు ప్రభువునందలి శక్తితో బలముగా నిలువబడవలసియున్నది ఏలయనగా మనము చావుబ్రతుకుల మధ్య కొనసాగుచున్న పోరాటంలో నిమగ్నమై యున్నాము, ఈ పోరాటంలో పోరాడేవారు దేవుడు మరియు దుష్టుడు. ఈ యుద్ధం ఇదివరకే జయింపబడింది, ఇది 1–3 అధ్యాయాల్లో విదితమయ్యింది, కానీ అనుదిన పోరాటాలు వ్యక్తిగతంగా పోరాడబడవలసి యున్నది. యుద్ధంలో గెలుగునట్లు, క్రైస్తవులు దేవుని శక్తిపై ఆధారపడవలసి యున్నది. క్రైస్తవ పోరును ఆయన వర్ణించినట్లుగా, సకల యుద్ధ సామగ్రితో సంపూర్ణ సంగ్రామానికి సన్నద్ధమైయున్న రోమా సైన్యాన్ని సాదృశ్యంగా పౌలు మన ముందుంచుచున్నాడు. *Panoplia*, "సర్వాంగ కవచము" అను పదము "సాయుధ దళాలు భారీగా సన్నద్ధం చేయబడిన, అనగా ఎదురు దాడిలో ఆత్మరక్షణార్థమై మరియు ఎదురు దాడి చేయుటకై సన్నద్ధం చేయబడిన సందర్భంలో, ఉపయోగింపబడిన పదమై యున్నది."[24]

క్రైస్తవుని యుద్ధ కవచము **దేవుడిచ్చునదై** యున్నది; ఈ రణరంగ ఉపకరణములకు మూలము ఆయనే. "మా యుద్ధోపకరణములు శరీరసంబంధమైనవి కావు గాని, దేవుని యెదుట దుర్గములను పడద్రోయజాలినంత బలము గలవై యున్నవని" పౌలు ఘోషించాడు (2 కొరింథీయులకు 10:4).

క్రైస్తవులు "దేవుడిచ్చు సర్వాంగ కవచమును" ఎందుకు ధరించాలో కారణం చెప్పబడియున్నది: **అపవాది తంత్రములను ఎదిరించుటకు శక్తిమంతులగునట్లు.** "శక్తిమంతులగునట్లు" (*dunamai*) అను మాట, విశ్వాసులు "శక్తిమంతులగునట్లు (*histēmi*)" వారిని సమర్థవంతులను చేయు దేవుని శక్తి ప్రస్తావింపబడిన సందర్భములో పౌలు చేత మరొక పర్యాయము 13వ మరియు 16వ వచనములలో ఉపయోగింపబడింది. శక్తివంతులై యుండుటయను అభిప్రాయము "ఒకని స్థానములో వాడు సుస్థిరంగా నిలువబడియుంటూ, ఎదిరిస్తూ, విరోధికి లొంగిపోకుండా వానికి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించుటను సూచించుటకు 13వ మరియు 14వ వచనములలో కూడ వెల్లడింపబడుచున్నది."[25]

క్రైస్తవులు ఎవరికి వ్యతిరేకంగా శక్తిమంతులై యుండాలి? **అపవాదికి** (*diabolos*). (అదనపు అధ్యయనము: మన విరోధి, అపవాది" చూడుము.) 12వ వచనములో, ఈ

విరోధిని పౌలు వర్ణించాడు: **ఏలయనగా మనము పోరాడునది శరీరులతో కాదు, గాని ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకారసంబంధులగు లోకనాథులతోను, ఆకాశమండలమందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము** (1:20, 21; 3:8–11 చూడుము). **క్రైస్తవులు ఆకాశమండలమందున్న సమస్త దుర్మార్గమును ఎదుర్కొనుచుందురు,** క్రీస్తు సువార్తకు విరోధముగా నడిపించు సాతాను దానంతటికి నాయకుడై యున్నాడు. పోరాట స్వభావమును దృష్టించినప్పుడు, క్రైస్తవులు దానిని జయించవలసి యున్నట్లయితే సర్వాంగ కవచము ఎంత అగత్యమై యున్నదో అర్థమౌతుంది.

సాతాను **తంత్రములను** (*methodeia*) రూపొందించుకొని యున్నాడు; అనగా, విశ్వాసులు తమ విశ్వాసములో సుస్థిరులై నిలువబడకుండునట్లు వారిని ఒక ఊపు ఊపుటకు వాడు "జిత్తులమారితనము" లేదా "కపటోపాయములు" వినియోగిస్తాడు.[26] విశ్వాసులపై దాడి చేయడానికి అపవాదికి అనేక మార్గాలున్నాయని బహు వచనములోనున్న ఈ పదము సూచించుచున్నది. తిమోతి "అపవాది ఉరిలో" చిక్కుకొనకూడదని పౌలు అతనిని హెచ్చరించాడు (1 తిమోతి 3:7; 2 తిమోతి 2:24–26).

దుష్టుని శక్తులు "క్రీస్తు చేత ఓడింపబడినవి, అట్లయినను విశ్వాసుల జీవితాల్లోనికి చొచ్చుకొని వచ్చి చివరకు అవన్నీ స్వాధీనం చేసుకొనబడక మునుపే సువార్త వ్యాపకమునకు సాధ్యమైనంత భంగం కలిగించడానికి యింకను ప్రయత్నించుచునే యున్నవని" పౌలు గమనించాడు.[27] అనగా, వాడు ఓడింపబడ్డాడని అపవాదికి ఎరుకే, అట్లయినను వానికి సాధ్యమైనన్ని ఆత్మలను తిరిగి తన స్వాధీనం చేసుకోడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడని మరొక మాటలో చెప్పుకొనవచ్చును. జవాబుదారీ వయస్సు వచ్చిన ప్రతి ఒక్కడు ఒకప్పుడు దుష్టుని అధీనంలో ఉండినాడు (2:1–3); కానీ దేవుడు క్రీస్తు యేసు ద్వారా చేసిన కార్యమును అంగీకరించుటనుబట్టి క్రైస్తవులు విడుదల గావింపబడ్డారు (2:4–22). క్రైస్తవ సైనికుల వలె, ఓటమిపాలలైనను యింకా శక్తిమంతమైన విరోధియై యున్నవానికి విరోధముగా శక్తిమంతులై సుస్థిరంగా నిలువబడి గెలుపొందునట్లు పోరాడుట వారి కార్యభారమై యున్నది.

"పోరాటము" (*palē*) అని అనువదింపబడిన పదము, సర్వసాధారణంగా *"కుస్తీ పట్టుట* వంటి ఒక పోటీని" చిత్రీకరించుచున్నది.[28] పౌలు తాత్పర్యము ఇదే అయియున్నట్లయితే, అతడు తన అర్థాలంకారమును సైనికుని నుండి కుస్తీ పట్టు వానికి మార్చివేసినట్లు అగుపించుచున్నది; ఏది ఏమైనా, ప్రాచీన కాలములో ఈ పదము "ఏ పోటీనైనను లేదా ఏ పోరాటమునైనను" సూచించుటకు ఉపయోగింపబడి యుండవచ్చును.[29] క్రైస్తవుని పోరాటము శత్రువుతో అత్యంత దరిదాపుల్లో జరుగుచుండునని సూచించుటకు పౌలు బహుశా తన పరిభాషను మార్చివేసియుంటాడు.

కంటికి కనబడనిదే, కానీ వాస్తవంగా నిజమైనదైయున్న శత్రువు – "ఆకాశమండలమందున్న దురాత్మల సమూహము" – శక్తిమంతమైనదై యున్నది.[30] వాని పరిపాలనా పరిధి "అంధకార సంబంధమైన అధికారమని" సంబోధింపబడుచున్నది (కొలొస్సయులకు 1:13). ఆత్మలను మోసపుచ్చి కైవశం చేసుకోడానికి, వాడు అబద్ధ బోధకులను, వంచించు సిద్ధాంతములను, మరియు నకిలీ ఆరాధనా స్థలాలను ప్రయోగించుచుండును.[31] ప్రజలను "సాతాను అధికారము నుండి దేవుని వైపునకు"

త్రిప్పుట పౌలు యొక్క ప్రేషితోద్యమమై యుండింది (అపొస్తలుల కార్యములు 26:16–18). క్రైస్తవులమైన మనము ఇటువంటి శక్తిని ఎదుర్కొని జయించవలెనంటే, మనకు దేవుని సహాయము అత్యావశ్యకమై యున్నది.

**వచనము 13. దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి.** ఈ ఆజ్ఞకు ఎల్లప్పటికీ ఒక్కమారే లోబడవలసి యున్నదని "ధరించుకొనుడి" అని అర్థమిచ్చునట్లు అనువదింపబడిన క్రియా రూపక పదము సూచించుచున్నది. క్రైస్తవ సైనికులు "దేవుడిచ్చు సర్వాంగ కవచమును" ధరించుకొని దానిని నిరంతరాయంగా ఉంచుకొనవలసినదే.

అటుతరువాత పౌలు, **అందుచేతను మీరు అపద్దినమందు వారిని ఎదిరించుటకు** అని చెప్పుచున్నాడు. "ఆపద్దినమందు" అను మాటలు చెలరేగనై యుండిన చెడును సూచింపవచ్చును. క్రీస్తు రెండవ రాకడకు కొద్ది కాలమునకు ముందు చెడు గొప్పగా పెరిగిపోవునని కొందరు వ్యాఖ్యానకర్తలు నమ్ముదురు. బహుశా ఇది సత్యముగానే రుజువుకావచ్చును, కానీ 5:15లో ఎఫెసీయులు జీవించుచుండిన కాలము చెడ్డదై యుండినదని పౌలు చెప్పుచున్నాడు. కాబట్టి, వారు వర్తమాన కాలములో ఎదుర్కొనుచు, భవిష్యత్ కాలములో ఎదుర్కొననై యుండిన దుర్దినముల యందు శోధనలను ఎదిరించునట్లు తమ్మునుతాము సన్నద్ధంచేసుకోడానికి దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించవలెనని పౌలు మామూలుగా చెప్పియుండవచ్చును.

"ఎదిరించుట," *anthistēmi* యొక్క అనువాదమై యుండి, "... నకు విరోధముగా ఒకడు తనను తాను సన్నద్ధం చేసుకొనుట ... తట్టుకొనునట్లు, ఎదిరించునట్లు" అని అర్థమిచ్చుచున్నది.[32] వచనములోని చివరి భాగము చెప్పుచున్నట్లుగా, వారు పోరాటంలో జయప్రదం కావలెననునది అభిప్రాయమై యున్నది. **నెరవేర్చినవారై**యను మాటలు "చేయవలసి, నెరవేర్చవలసి, సధించవలసి యున్నది, ఏదో ఒక ఫలితము వచ్చు పని చేయవలసి యున్నది, ఏదైన ఒక కార్యమును దాని అంతము వరకు కొనసాగించవలెను" అను అవగాహన నిచ్చుచున్నవి.[33] వారు, దేవుడు సమకూర్చిన యుద్ధోపకరణములను ధరించుకొన్నవారై, **సుస్థిరముగా నిలువబడుటకును** విజయము సాధించుటకును **సమస్తము** నెరవేర్చబడి యున్నదని నిశ్చయపర్చుకొనునట్లు క్రైస్తవ సైనికులు దేవుడిచ్చు కవచమును ధరించుకొనవలెను.

**వచనము 14.** పౌలు మరొక పర్యాయము **నిలువబడుటకు శక్తిమంతులై యుండుటను** బుద్ధిమాటలు చెప్పుచున్నాడు (6:11, 13 చూడుము). ఇది పౌలు తన ఇతర పత్రికలలో కూడ తరచుగా ప్రయోగించుచుండిన ఒక పదజాలమై యున్నది. కొరింథు పట్టణములోని సంఘము సువార్తయందు నిలువబడి యుండిరి, గనుక సహోదరులు ""విశ్వాసమందును నిలుకడగా ఉండవలెనని" ఆయన వారికి గుర్తుచేస్తాడు (1 కొరింథీయులకు 15:1, 2; 16:13). రోమీయులకు వ్రాస్తూ, "మనము విశ్వాసము వలన ఈ కృపయందు నిలిచియున్నామని" అంటూ, వారు "విశ్వాసమునుబట్టి నిలిచియుండిరని" చెప్పుచున్నాడు (రోమీయులకు 5:2; 11:20). వారు "ఏక మనస్సుగలవారై నిలిచియున్నారని" అభయమిస్తూనే, వారు "ప్రభువునందు స్థిరులై యుండవలెనని" పౌలు ఫిలిప్పీయులను హెచ్చరించాడు (ఫిలిప్పీయులకు 1:27, 28; 4:1). కొలొస్సయులు "సంపూర్ణులును, ప్రతి విషయములో దేవుని చిత్తమును గూర్చి సంపూర్ణాత్మ నిశ్చయతగలవారునై నిలుకడగా ఉండవలెనని"

ఆయన స్నేహితుడైన ఎఫఫ్రా వారి కొరకు ప్రార్థించాడు (కొలొస్సయులకు 4:12).[34] మనముందున్న వాక్య భాగములో, దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుట వలన ఎఫెసీయులు "నిలువబడుటకు శక్తిమంతులగుదురని" పౌలు చూపించాడు.

**నడుమునకు సత్యమను దట్టి కట్టుకొని** అను మాటలు రోమా సైనికులు ధరించుచుండిన యుద్ధోపకరణములను ఎఫెసీయుల మనస్సులకు కచ్చితంగా గుర్తుచేసియుండును. ఎఫెసీయులకు తన పత్రికను వ్రాయుచుండిన సమయంలో పౌలు రోమా పట్టణంలో గృహనిర్బంధములో ఉండెను గనుక, సైనికులు ఆయన కంటికి ప్రతి దినము కనబడుచుండిరి. క్రైస్తవుడు తన ఆధ్యాత్మిక పోరాటమును పోరాడుచు విజయము సాధించుటకు యుద్ధోపకరణములను ధరించవలసిన అవసరమును వారు ఆయనకు గుర్తుచేసియుందురు.

దురాత్మల సమూహమునకు విరోధముగా కొనసాగుచుండు పోరాటము, విశ్వాసుల మనస్సుల్లో చెలరేగుచుండు ఒక పోరాటమై యున్నది. పౌలు కొరింథీయులకు ఈ క్రింది విధంగా వ్రాసినప్పుడు, సరైన రీతిలో ఆలోచించుటకుగల ప్రాముఖ్యతను ఆయన వారికి వివరించుచుండెను,

> మేము శరీరధారులమై నడుచుకొనుచున్నను శరీరప్రకారము యుద్ధముచేయము. మా యుద్ధోపకరణములు శరీరసంబంధమైనవి కావుగాని, దేవునియెదుట దుర్గములను పడద్రోయజాలినంత బలము కలవై యున్నవి. మేము వితర్కములను, దేవునిగూర్చిన జ్ఞానమును అడ్డగించు ప్రతి ఆటంకమును పడద్రోసి, ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి (చెరపట్టుచున్నాము) (2 కొరింథీయులకు 10:3–5).

వాడు కోరుచున్న విధంగా మనము ఆలోచించవలెనని, మనము ఆలోచించునట్లు సాతాను మనలను ప్రభావితం చేయగలిగినట్లయితే, మన పోరాటంలో మనము ఓటమి పాలైనట్లే. సాతాను మన అవగాహనకు అందని కుటిల వర్తనుడనియు, గనుక మన ఆలోచనా ప్రక్రియలను ప్రభావితం చేయడానికి వాడు సమస్త విధములైన సాధనములను సద్వినియోగం చేసుకొంటాడనియు మనమెన్నటికినీ మర్చిపోకూడదు. మనఃకల్పిత విద్య సాతాను హస్తాల్లో శక్తిమంతమైన ఒక ఉపకరణమై యున్నది. "మీ మనస్సు అను నడుము కట్టుకొని[35] నిబ్బరమైన బుద్ధిగలవారై ... యుండుడని" పేతురు చెప్పుచున్నాడంటే, ఆశ్చర్యమేమియు కలుగదు (1 పేతురు 1:13).

"నడుములు," *osphun*, తుంటి మరియు తొడలకు పైన మరియు భుజములకు క్రింద గల భాగమును సూచించుచున్నది. "దట్టి కట్టుకొని" (*perizōnnumi*) అనగా, ఒకడు తన వస్త్రములు జారి పడిపోకుండునట్లు వాటిని "ఒక దట్టీతో లేక బెల్టుతో" కట్టుకొనుట యని అర్థము.[36] క్రైస్తవ సైనికుడు దుష్టునికి విరోధముగా పోరాడుటకు తగు రీతిలో నిలియుండక మునుపు అతడు దేవుని సహాయముతో చేయవలసిన ముఖ్యమైన పనై యుండినది. రోమా సైనికుని జీవితంలో, బెల్టు అత్యంత ప్రాముఖ్యమైన అంశమై యుండినది. నడుమునకు దట్టి కట్టుకొనుట వలన వాడు పోరాటమునకు సమర్థవంతముగా సన్నద్ధమై యుండునట్లు చేసినది (లూకా 12:35, 37 చూడుము).

దట్టి, ఇతర యుద్ధోపకరణమును కూడా కలిసికట్టుగా కట్టబడియుండునట్లు చేసి పోరాటము కొరకు సైనికుని సిద్ధంచేసినది, "సత్యము"ను సూచించుచున్నది. వస్తుగత

అవగాహన ప్రకారం, "సత్యము" దేవుని వాక్యమై యున్నది (యోహాను 17:17). ఎఫెసీ పత్రికలో అది సువార్తయై యున్నది (4:20, 21 చూడుము). ఈ "సత్యము" మనుష్యులను స్వతంత్రులనుగా చేస్తుంది (యోహాను 8:32). దానిని వినవలెను, ప్రేమించవలెను, విశ్వసించవలెను, ప్రతిరక్షించవలెను, మరియు దానికి లోబడవలెను.[37] ఈ సత్యము లేకుండా క్రైస్తవ సైనికుడు పోరాటమునకు సంసిద్ధుడు కాజాలడు.

దేవుడిచ్చు సర్వాంగ కవచమును గూర్చిన సందర్భములో, పౌలు యెషయా 11:5ను ఉల్లేఖించుచున్నాడు, అచ్చట రానైయుండిన మెస్సీయా యొక్క "సత్యము," నీతి మరియు విశ్వాసనీయత (సత్యము) యను నడికట్టుగా ప్రస్తావింపబడినది.[38] 14 మొదలుకొని 17 వరకు గల వచనములలోని అనేక ప్రతిరూపములు పాత నిబంధనలో నుండి తీసికొనబడినవి. కాబట్టి, వాక్యభాగములోని కొన్ని మాటలు NASBలో చిన్న అక్షరములలో వ్రాయబడి యున్నవి.

దట్టి "దేవుని సత్యసంధత గూర్చి కూడ ప్రయోగింపబడినట్లుగా (రోమీయులకు 15:8, 9), *సరళత, నిష్కాపట్యము, నిజాయితీ* ... అను వ్యక్తిగతమైన అనుగ్రహమును సూచించుచున్నది."[39]

> ... మనము దేవునితో సలుపుచుండు సంభాషణలలో *నిష్కాపట్యము, నిజాయితీ, వాస్తవము,* గూర్చిన ఈ సామాన్య అనుగ్రహము, మోసములను అభ్యసించక, మారువేషములను వేయని మనస్సు, నిజముగా క్రైస్తవ క్షేమమునకు ప్రాణాధారమైనంటిదిగాను, శీలములోని ఇతర గుణగణాలన్నీ సక్రమంగా పనిచేయుటకును ప్రాథమికమునై యున్నది.[40]

క్రైస్తవ యోధుడు దేవుని వాక్యమును సత్యముతోను వ్యక్తిగత రాచభక్తితోను మరియు విశ్వసనీయతతోను దట్టి కట్టుకొనవలసి యున్నది.

**నీతి యను మైమరువు తొడుగుకొని** అను మాటలు సైనికుని యుద్ధోపకరణములో భాగమైయున్న మైమరువు వాని గుండె మరియు ఇతర ప్రాణాధారమైన అవయవములకు కాపుదల నిచ్చినదని ఎఫెసీయులకు గుర్తుచేసినవి. "నీతి" క్రైస్తవుని హృదయమునకు కాపుదలయై యున్నది. యోధుని దట్టి విషయాన్ని పేర్కొన్నప్పుడు, మెస్సీయా గూర్చి యెషయా చిత్రీకరించుచుండిన సంగతిని ప్రస్తావించినట్లే, "నీతిని కవచముగా ఆయన ధరించుకొనెనని" ప్రభువు గూర్చి యెషయా చేసిన వర్ణనను పౌలు ఇచ్చట ఉపయోగించుచున్నాడు (యెషయా 59:17). సమానాంతరమైనవై యున్న ఈ వాఙ్మూలములు మెస్సీయా "నీతి" ఆయన "విశ్వసనీయత"యై యున్నదని చిత్రించుచున్నవి. యెషయా రచించిన వాక్యభాగములో దేవుని మరియు మెస్సీయా యొక్క "నీతి"ని తెలియజేయుచున్న హెబ్రీ పదములు నైతిక కోణంలో "న్యాయము" అను అర్థమునిచ్చుచున్నవి.[41]

క్రొత్త నిబంధనలో చెప్పబడుచున్న "నీతి" మనము క్రీస్తు యేసు ద్వారా దేవునితో కలిగియుండు సంబంధమునకు సంబంధించినదై యున్నది. "మీరు పాపమునకు దాసులైయున్నప్పుడు నీతి విషయమై నిర్బంధము లేనివారై యుంటిరి" (రోమీయులకు 6:20). ఈ మాటలు వ్రాసినప్పుడు, పాపము పాపిని దేవుని నుండి వేరుపర్చును గనుక పాపికి దేవునితో సంబంధం లేదని పౌలు భావించాడు (యెషయా 59:1, 2 చూడుము).

క్రీస్తే మన "నీతియై" యున్నాడు (1 కొరింథీయులకు 1:31). ఏలాగనగా దేవుడు "మనము ఆయనయందు దేవుని నీతి అగునట్లు, పాపమెరుగని యేసును మన కోసము పాపముగా చేసెను" (2 కొరింథీయులకు 5:21). ఒకడు క్రీస్తునందు బాప్తిస్మము పొందినప్పుడు, వాడు క్రీస్తును ధరించుకొనియున్నాడు (గలతీయులకు 3:27) గనుక వాడు నీతికి దాసుడగును (రోమీయులకు 6:18). సువార్తలో నివేదింపబడిన "నీతి" ఇదే గనుక అది విధేయతతో కూడిన విశ్వాసముతో అంగీకరింపబడవలెను (రోమీయులకు 1:1–7, 16, 17). అబ్రాహాము నీతిమంతుడై యున్నాడని దేవుని చేత పరిగణింపబడినది విధేయతతో కూడిన విశ్వాసమునుబట్టియే (రోమీయులకు 4:22). ఎవడైనను క్రీస్తు యెడల విధేయతతో కూడిన విశ్వాసముతో ప్రతిస్పందించినప్పుడు, వాడు నీతిమంతుడుగా దృష్టింపబడును (రోమీయులకు 4:23, 24). "నీతి" అనగా దేవునితో సరైన సంబంధము కలిగియుండుటయని అర్థము.

"నీతియను మైమరువు" ఇదివరకే పాపములు క్షమింపబడి దేవునితో సమాధానపరచబడిన వారి కొరకు ఉద్దేశింపబడినదై యున్నది. కాబట్టి, క్రైస్తవుని యుద్ధోపకరణములో ఒక భాగముగా పౌలు చేత ప్రస్తావింపబడుచున్న "నీతి," దేవుడు మరియు మెస్సీయా "నీతిమంతులై యున్నారని" లేక న్యాయము చేయుటలో విశ్వసనీయమైనవారై యున్నారని గుర్తుచేయుచున్నది. సరైన దానినే చేయుట లేదా న్యాయముగా ప్రవర్తించుటయను గుణ లక్షణము క్రైస్తవ యోధుని యుద్ధోపకరణములో ప్రాణాధారమైనంతటి ముఖ్యమైన భాగమై యున్నది.

**వచనము 15.** ఆ తరువాత, **పాదములకు సమాధాన సువార్తవలననైన సిద్ధమనస్సను జోడు తొడుగుకొని నిలువబడుడని** పౌలు చెప్పుచున్నాడు. ఈ వాఙ్మూలము యెషయా 52:7ను ప్రతిధ్వనించుచున్నది, ఇది "సువార్త ప్రకటించుచు సమాధానము చాటించుచు, సువర్తమానము ప్రకటించుచు, రక్షణ సమాచారము ప్రచురించువాని పాదముల" గూర్చి చెప్పుచున్నది. ఆయన రోమీయులకు వ్రాసిన పత్రికలో, సువార్తను ప్రకటించువాని గూర్చి చెప్పిన సందర్భములో పౌలు ఈ వాక్యభాగమును ఉల్లేఖించాడు (రోమీయులకు 10:15). ఏది ఏమైనా, ఈ సందర్భములో పౌలు పాదములను ప్రకటించుటతో ముడిపెట్టుటకు బదులుగా సిద్ధపాటుతో జోడించాడు.

పోరాటములో జయప్రధుడగుటకు సైనికునికి సరైన పాదరక్షలు అవసరమై యున్నవి. "తొడుగుకొని" అను మాట *hupodeō* యొక్క అనువాదమై యున్నది గనుక "క్రింద కట్టుకొనుట, కాళ్లకు చెప్పులు వేసుకొనినట్టుగా కట్టుకొనుట; అందుచేత, జోడు తొడుగుకొనుట" అను అక్షరార్థము నిచ్చుచున్నది.[42] రోమా సైనికుడు తోలుతో చేయబడిన జోడు యొక్క అడుగు భాగమును తోలు వారులతో తన పాదములకు మరియు కాళ్లకు కట్టుకొంటాడు. "వాడు కూడా, ఇతర సైనికులందరి వలెనే, లావుపాటి మరియు పదునైన మేకులతో నిండుగా నిండియుండిన జోడు తొడుగుకొని యుండెనని" జోసీఫస్ యెరూషలేములోని ఒక రోమా సైనికుని గూర్చి చెప్పుచున్నాడు.[43] సైనికుడు యుద్ధము చేయునప్పుడు తన కాళ్లను నిశ్చలముగా నిలిచి యుంచుకొనుటకు ఈ మేకులు వానికి సహాయకరముగా ఉండినవి.

పౌలు ఉద్ఘాటన "సిద్ధపాటు"పై ఉన్నతంగా, నిశ్చలముగా నిలిచియుండుట పై (11వ మరియు 13వ వచనములలో ఇదివరకే నివేదింపబడిన ఒక భావము)

ఉండియుండకపోవచ్చును. పౌలు ప్రయోగించిన పదము *hetoimasia* అయియున్నది, ఇదొక గ్రీకు నామవాచక పదమై యుండి, "సిద్ధత, ఆయత్తము" అని అర్థమిచ్చుచున్నది.[44] క్రైస్తవ యోధుని "సిద్ధపాటు" "సువార్త వలననైన సమాధానము" చేత కలుగనై యున్నది. ఇదే పత్రికలో ఇంతకు మునుపు, పౌలు క్రీస్తే "మన సమాధానమై యున్నాడని" చెప్పాడు (2:14). పౌలు యూదులకును అన్యజనులకును మధ్య సమాధానమును నెలకొల్పి ఈ ఇరువురిని దేవునితో సమాధానపర్చాడు (2:15, 16). ఆయన సిలువపై చిందించిన రక్తము వలన ఈ సమాధానమును కలుగజేయుట ద్వారా, క్రీస్తు సకల జనులకు సమాధానమును ప్రకటించాడు (2:17). సువార్త, సమాధానమును గూర్చిన సందేశమై యున్నది. సాతాను చేత వానిపై పడుచుండు ప్రతి దాడిని ఎదిరించుటకు క్రైస్తవ సైనికుడు సిద్ధంగా ఉండగలడు ఏలయనగా, "సువార్త వలననైన సమాధానము" వానిని సంసిద్ధం చేస్తుంది. క్రైస్తవ యోధుడు శత్రువును ధైర్యముగా ఎదుర్కొనునట్లు వాడు దేవునితోను తోటి క్రైస్తవులతోను కలిగియుండు సమాధానము వానిని ప్రేరేపించును.

**వచనము 16. ఇవన్నియుగాక** అను పదము అక్షరాలా "అన్నింటిలో" అని అర్థమిచ్చుచున్నది. ఈ అభివ్యక్తము "అన్ని పరిస్థితులలో" అని అర్థమీయవచ్చును; కానీ సందర్భము క్రైస్తవుని యుద్ధోపకరణములోని భాగముల గూర్చినదై యున్నందునుబట్టి, "యుద్ధోపకరణములన్నిటితో కూడా అదనంగా" అని అర్థం చేసుకొనుట సరైనదై యుండును.

సరిగ్గా దీని తరువాతే **విశ్వాసమను డాలు పట్టుకొనుడి** అను మాటలు లిఖితమై యున్నవి. ప్రస్తావింపబడుచున్న "డాలు" (*thureos*) "బారీగా సన్నద్ధం చేయబడిన కాల్బలము యొక్క డాలై యున్నది, అదొక విస్తృత పరిధిగల, దీర్ఘచతురస్రంగా ఉన్న, నాలుగడుగులు పొడవు మరియు రెండున్నర అడుగుల వెడల్పుగల, కొన్ని పర్యాయములు లోపలి భాగంలో వంచబడియున్న డాలై యున్నది."[45] ఈ రకమైన డాలు సైనికుని శరీరమంతటిని కాపాడుటకు రూపొందింపబడియున్నది. "విశ్వాసము" క్రైస్తవుని డాలైయున్నది, ఈ భావము ఎఫెసీ పత్రికయందంతటను కనబడుచున్నది (1:13, 15; 2:8; 3:12, 15–18; 4:5, 11; 6:23). నిజమైన విశ్వాసము సువార్త సత్యము గూర్చిన ఒప్పింపు, దేవుని వాగ్దానములలో మరియు ఆయన శక్తిలో గల నమ్మిక, మరియు దేవుని ఆజ్ఞలకు విధేయతతో లోబడుటయై యున్నది. ఈ స్థాయిలో ఉండు విశ్వాసము క్రైస్తవుని ఉనికి మొత్తమును కాపాడుతుంది ఏలయనగా అది "దుష్టుని దాడుల నడుమ దేవుని మూలాధారములను గట్టిగా పట్టుకొంటుంది గనుక శత్రువు వాని మీదికి వేయుచుండు దేనినైనను అడ్డగించి ఆర్పివేయగల నిశ్చలమైన సంకల్పమును పుట్టింస్తుంది."[46]

క్రైస్తవుడు "విశ్వాసమను డాలును" **దుష్టుని అగ్ని బాణములన్నిటిని ఆర్పుటకు** ఉపయోగిస్తాడు. "అగ్ని బాణములు," "తారులో ముంచబడి, అవి వేయబడక మునుపు వాటికి నిప్పంటించి వేయబడిన బాణములైన యుండును."[47] సైనికుని డాలు, కర్రతో చేయబడింది మరియు కొన్ని పర్యాయములు దాని పైభాగంలో నీళ్లలో ముంచబడిన తోలుతో కప్పబడి యుండింది,[48] శత్రువు వేయుచుండిన "అగ్ని బాణములను" అడ్డగించుటకు ఒక సార్థకమైన సాధనమై యుండింది. క్రైస్తవుని "విశ్వాసమను డాలు" చెడు యొక్క సకల విధములైన, అబద్ధ బోధలు, హింసలు, శోధనలు, ఆతురతలు, మరియు భయములతో

సహా, "అగ్ని బాణములను అన్నింటిని" తట్టుకొనుటకు సమర్థవంతమైనదై యున్నది.

ఆంగ్లములో వ్రాయబడియున్న "దుష్టుడైన ఒకడు" అను పదజాలములోని "ఒకడు" గ్రీకు మూల గ్రంథ పాఠములో అగుపించదు. ఈ ప్రస్తావన అపవాది, లేదా సాతానుకు, దుష్టత్వమునకు అధిపతియైన వానికి, సంబంధించినదై యున్నదని సూచించుటకే అనువాదములో సరైన పదము లిఖింపబడింది (ఎఫెసీయులకు 6:12 మరియు మత్తయి 6:13 పోల్చి చూడుము). సాతాను క్రైస్తవులపై శక్తిమంతమైనది మరియు పట్టువిడువని ఒక వాడిని ఎక్కుపెట్టి యున్నాడు, కానీ మనము మన మనుగడ సాగించుటకును వానిపై విజయము సాధించుటకును "విశ్వాసమను డాలు" మనకు సహాయకరముగా నుండును. "లోకమును జయించిన విజయము మన విశ్వాసమే" అని యోహాను భక్తుడు వ్రాస్తున్నాడు (1 యోహాను 5:4).

ఇతర యుగములందలి దేవుని ప్రజల విశ్వాసమును, ఉదాహరణ హెబ్రీయులకు 11:33, 34లో వర్ణింపబడిన వారి విశ్వాసమును పౌలు నొక్కి వక్కాణించుచున్నాడు:

> వారు విశ్వాసముద్వారా రాజ్యములను జయించిరి; నీతికార్యములను జరిగించిరి; వాగ్దానములను పొందిరి; సింహముల నోళ్లను మూసిరి; అగ్నిబలమును చల్లార్చిరి; ఖడ్గధారను తప్పించుకొనిరి; బలహీనులుగా ఉండి బలపరచబడిరి; యుద్ధములో పరాక్రమశాలులైరి; అన్యుల సేవలను పారదోలిరి.

వర్తమాన యుగములో, ఇదే విధమైన విజయములు సాధింపబడినవి మరియు సాధింపబడును.

**వచనము 17.** క్రైస్తవుడు తన యుద్ధోపకరణమును ధరించుకొనుటలో గల తరువాతి మెట్టు, **మరియు రక్షణయను శిరస్త్రాణమును ... ధరించుకొనుటయై** యున్నది. మరొక పర్యాయము, ఈ మాటలు యెషయా 59:17లో నుండి తీసికొనబడినవే. రోమా సైనికుని శిరస్త్రాణము శత్రువు యొక్క పిడిగుద్దుల నుంచి వాని తలకు తగిన కాపుదల నిచ్చింది. ఉత్తమోత్తమంగా, ఇవి ఒకనికి దిగ్భ్రమ కలిగించునవై యుండును; ఘోరాతి ఘోరమైన కోణంలో, అవి ప్రాణాంతకమైనవై యుండవచ్చును. వాని మనస్సును పాడుచేయుటకు శత్రువు ప్రయోగించు సందేహము మరియు నిరాశయను పిడిగుద్దుల నుంచి క్రైస్తవవుడు తననుతాను కాపాడుకొనవలసిన అవసరం ఎంతైనా ఉన్నది ఏలయనగా ఇది వానిని తికమకపెట్టవచ్చును లేదా చివరకు ఆధ్యాత్మిక మరణం కలుగజేయవచ్చును. "ధరించుకొనుడి" (*dechomai*) అను మాట, ఇవ్వబడిన ఆజ్ఞ "అదే క్షణంలో ఆరంభం కావలసియున్న"[49] విధేయతకు పిలుపునిచ్చుచున్నదని సూచించుచున్నది. మధ్యవర్తిత్వము వహించుచున్నటువంటి స్వరం "కర్తయైయున్నవాడు ఏదో ఒక విధంగా తనపై తానే చర్య తీసుకొనుచ్చున్నట్లు లేదా విషయం తనకే సంబంధించినదైయున్నట్లు వానికి ప్రతినిధిగా ఉంటున్నది."[50] అనగా, క్రైస్తవుని సొంత కాపుదల నిమిత్తము, మరొకని చేత వానికియ్యబడుచున్న దానిని పొందుటకు వాడు తత్క్షణమే చర్య తీసికొనవలసియున్నదని మరొక మాటలో చెప్పుకొనవచ్చును. మరొకరి చేత ఇవ్వబడుచున్నది రక్షణయై యున్నది, గనుక దానిని అనుగ్రహించుచున్నవాడు దానిని దేవుని కృపావరముగా ఇచ్చుచున్నాడు.

కాబట్టి, "రక్షణ," ఎఫెసీయుల వర్తమాన సొత్తై యుండింది. వారి రక్షణ కార్యము *గతంలో*

దేవుడు చొరవ తీసుకొనుట ద్వారా, క్రీస్తు మరణించుట ద్వారా, మరియు ఎఫెసీయులు దానిని అంగీకరించుట ద్వారా జరిగింది (2:1–22 చూడుము). *వర్తమాన కాలంలో* అది కొనసాగింది, ఏలయనగా అదే క్షణంలో వారు "పరిశుద్ధులై" "క్రీస్తునందు విశ్వసనీయులై" యుండిరి (1:1). వారు "ఇప్పుడు క్రీస్తు యేసునందున్నారు" (2:13), "పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును దేవుని యింటివారునై యున్నారు" (2:19). ఈ రక్షణ భవిష్యత్‌కాల అంతర్భావములను కలిగియుండింది. వారు "రక్షణ నిరీక్షణయను శిరస్త్రాణమును" ధరించుకొనవలసి యున్నదని పౌలు థెస్సలొనీకయులకు చెప్పాడు (1 థెస్సలొనీకయులకు 5:8). పరలోకమందలి కడపటి రక్షణ యింకా భవిష్యత్ కాలమునకు సంబంధించినదై యున్నది, ఈ క్రైస్తవులు కలిగియుండిన నిరీక్షణ దాని గూర్చినదే.

ఎఫెసీయులు దేవుని నుండి పొందిన రక్షణకు సంబంధించిన వర్తమాన, భూత, భవిష్యత్‌కాల కోణాలు వారి మనస్సులను తప్పుడు ఆలోచనా ధోరణుల నుంచి కాపాడును. వారు గతంలో రక్షింపబడియుండిరి, వర్తమాన కాలంలో రక్షింపబడిరి, మరియు చివరకు పరలోకంలో రక్షింపబడుదురను దృఢనిశ్చయం వారు కలిగియుండిరి. ఈ అభయం, క్రైస్తవుడు ఆధ్యాత్మిక పోరాటంలో నిమగ్నమై యున్నప్పుడు వాని తలను కాపాడు రక్షణ శిరస్త్రాణమై యున్నదని వర్ణింపబడింది.

క్రైస్తవుని సర్వాంగ కవచంలోని ఆక్రామకమైన ఒకే ఒక్క యుద్ధోపకరణం, **దేవుని వాక్యమను ఆత్మ ఖడ్గమై యున్నది.** "ఖడ్గము," *machaira* యొక్క అనువాదమై యున్నది, అది రోమా సైనికుడు కలిగియుండిన "పొడవాటి మరియు వెడల్పైన ఖడ్గమునకు" వ్యతిరేకమైనదై యుండి, వాని చేత ఉపయోగింపబడిన పదునైన చిన్న ఖడ్గమై యుండింది.[51] శీఘ్రగతిన పొడవలసి వచ్చినప్పుడు మరియు శత్రువు యొక్క పిడిగుద్దుల నుంచి తప్పించుకొనుటకు చిన్న ఖడ్గము ఉపయోగింపబడింది. క్రైస్తవ సైనికుడు తన పరిధిని ప్రతిరక్షించుకొనుటకు నిశ్చలంగా నిలువబడి యుండుట మాత్రమే కాదు, కానీ "దేవుని వాక్యమను **ఆత్మ** ఖడ్గమును" వినియోగించుట ద్వారా క్రీస్తు సువార్తను ముందుకు తీసుకొని వెళ్లుచుండవలెను.

"దేవుని వాక్యము" "**ఆత్మ** ఖడ్గము" అని పిలువబడుచున్నది ఏలయనగా దానిని మానవునికి తెలియజెప్పినవాడు పరిశుద్ధాత్మయే (3:1–11; యోహాను 16:13 చూడుము). పరిశుద్ధాత్మ వాక్యమునకు బలము కలిగించుచు, జీవమును మరియు శక్తినిచ్చును (2 కొరింథీయులకు 3:6; 1 థెస్సలొనీకయులకు 1:5; హెబ్రీయులకు 4:12 చూడుము). "వాక్యము"నకు పౌలు ప్రయోగించిన పదము *rhēma*, సువార్త ప్రకటింపబడుటను సూచించుచున్న "నోటి వాక్కు"[52] అయియున్నది. "ప్రకటింపబడిన సువార్త, 'దేవుని శక్తి' [రోమీయులకు 1:16; 1 కొరింథీయులకు 1:18], దాడిచేయువాని సంఘనములను ఎదుర్కొనుచు వాని వెంటబడివానిని వెనుకకు తరుముటకు పరిశుద్ధాత్మ చేత సమకూర్చబడిన యుద్ధోపకరణమై యున్నది."[53]

సువార్త, "సత్యవాక్యమై" (1:13) మరియు "సమాధాన సువార్తయై" యున్నది (6:15). ఈ సత్యము ప్రతి విధమైన పొరపాటును బట్టబయలు చేయుటకును దేవుని శత్రువులు పలాయనము చిత్తగించునట్లు చేయుటకును సమర్థవంతమైనదై యున్నది. ఈ సత్యము విరోధిని జయిస్తూ, చెరపట్టబడినవారిని విడుదల చేస్తూ, క్రీస్తు నామములో ముందడుగు

వేయుచుండగా ఈ సత్యము లోకంలో దేవుని ఉద్దేశమును ముందుకు కొంచుబోతుంది.

### విన్నపము: "విజ్ఞాపనము చేయుచు మెలకువగా ఉండుడి" (6:18-20)

**[18]ఆత్మవలన ప్రతి సమయమునందును ప్రతి విధమైన ప్రార్థనను విజ్ఞాపనను చేయుచు, ఆ విషయమై సమస్త పరిశుద్ధుల నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపనచేయుచు మెలకువగా ఉండుడి. [19]మరియు నేను దేనినిమిత్తము రాయబారినై సంకెళ్లలో ఉన్నానో, ఆ సువార్త మర్మమును ధైర్యముగా తెలియజేయుటకు నేను మాటలాడ నోరు తెరచునప్పుడు, [20]దానినిగూర్చి నేను మాటలాడవలసినట్టుగా ధైర్యముతో మాటలాడుటకై వాక్శక్తి నాకు అనుగ్రహింపబడునట్లు నా నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపనచేయుచు మెలకువగా ఉండుడి.**

**వచనము 18.** క్రైస్తవుని సర్వాంగ కవచములో ప్రార్థన అంతిమ భాగమని కొందరు వ్యాఖ్యానకర్తలు నమ్ముదురు, అయితే ప్రార్థన గూర్చి నొక్కివక్కాణించుటకు పౌలు సైనిక సంబంధమైన రూపకాలంకారములను 17వ వచనంలోనే విడిచిపెట్టడని ఇతరులు అభిప్రాయపడుచున్నారు. ఏ దృష్టికోణం అంగీకరింపబడుతుందో నిమిత్తము లేకుండా, వానికి అండగా నిలుచు వ్యవస్థతో బాహాటముగా సమాచారమును తెలియజేసుకొనగల సదుపాయములు మరియు సరఫరా విధానములు లేకుండా, ప్రాచీన కాలము నాటి సైనికుడు బ్రతికి బయటపడియుండడని అందరు ఏకీభవిస్తారు. క్రైస్తవ సైనికుని విషయంలో కూడా ఇది ఎంతైనా సత్యమై యున్నది. వాడు దేవునితో సంభాషించు సంబంధము ఎల్లప్పుడును బాహాటమైనదై యుంటే తప్ప, వానికి అవసరమైయున్న బలమును దేవుడు సరఫరా చేయుచునే యుంటే తప్ప, వాడు విజయీభవుడు కానేరడు.

"విజ్ఞాపనచేయుచు" మరియు "మెలకువగా ఉండుడి" అని అనువదింపబడిన అసమాపక క్రియ పదములు సైనికుని యుద్ధోపకరణము గూర్చి పౌలు ప్రారంభంలో చెప్పుదుండిన "బలవంతులై యుండుడి" అను మాటలతో ఉత్తమంగా జోడింపబడవచ్చును. క్రైస్తవులు ఎదుర్కొను ఆధ్యాత్మిక పోరాటంలో, విజయము సాధించుటకు దేవుడిచ్చు ఆధ్యాత్మిక సహాయం అత్యావశ్యకమై యున్నది. వారు "దేవుడిచ్చు సర్వాంగకవచమును ధరించుకొనునప్పుడు" (6:13), క్రైస్తవులు ప్రార్థన ద్వారా అందుబాటులో నుండు దేవుని శక్తిపై కూడా ఆధారపడవలసినవారై యున్నారు.

**ప్రార్థన**కు పౌలు రెండు పదములను ప్రయోగించాడు. మొదటిది, *proseuchē*, సామాన్యముగా "ప్రార్థన" అని చెప్పుకొనునప్పుడు దాని ప్రతి విధమైన రూపములలో అనగా, దేవునితో మాటలాడుట, కృతాజ్ఞతా వందనములు తెలియజెప్పుకొనుట, మరియు మానవులు చేసుకొనుటతో సహా, ఉపయోగింపబడు మాటయై యున్నది. రెండవది *deēsis*, అనగా **విజ్ఞాపనము**, "నిర్దిష్టమైన మేలుల కొరకు చేయబడు ఒక మనవి."[54] **ప్రతి సమయమునందును** ఆవశ్యకమైయున్న ప్రార్థనా అంశమును గూర్చిన అభిప్రాయమును తీవ్రతరము చేయుటకు పౌలు ఈ రెండు పదములను ప్రయోగించాడు.[55] జీవించుటకు అవసరమైయున్న దేవుని అధికారము మరియు శక్తిని ఆమంత్రణము చేయుటకు ప్రార్థన క్రైస్తవుని సాధనమై యున్నది (1:15-23; 3:14-21)

**ఆత్మ వలన అను** మాటలు పరిశుద్ధాత్మను సూచించుచున్నవి. వారు "పరిశుద్ధాత్మలో ప్రార్థన చేయుచుండవలెనని" యూదా తన పాఠకులకు తెలియజెప్పినప్పుడు (యూదా 20, 21) ఆయన ప్రార్థన విషయంలో నిర్దిష్టంగా చెప్పాడు. ఎఫెసీ పత్రికయందంతటను, పౌలు పరిశుద్ధాత్మను పేర్కొనుచునే యుండెను. వారు పరిశుద్ధాత్మ చేత ముద్రింపబడిరి, పరిశుద్ధాత్మ చేత దేవుని సన్నిధిని సమీపింపగలుగుచుండిరి, పరిశుద్ధాత్మ ద్వారా వారు దేవునికి నివాసస్థలమై యుండిరి, పరిశుద్ధాత్మ చేత బలపర్చబడిరి, పరిశుద్ధాత్మను దుఃఖపరచకూడనివారై యుండిరి, మరియు ఆత్మపూర్ణులై యుండవలసినవారై యుండిరి (1:13; 2:18, 22; 3:15–18; 4:30; 5:18). ఆయన తన పత్రికను ముగించుచు, వారు "**ఆత్మ** వలన ప్రార్థనలు చేయుచుండవలెనని" పౌలు ఎఫెసీయులకు చెప్పాడు.

క్రైస్తవులు చేయుచుండు ప్రార్థనలలో పరిశుద్ధాత్మ బహు ప్రగాఢంగా కలుగజేసుకొనుచుండును. దేవుని ఆత్మ వారి హృదయాల్లోనికి ప్రవేశించి, వారు "అబ్బా! తండ్రీ!" అని మొఱ్ఱపెట్టగల కృప కలుగజేస్తాడు (రోమీయులకు 8:15; గలతీయులకు 4:6). వారి బలహీనతలనుబట్టి, యుక్తముగా ఏలాగు ప్రార్థన చేయవలెనో తెలియని క్రైస్తవుల పక్షాన పరిశుద్ధాత్మ విజ్ఞాపనము చేస్తాడు. క్రైస్తవుల బలహీనతలు మరియు మూలుగుల గూర్చి రోమా పత్రిక 8వ అధ్యాయంలో వ్రాయబడియున్నది. తరచుగా శ్రమలు సంభవించినప్పుడు, ప్రార్థన చేయడానికి సరైన మాటలు దొరకవు, దేవుని పిల్లలు "దేవా, మాకు సహాయము చేయుము!" అని మాత్రమే మొఱ్ఱపెట్టగలరు. ఈ మూలుగులు ఉచ్చరింప శక్యముకానివైనప్పుడు, పరిశుద్ధాత్మ జోక్యము చేసుకొని విజ్ఞాపనము చేస్తాడు; అనగా, క్రైస్తవుని పక్షాన వాని అవసరములను దేవుని యెదుట విన్నవించుటకు పరిశుద్ధాత్మ వాని చెంతనే చేరి యుంటాడు. విజ్ఞాపనము చేయువాడు పరిశుద్ధాత్మ గనుక దేవుడు క్రైస్తవుని చేత ఉచ్ఛరింపబడని ప్రార్థనలను అపార్థము చేసుకొనడు. "ఆత్మ వలన ప్రార్థించుట" అనగా, దేవుని వాక్యము ద్వారా ప్రార్థన గూర్చి పరిశుద్ధాత్మ బయలుపర్చినది ఏమిటో ఎరిగియుండుట మరియు ప్రార్థన చేయునప్పుడు అవసరమగు పరిశుద్ధాత్మ యొక్క తోడ్పాటును గుర్తించుటయై యున్నది.

సాధారణంగా సదా చేయబడుచుండు ప్రార్థనలకు అదనంగా, **సమస్త పరిశుద్ధుల** అవసరముల విషయంలో ఎఫెసీయులు జాగరూకులై, వారి కొరకు **విజ్ఞాపనము** (*deēsis*) చేయుచునే యుండవలసినవారై యుండిరి. **పూర్ణమైన పటుటదలతో మెలకువగా ఉండుడి** అను పదజాలము *agrupneō* మరియు *proskartēresis* యొక్క అనువాదమై యుండి, "సావధానముగా ఉండుట, అప్రమత్తముగా ఉండుట" మరియు "ఒక విషయానికి ఎడతెరిపిలేని సావధానమునిచ్చుట" అని అర్థమిచ్చుచున్నది.[56] ఈ సందర్భములో, పరిశుద్ధుల కొరకు ప్రార్థించుటలో "నిరంతరాయమైన సావధానము" ఇవ్వబడవలసి యుండింది.

**వచనము 19.** అటుతరువాత పౌలు ఒక వ్యక్తిగతమైన మనవి చేస్తున్నాడు. ఎఫెసీయులు తమ నిమిత్తము, పరిశుద్ధులందరి కొరకు, మరియు ఆయన కోసం **ప్రార్థించవలెనని** ఆయన ఆశించాడు. వారు **ఆయన పక్షాన [నా నిమిత్తము]** ప్రార్థించాలని వారిని కోరాడు. దేవుడు ఆయనకు తన సందేశమును బయలుపర్చుట మాత్రమే కాదు, కానీ బయలుపర్చబడిన సందేశమును **ధైర్యముతో** మాటలాడుటకు మాటలు కూడా అనుగ్రహించునట్లు వారు

ప్రార్థన చేయాలని ఆయన ఆశించాడు. పౌలు కోరుచుండిన "ధైర్యము," *parrēsia* యొక్క అనువాదమై యున్నది, అది "నిర్మోహమాటము, దాపరికంలేనితనము, లేక సరళముగా మాటలాడు"యై యున్నది.[57] "ధైర్యము," "సిగ్గుపడుట"కు తారతమ్యముగా నిలుచుచున్నది[58] (ఫిలిప్పీయులకు 1:19 చూడుము). **నోరు తెరచుట** దేవుని వాక్యమును ప్రకటించుటకు సంబంధించిన బైబిలు సంబంధమైన వ్యక్తీకరణమై యున్నది (యెహెజ్కేలు 3:27; 33:22; దానియేలు 10:16 చూడుము).

**వచనము 20.** పౌలు **సంకెళ్లలో** ఉండెను; అనగా, ఆయన ఒక ఖైదీయై యుండెను (3:1; 4:1; అపొస్తలుల కార్యములు 28:20; 2 తిమోతి 1:16, 17 చూడుము). అదే సమయంలో, ఆయన **రాయబారియై** (*presbeuō*) యుండెనని ఆయన సెలవిచ్చాడు, ఈ పదము 2 కొరింథీయులకు 5:20లో కూడా వాడబడియున్నది. ఒక రాయబారి తన ప్రభుత్వమునకు విదేశములో ప్రతినిధియై యుండెను, అతడు తన ప్రభుత్వ అధికారములో మాటలాడుచుండెను, అతని ప్రభుత్వము యొక్క పరువు అతని చేతుల్లో ఉండింది. ఇంకా, అతడు తన సొంత ఇంటికి దూరములో ఉండెను. ఈ విషయాలన్నింటిలో, పౌలు క్రొత్త నిబంధన లోకమంతటికిని పరలోకము యొక్క రాయబారియై యుండెను. ఆయన యొక్క పౌరసత్వము మరొక లోకములో ఉన్నదనియు (ఫిలిప్పీయులకు 3:20, 21 చూడుము) ఆయన క్రీస్తుకు ప్రతినిధిగా ఈ లోకములో నిలువబడుటకు క్రీస్తు చేత ఏర్పరచబడినవాడై యున్నాడనియు ఆయన గుర్తించాడు (అపొస్తలుల కార్యములు 26:15–18 చూడుము). క్రీస్తు రాయబారిగా, ఆయన క్రీస్తు యొక్క సర్వాధికారమతో మాటలాడాడు (1 కొరింథీయులకు 14:37 చూడుము) మరియు క్రీస్తు యొక్క పరపతి ఆయన చేతుల్లో ఉండిందని పౌలు ఎరిగియుండెను (ఫిలిప్పీయులకు 3:12–21 చూడుము). పౌలు "సంకెళ్లలో ఉన్న రాయబారి" అను విషయమై వ్యాఖ్యానిస్తూ, లింకన్ ఇలా చెప్పుచున్నాడు,

> సంకెళ్లలో ఉన్న ఒక రాయబారి గూర్చి చెప్పుకొనుట ఒక విరుద్ధోక్తిని ఉపయోగించుట యౌతుంది. సామాన్యంగా ఒక రాయబారి దౌత్య సంబంధమైన విశేషాధికారము మరియు మినహాయింపు కలిగియుండెను గనుక ఆయన ఎవరి యొద్దకైతే పంపబడినాడో వారి చేత చెరసాలలో చేయబడలేదు, కానీ ఇప్పుడు చెరసాలను గుర్తుచేయుచుండిన సంకెళ్లు సువార్తకు ప్రాతినిధ్యం వహిస్తూ అందుకు ఔచిత్యమైన అధికార చిహ్నామయ్యింది, శ్రమనొందుచుండిన అపొస్తలునికి గుర్తుగా నిలిచింది.[59]

ఎఫెస్సు పట్టణ సంఘము అజ్ఞానుల వలె గాక జ్ఞానుల వలె నడుచుకొనవలసి యుండింది (5:15–6:20). ఈ కార్యము, తగు జాగ్రత్తగా జీవించుట (5:15–21), సంబంధములను గౌరవించుట (5:22–6:9), మరియు ప్రభువునందు బలవంతులై యుండుట (6:10–20) ద్వారా చేయబడగలదు. ప్రభువునందు బలవంతులై యుండుటకు "దేవుడిచ్చు సర్వాంగ కవచము" (6:10–17) మరియు పట్టుదలతో కూడిన ప్రార్థన (6:18–20) అవసరమై యుండినవి. అజ్ఞానుల వలె గాక జ్ఞానుల వలె నడుచుకొనవలసి యుండిన విషయం గూర్చి చివరి ఆదేశమునిచ్చిన తరువాత, పౌలు తన ముగింపు ఆశీర్వచనమును రచించుటకు సిద్ధపడి యుండెను.

## అదనపు అధ్యయనము:
## దాసత్వము

గలతీయులకు 3:28, దాసులు క్రైస్తవ సమాజంలో ఒక క్రొత్త స్థానము కలిగియున్నారని సూచిస్తూ, వారు యజమానులైనా మరియు దాసులైనా, దేవుని సమీపించుటకు వారికి గల సమాన అందుబాటుకు వేదికను ఏర్పాటు చేయుచున్నది. క్రీస్తునందు "దాసుడని స్వతంత్రుడని లేదు" అని పౌలు చెప్పుచున్నాడు. ఈ వాఙ్మూలము వారికి దాస్య విమోచనము గావింపబడవలెనని దాసులు సాధికారంతో అడుగునట్లు వారికి సదవకాశమును ఇచ్చి యుండవచ్చును ఏలయనగా "... దాసులైనను స్వతంత్రులైనను ఒక్క శరీరము లోనికి ఒక్క ఆత్మ యందే బాప్తిస్మము పొందిరి" (1 కొరింథీయులకు 12:13) అని వ్రాయబడి యున్నది. "ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి. క్రీస్తు మనలను స్వతంత్రులనుగా చేసియున్నాడు. కాబట్టి, ... మరల దాస్యమను కాడి క్రింద చిక్కుకొనకుడని" పౌలు గలతీయులకు చెప్పినప్పుడు (గలతీయులకు 5:1), వారు తమ యజమానుల నుంచి యిక స్వతంత్రులైపోయారని దాసులు అనుకొనియుండ వచ్చును. వారు తమ దాసులను స్వతంత్రులనుగా చేయవలెనని క్రైస్తవులై యుండిన యజమానులు వారు నూతనంగా కనుగొనిన నమ్మకములను భిన్నంగా అనువదించుకొని యుండవచ్చును; వాస్తవానికి, కొందరు అలాగే చేసారు.

1 కొరింథీయులకు 7:20–22లో గల వాక్యభాగమును చదువుట ద్వారా యజమానులు మరియు దాసులకు సంబంధించినంత వరకు క్రైస్తవ సమాజంలో జరుగుచుండిన దాని గూర్చి బైబిలు విద్యార్థికి నిశితమైన అవగాహన లభించగలదు:

> ప్రతి మనుష్యుడు తాను పిలువబడిన స్థితిలోనే నిలిచియుండవలెను.
>
> నీవు దాసుడవై యుండినప్పుడు పిలువబడ్డావా? దాని విషయమై నీకేమీ చింత పడవద్దు; కానీ నీవు స్వతంత్రుడవగుటకు అవకాశములున్నట్లయితే, స్వతంత్రుడవగుటయే మంచిది. ఏలయనగా, దాసుడై యుండినప్పుడు క్రీస్తునందు పిలువబడినవాడు, ప్రభువు చేత స్వతంత్రుడు గావింపబడినవాడై యున్నాడు; అదే విధంగా, స్వతంత్రుడై యున్నప్పుడు పిలువబడినవాడు, క్రీస్తు దాసుడై యున్నాడు.

ఈ వాక్యభాగములో, క్రైస్తవులందరు – దాసులతో సహా – జీవితములో వారికున్న స్థానములతో సంతృప్తిచెంది యుండవలెనని పౌలు చెప్పుచున్నాడు. దాసులు క్రీస్తునందు స్వతంత్రులై యున్నారు గనుక, వారు దాసులై యుండుట గూర్చి చింతించ కూడదు. కొందరు దాసులు వారి యజమానుల చేత స్వతంత్రులు గావింపబడిరి, గనుక వారు తమ స్వతంత్రమును మేలు చేయుట కొరకు ఉపయోగించుకొనవలసినవారై యుండిరి. ఈ రెండు సందర్భములలోను, వారు దాసులైయున్నా లేదా స్వతంత్రులైయున్నా దాసులు క్రీస్తునందు స్వతంత్రులై యుండిరి గనుక, వారు క్రైస్తవ యజమానులతో కూడ, క్రీస్తు దాసులై యుండిరి.

యజమానుడు మరియు అతని దాసుడు క్రైస్తవుడైనప్పుడు, విశిష్టమైన సమస్యలు తలెత్తినవి. పౌలు ఫిలేమోనుకు వ్రాసిన ఉత్తరంలో ఈ సమస్యలు చర్చింపబడినవి. ఫిలేమోను కొలొస్స పట్టణ వాస్తవ్యుడు, ధనవంతుడు మరియు అతనికి అనేక మంది దాసులుండిరనియు,

అతని దాసుడైన ఒనేసిము అతని వస్తువులను కొన్నింటిని దొంగిలించి అచ్చటి నుంచి రోమా పట్టణానికి పారిపోయాడనియు తెలియుచున్నది. రోమా పట్టణంలో ఉన్నప్పుడు, ఒనేసిము పౌలును కలుసుకొనడం తటస్థించింది, పౌలు అప్పటికి గృహనిర్బంధములో ఉండెను, మరియు క్రీస్తునంగీకరించిన నూతన విశ్వాసియై యుండెను. ఇప్పుడు ఒనేసిమును ఏంచేయాలన్నదే అతని మనస్సుకు ఆందోళన కలిగించుచుండింది. అతడు విడిచి వచ్చిన యజమాని యొద్దకే ఒనేసిము తిరిగి పంపించబడుట సముచితమనిపించింది, అయితే అచ్చట ఒనేసిము ఫిలేమోను దయాదాక్షిణ్యాలపై ఆధారపడవలసి యుండును. ఫిలేమోను క్రైస్తవుడైనప్పటికిని, పారిపోయి వచ్చిన దాసుని, అంతే గాక దొంగతనము చేసినవానిని, తిరిగి వాని యజమాని యొద్దకు పంపించుట అత్యంత తెగింపుతో కూడిన కార్యమై యుండింది. పారిపోయాడు, అంతమాత్రమేగాక దొంగతనం చేసాడు, కానీ ఇప్పుడు ఒక సహోదరుడైన దాసుని యెడల, దాసులు గల ఒక క్రైస్తవ యజమాని ఎలా ప్రతిస్పందించాలి? పౌలు ఫిలేమోనుకు వ్రాసిన పత్రిక ఈ ప్రశ్నకు సమాధానమిస్తుంది.

ఫిలేమోనుకు వ్రాయబడిన పత్రికలో, తన స్నేహితునితో వ్యవహరించుటలో పౌలు ప్రదర్శించిన తన మనస్తత్వ శాస్త్రాన్ని మనము చూడగలము. అంత కంటే ఎక్కువగా, ఒక క్రైస్తవ యజమానునికిని ఒక క్రైస్తవ దాసునికిని మధ్య ఉండవలసిన సంబంధముల గూర్చిన పరిజ్ఞానము మనకు లభిస్తుంది. ఫిలేమోను మరియు ఒనేసిము గూర్చిన కథ యొక్క పర్యవసానము మనకు తెలియనప్పటికిని, ఫిలేమోను ఒనేసిము యెడల పౌలు కోరిన దాని కంటే ఎక్కువే చేసాడనియు, వాస్తవముగా, ఒనేసిము క్షమింపబడి ఆ మీదట స్వతంత్రుడు గావింపబడ్డాడనియు నమ్మవలెనని మనము ఆశిస్తున్నాము.

కొలొస్సయులకు 3:11లో, వారిరువురును క్రైస్తవులైయున్నంత వరకు, ఒకడు దాసుడైనను స్వతంత్రుడైనను వారి అంతస్తులలో తేడా ఏమియు లేదని పౌలు సూచించాడు. కుటుంబములో వారు వహించు యథాక్రమ ప్రకారమైన పాత్రలు సన్మానింపబడవలెనని కూడా పౌలు స్పష్టం చేసాడు. “దాసులారా, మనుష్యులను సంతోషపెట్టువారైనట్టు కంటికి కనబడవలెనని కాక, ప్రభువునకు భయపడుచు శుద్ధాంతఃకరణగలవారై, శరీరమునుబట్టి మీ యజమానులైనవారికి అన్ని విషయములలో విధేయులై యుండుడని” ఆయన సెలవిచ్చాడు (కొలొస్సయులకు 3:22). చివరగా, “యజమానులారా, పరలోకములో మీకును యజమానుడున్నాడని యెరిగి. న్యాయమైనదియు ధర్మానుసారమైనదియు మీ దాసుల యెడల చేయుడని” పౌలు యజమానులకు సెలవిచ్చాడు (కొలొస్సయులకు 4:1).

## అదనపు అధ్యయనము:
## మన విరోధి, అపవాది (6:11)

క్రైస్తవులు “అపవాది తంత్రములను” “ఎదిరించుటకు శక్తిమంతులగునట్లు” వారికి “దేవుడిచ్చు సర్వాంగ కవచము” ఆవశ్యకమై యున్నది. “అపవాది,” *diabolos* యొక్క అనువాదమై యుండి, “అపవాదు మోపువాడు” లేక “కొండెములు చెప్పుటలో నిమగ్నమై యుండువాడు” అని నిర్వచింపబడుచున్నది.[60] అపవాది “సాతాను” అయియున్నాడు (ప్రకటన 20:2), లిప్యంతరీకరణములో సాతాను (*Satan*), “విరోధి” అని అర్థమిచ్చుచున్నది.[61] వాడు

ఒంటరిగా పనులు చేయడు, వాడు "దయ్యములకు అధిపతియై" యున్నాడు (మత్తయి 12:24-27; 25:41 చూడుము). వాడు "వాయు మండలము" మరియు "ఆకాశమండల మందున్న అంధకార సంబంధులను" ఏలుచున్నాడు (ఎఫెసీయులకు 2:2; 6:12).

సాతాను మూలము గూర్చి పరిశుద్ధ బైబిల్ ఒకడు ఆశించుచున్నంత ఎక్కువ నిర్దిష్టముగా చెప్పుటలేదు. ఏది ఏమైనా, వాని గూర్చి మనము కొన్ని అభిప్రాయములను ఏర్పరచుకొనగలుగునట్లు సహాయపడు సమాచారము నిచ్చుచున్నది. ఆదాము మరియు హవ్వ ఏదెను తోటలో ఉన్నప్పుడు, సాతాను అచ్చోట ఉండెను (ఆదికాండము 3:1). ఆదికాండములో వ్రాయబడి యున్న వివరములోని "సర్పము" గుర్తింపు గూర్చిన ఏ ప్రశ్నకైనను ప్రకటన 20:2లో సమాధానమియ్యబడి యున్నది. పరలోకములో జరుగుచుండిన ఒక యుద్ధము గూర్చి యోహాను భక్తుడు వ్రాస్తూ, అపవాది "క్రిందకు పడద్రోయబడెనని" చెప్పుచున్నాడు (ప్రకటన 12:7-9, 17 చూడుము). దేవుడు సృజించిన సమస్తము "అది చాల మంచిదై యుండెను" (ఆదికాండము 1:31) గనుక, సాతాను ఒక పతనమైన దూత అని కొందరు అభిప్రాయపడుచున్నారు - వారు ఒకప్పుడు మంచివాడై యుండెను కాని దుష్టుడగుటకే కోరుకున్నాడు.[62]

సాతాను మూలము గూర్చిన ప్రశ్నకు సమాధానమియ్యవచ్చునని మూడు వాక్యభాగములు ఉదహరింపబడుచున్నవి.

(1) సాతాను మూలమునకు యెషయా 14:12-15 ఒక ప్రస్తావనయై యుండునా? యెషయా ప్రవక్త చెప్పుచున్నదాని ప్రకారము, పతనమైన ఈ నక్షత్రముపై దేవుని తీర్పు నిలిచియున్నది, వాని రాజ్యము శాశ్వతకాలము నిలువనేరదనియు, వాడు నిత్యుడు కాడనియు, తనకై తానే అమర్త్యతను ఆపాదించుకొనుటకు ప్రయత్నించాడు కానీ విఫలుడయ్యాడనియు అది సూచించుచున్నది.

12వ వచనంలో ఆంగ్ల KJV బైబిల్ "తేజో నక్షత్రమా, వేకువ చుక్కా" అను మాటలకు బదులుగా, "లూసిఫర్" అను మాటను ప్రయోగించుచున్నది గనుక, సాతానుకు ఇదొక ప్రజాదరణ పొందిన బిరుదైపోయింది. ఏది ఏమైనా, ఇటువంటి అనువాదము ఇటీవలి పరిణామమై యున్నది, స్పష్టంగా, తెర్తుల్లు కాలమునకు మునుపు (క్రీ.శ. నాలుగవ శతాబ్దము) సాతానునకు ఈ వాక్యభాగమును ఎవరును అన్వయించలేదు.

అది అపవాది గూర్చిన ప్రస్తావన కానట్లయితే, మరెవరిని గూర్చినదై యున్నది? యెషయా 14:3, 4 ప్రకారము. "... నీవు *బబులోను రాజును గూర్చి* అపహాస్యపు గీతము ఎత్తి పాడుదువని" దేవుడు ప్రవక్తయైన యెషయాకు సెలవిచ్చాడు. "బబులోను దేశపు రాజు ప్రస్తుతము ఇశ్రాయేలు రాజ్యమును అణగద్రొక్కుచున్నప్పటికిని, వాని రాజ్యము నిరంతరము నిలుచునది కాదు. దేవుడు ఆయన పరిపాలన మాత్రమే శాశ్వతమైయున్నవాడు, ఒకనాడు దుర్మార్గమును అవలంబించుచున్న బబులోను దేశమును నాశనము చేయునని" యెషయా ప్రవక్త ప్రజల యెదుట ఘోషించుచుండెను. కవితాత్మకమైన ఈ వాక్యభాగము, దాని సరైన సందర్భములో చూడబడినట్లయితే, వాస్తవమునకు అది సాతాను గూర్చి గాని వాని మూలము గూర్చి గాని ఏమియు చెప్పుట లేదు.

(2) ఇటువంటి చర్చలలో తరచుగా పేర్కొనబడు మరొక వాక్యము, లూకా 10:18. యేసు డెబ్బది ఇద్దరు శిష్యులను, ఇద్దరిద్దరినిగా, ఇశ్రాయేలు ప్రజలకు సువార్త

ప్రకటించుటకు పంపించాడు. వారు దయ్యములను వెల్లగొట్టగల అధికారమును, వారిపై విషములు ఎటువంటి ప్రభావమునైనను చూపింపజాలకుండు శక్తిని ఆయన వారికిచ్చాడు. వారు తిరిగి వచ్చినప్పుడు, వారు వెళ్లిన బృహత్కార్యము అత్యంత జయప్రదమయ్యిందని వారు యేసు యెదుట నివేదించారు. ఆ సమయంలో యేసు, "సాతాను మెరుపు వలె ఆకాశము నుండి పడుట చూచితినని" పలికాడు (లూకా 10:18).

సాతాను ఆకాశము నుండి పడుట ఆయన చూసాడని, యేసు చెప్పలేదు. సాతాను మెరుపు వలె ఆకాశము నుండి పడుట చూచెనని ఆయన చెప్పాడు. ("పరలోకము" మరియు "ఆకాశము" అను పదములు ఒకే గ్రీకు పదము యొక్క అనువాదములై యున్నవి.) మేఘములలో నుంచి మెరుపు నేలపై పడునట్లు, సాతాను వాని సింహాసనము మీద నుంచి క్రిందకు పడద్రోయబడెనని యేసు ఆధ్యాత్మికముగా అవగాహన చేసుకొన్నాడు. యేసు పరిచర్య ద్వారా, మనుష్యుల ఆత్మలపై వానికుండిన పట్టును సాతాను కోల్పోవుచుండెను. వాడు ఓడింపబడుచుండెను! కాబాట్టి, ఇది వాస్తవమునకు, సాతాను మూలమునకు సంబంధములేని మరొక వాక్యమై యున్నది.

(3) తరచుగా పేర్కొనబడు మరొక వాక్యభాగము, ప్రకటన 12:7-9.

> అంతట పరలోకమందు యుద్ధము జరిగెను. మిఖాయేలును అతని దూతలును ఆ ఘట సర్పముతో యుద్ధము చేయవలెనని యుండగా, ఆ ఘటసర్పమును దాని దూతలును యుద్ధము చేసిరి గాని గెలువ లేకపోయిరి గనుక పరలోకమందు వారికిక స్థలము లేకపోయెను. కాగా సర్వలోకమును మోస పుచ్చుచు, అపవాదియనియు సాతాననియు పేరుగల అది సర్పమైన ఆ మహాఘటసర్పము పడద్రోయబడెను. అది భూమిమీద పడద్రోయబడెను; దాని దూతలు దానితో కూడ పడద్రోయబడిరి.

ప్రకటన గ్రంథం ఒక చిహ్నాత్మక గ్రంథమై యున్నప్పటికిని, ఒక వివరమునకు ఈ వాక్యభాగములో ఎక్కువ ఆధారమున్నట్లు అగుపించుచున్నది. పరిశుద్ధమైన దళములు దుర్నీతి దళములకు విరోధముగా పోరాడినవని యోహాను చెప్పుచున్నాడు. సాతాను మరియు వాని దూతల సమూహమంతయు పరలోకములో వారి స్థానమును కోల్పోవుట మాత్రమేగాక అచ్చటి నుండి క్రిందకు నేల మీదికి పడద్రోయబడుట ఈ పోరాటము యొక్క అంతిమ పరిణామమై యుండింది. కావ్యాలంకారమైనదై యున్నదని ఆమోదింపబడుచున్న గ్రంథంలో నుంచి తీసికొనబడు ఈ మాటలు అక్షరాలా ఎలా అనువదింపబడగలవు?

ఈ మాటలు అక్షరార్థముగా తీసికొనబడినప్పటికిని, సాతాను యొక్క మూలము ఒక మర్మముగానే మిగిలిపోతున్నది. సాతాను ఎక్కడ పుట్టాడో ప్రకటన గ్రంథం సుస్పష్టంగా తెలియజెప్పుట లేదు. సాతాను ఒక పతనమైన దూత అని యోహాను తేటతెల్లముగా చెప్పలేదు, వానిని వెంబడించుచున్న దూతలున్నారని మాత్రమే చెప్పుచున్నాడు. సరికదా, పరలోకంలో ఈ పోరాటము ఆరంభమౌటకు గల హేతువు లేదా ఈ పోరాటము ఎంత కాలము కొనసాగినదో, మనకు తెలియజెప్పబడుట లేదు.

**పిల్లలు మరియు తల్లిదండ్రులు (6:1-4)**

పిల్లలు వారి తల్లిదండ్రులను సన్మానిస్తూ వారికి లోబడవలసినవారైయున్నారు (6:1-3). తల్లిదండ్రులను సన్మానించకుండానే వారికి లోబడుట సాధ్యమే; వారు లోబడునట్లయితే పరిణామములు తీవ్రమైనవై యుండునను భయముతో కొందరు పిల్లలు తమ తల్లిదండ్రులకు లోబడుచుందురు. ఏది ఏమైనా, తల్లిదండ్రులకు లోబడకుండా వారు అర్హులైయున్న సన్మానము వారికిచ్చుట అసాధ్యము. విధేయత అనగా లోబడుట యని అర్థము, కానీ సన్మానము ఒకడు విదేయుడగునట్లు వానికి ప్రోత్సాకమిచ్చు మర్యాదయై యున్నది.

తల్లిదండ్రుల యెడల విదేయత చూపుచు వారికి సన్మానించుట వలన తల్లిదండ్రులకు పిల్లలకు, మరియు సమాజానికి మొత్తంగా మేలే సమకూడుతుంది. పిల్లలు ఈ సద్గుణాలను నేర్చుకొని వాటిని మన ఇళ్లల్లో అభ్యసించనట్లయితే, వారు వాటిని వారి పాఠశాలలోగాని, ఉద్యోగాల్లోగాని, లేదా సంఘములోగాని అభ్యసించకపోవచ్చును. విధేయత మరియు సన్మానము లేని సమాజము అస్తవ్యస్తమైనదై యుంటుంది. పిల్లలు తమ తల్లిదండ్రులకులోబడుచున్నారంటే, వారు అజ్ఞానుల వలె గాక జ్ఞానుల వలె నడుచుకొనుచున్నారని అర్థం.

తల్లిదండ్రులు వారి పిల్లలకు శిక్షణ నిచ్చుచుండవలెను (6:4). శిక్షణ నిచ్చుటలో వ్యతిరేకార్థక కోణం కూడా కలదు. "మీ పిల్లలకు కోపము రేపకుడని" పౌలు చెప్పుచున్నాడు. అలాగని, తల్లిదండ్రులు వారి పిల్లలకు అసంతుష్టి కలుగజేయకూడదని అర్థం కాదు. సరైన శిక్షణ తరచుగా పిల్లలకు అసంతుష్టి కలుగజేస్తుంది. ఈ చొప్పున పౌలు చెప్పుచుండిన మాటలు, "వారు నిరుత్సాహపడకుండా లేదా విసుగుతో అధైర్యపడకుండా ఉండాలంటే వారికి కోపము పుట్టునట్లు వారిని రెచ్చగొట్టకుడని" అర్థమిచ్చుచున్నవి. ఇంకా, పిల్లలకు శిక్షణ నిచ్చుటలో ఒక నిర్మాణాత్మకమైన కోణం కూడా కలదు. "ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడని" పౌలు రచించాడు. "శిక్ష" అనగా పిల్లలు సరైన పనులనే చేయునట్లు వారికి నేర్పించుటయై యున్నది. "బోధ" అనగా పిల్లలకు నేర్పించబడిన విషయాలను వారు ఆచరణలో పెట్టునట్లు వారిని ప్రోత్సాహించుటకు వారికి చెప్పబడు విషయాలై యున్నవి.

పిల్లలు అధికారుల యెడల మర్యాదగా ప్రవర్తించునట్లు నేర్పించుట వారికి శిక్షణ నిచ్చుటలో గల ఉద్దేశమై యున్నది. పిల్లలు వారి తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల, ప్రభుత్వం, అన్నింటిని మించి దేవుని అధికారము యెడల మర్యాద చూపుటకు వారు నేర్చుకొనుట ఎంతైనా ఆవశ్యకమై యున్నది.

విశ్వాసము (2 తిమోతి 1:5), స్వయం క్రమశిక్షణ. పనులు, మరియు స్వాభిమానము, ఇవే గాక అపజయము వలన ప్రాణం పోయినంత కలిగే నష్టమేమీ లేదను వాస్తవము మొదలగునవి పిల్లలకు నేర్పింపబడవలసిన అంశములై యున్నవి. పిల్లలు వారు ప్రయత్నించు ప్రతి పనిలో రాణించకపోవచ్చును.

పిల్లలకు శిక్షణ నిచ్చుటకు *సమయం* ఎంతైనా పట్టవచ్చును. తల్లిదండ్రులు పిల్లలతో సమయము గడుపుటకు ప్రథమ ప్రాధాన్యత నీయవలెను. అది తల్లిదండ్రులు, పెద్దలు,

ఇతరులు ప్రదర్శించే సరైన *మాదిరిపై* కూడా ఆధారపడి యుంటుంది. పిల్లలు తమ తల్లిదండ్రుల వేశభాషలను మరియు జీవిత విధానాలనే అనుకరించుటకు ఆశిస్తారు, ప్రయత్నిస్తారు. సరైన శిక్షణలో నిర్మాణాత్మకము మరియు దిద్దుబాటుతో కూడిన *శిక్ష,* తల్లిదండ్రులు సహితము పొరపాట్లు చేయుదురను నిజాయితీతో కూడిన *ఒప్పుకోలు,* మరియు పిల్లలు మంచి పనులు చేసినప్పుడు *మెప్పుతో* కూడిన అభయమిచ్చు ధ్రువీకరణము మొదలగునవి కలిసియుండవలెను.

తల్లిదండ్రులు మరియు పిల్లలు ఒకరినొకరు సన్మానించుకొంటూ వివేకవంతులుగా జీవించవచ్చును. ఇది జరిగినప్పుడు, కుటుంబము ఆరోగ్యవంతము, ఉత్పాదకము, మరియు ఆనందమయమైన వాతావరణంలో పనులు చేయుచుండును. దీనికి అదనంగా, ప్రభువు సన్మానింపబడును, మరియు సమాజము జీవించుటకు ఒక ఉత్తమమైన పరిసరములు గల ప్రదేశమౌతుంది.

జేయ్ లాక్‌హార్ట్

**క్రీస్తే కేంద్రమై యున్న కుటుంబము (6:1–4)**

ఆయన రచించిన పుస్తకం, *శిక్ష అంచుటకు సాహసించుము* (*Dare to Discipline*) లో, జేమ్స్ డాబ్సన్ చల్లని నీళ్లుండిన పాత్రలో ఉంచబడిన ఒక కప్ప గూర్చిన కథ చెప్పాడు. ఆ పాత్ర తక్కువ లోతైనదై యుండింది గనుక ఆ కప్ప తప్పించుకొని వెళ్ళిపోవాలనుకుంటే అది అతి సుళువుగా బయటకి దూకవచ్చును. విషయమేమనగా, పాత్రలోని నీళ్లు వేడి చేయబడుచు, ఉష్ణోగ్రత నెమ్మది నెమ్మదిగా అధికం గావింపబడింది. దాదాపుగా ఏమీ తెలియకుండానే, నీటి వేడి అవి మరిగే ఉష్ణోగ్రతకు చేరుకొన్నది. అట్లయినప్పటికిని కప్ప ఆ నీళ్లలోనే ఉండిపోయింది, పెరిగిపోవుచుండిన వేడి సంగతి అది మర్చిపోయింది. ఇంతలో మరిగిపోవుచుండిన నీళ్లలో నుంచి వచ్చుచుండిన ఆవిరి పాత్ర అంతా దుశ్శకునంగా నిండిపోయింది, కప్ప హాయిగా ఆ నీళ్ళలోనే ఉండిపోయింది, అయితే చివరకు అది మరుగుచుండిన నీళ్లలోనే చచ్చిపోయింది.[63]

అనేక విధాలుగా, ఈ రోజుల్లో కుటుంబముల పరిస్థితి ఇలాగే వున్నది. చెడిపోయిన లౌకిక పద్ధతులు, క్రైస్తవ కుటుంబములకు వ్యతిరేకంగా దుర్నీతి సంబంధమైన విలువలను పెంచుతూ మన కుటుంబములను నెమ్మది నెమ్మదిగా హతమార్చుచున్నవి. కాబట్టి మన కుటుంబములు బ్రతికి బయటపడాలంటే, పరిశుద్ధాత్మ చేత అదుపుచేయబడుచు, కుటుంబాలను బలముగా ప్రోత్సాహించు బైబిలు సూత్రముల వైపు చైతన్యయుతంగా వెనుదిరుగవలసిన అవసరం ఎంతైనా వున్నది.

6:1–4లో, తల్లిదండ్రులకును పిల్లలకును మధ్యనున్న సంబంధములను పౌలు పరిశీలనగా పరీక్షించాడు. ఇచ్చట, క్రీస్తే కేంద్రమైయున్న, పరిశుద్ధాత్మ చేత నింపబడియున్న కుటుంబము యొక్క కారణాంశములను మనము కనుగొనుచున్నాము.

*పిల్లలకు దేవుడిచ్చుచున్న ఆజ్ఞ.* "పిల్లలార, ప్రభువునందు మీ తల్లిదండ్రులకు విధేయులై యుండుడి, ఇది ధర్మమే. నీకు మేలు కలుగునట్లు నీ తండ్రిని తల్లిని సన్మానింపుము. అప్పుడు నీవు భూమి మీద దీర్ఘాయుష్మంతుడవగుదువు. ఇది వాగ్దానముతో కూడిన ఆజ్ఞలలో మొదటిది" (6:1–3).

"పిల్లలు" అను మాటకు పౌలు ప్రయోగించిన పదము సంతానమును సూచించు సాధారణ పదమై యున్నది. ఈ అవగాహన చొప్పున మనమందరము పిల్లలమై యున్నాము, ఏలయనగా మనలో ప్రతి ఒక్కనికి ఒక తండ్రి మరియు ఒక తల్లి ఉన్నారు. ఏది ఏమైనా, ఈ సందర్భములో, వాని తల్లిదండ్రుల ఇంటిలో నివసించుచు, అందువలన యింకను వారి ఆధిపత్యము మరియు బాధ్యతలో ఉండిన ప్రతి ఒక్కడు పౌలు మనస్సులో ఉండెను. ఈ మాటలు కేవలము ఏదో ఏడెనిమిది సంవత్సరముల వయస్సున్న పిల్లల కొరకు మాత్రమే కాదు, కానీ వయస్సులో అంత కంటే పెద్దవారై యింకను తమ తల్లిదండ్రుల అండదండల్లో నివసించుచుండిన వారి కొరకు కూడా ఉద్దేశింపబడినవై యున్నవి. పిల్లలు వారి తల్లిదండ్రుల అధీనంలోను అధికారంలోను వారితో కూడ జీవించుచున్నంత కాలము వారికిది దేవుడిచ్చుచున్న ఆజ్ఞయై యున్నది.

(1) పిల్లల విధి. "పిల్లలారా, ... మీ తల్లిదండ్రులకు విధేయులై యుండుడి" (6:1). ఇటీవలి సంవత్సరాల్లో నిర్లక్ష్యము చేయబడుచున్నది, దేవుని వాక్యంలోని ఏదైనా ఆజ్ఞ ఉన్నదా అనంటే, అది ఇదే. తల్లిదండ్రులకు పిల్లలపైగల అధికారము సమాజంలో తూలనాడబడుచునందులకు కారణం, పిల్లల హక్కులు ఇతోధికంగా ప్రోత్సాహింపబడడం.

తల్లిదండ్రుల ప్రభావములకు వేరుగా, వారి సొంత గమ్యమును మరియు జీవిత విలువల విధానాలను నిర్ధరించుటకు పిల్లలకు స్వేచ్ఛ ఉండవలసినదేనని కొన్ని సమాజములు పట్టుబట్టుచుండగా, పిల్లలు వారి తల్లిదండ్రులకు విధేయులై యుండవలెనని పరిశుద్ధ బైబిలు దీనంగా ధ్రువీకరించుచున్నది, ఏలయనగా ఇది సరైనా విషయమై యున్నది. ఈ సూత్రము ఆచరణాత్మకంగా అభ్యసింపబడుచుండు కుటుంబము బలముగా బ్రతుకగలదు.

"విధేయులై యుండుడి" అను మాట గ్రీకు భాషలో ఒక రేఖాచిత్రమై యున్నది. "ఒకరి అధికారము క్రింద ఉండి ఆలకించుట" అనునది దాని అక్షరార్థమై యున్నది. పిల్లలు వారి తల్లిదండ్రుల అధికారము క్రింద ఉంటూ వారు చెప్పుచుండు విషయాలను ఆలకించవలెననునది దానిలో గల అభిప్రాయమై యున్నది.

పిల్లలు తమ తల్లిదండ్రులకు, "వారు సరైనావారై యున్నప్పుడు" విధేయులై యుండవలెనని పౌలు వ్రాయలేదు. "నాన్నగారు ఈ విషయమై ఏమి మాటలాడుచున్నారో ఆయనకు తెలియదు, గనుక నేను ఆయనకు విధేయుడనై యుండవలసిన అవసరం నాకు లేదని" లేదా "ఈ విషయంలో అమ్మ చెప్తున్నది, చేస్తున్నది తప్పు గనుక, నాకిష్టమైనదే నేను చేస్తానని" అనేక మంది యౌవనులు అంటుంటారు, అనుకొంటుంటారు. అయితే, "పిల్లలారా, ప్రభువునందు మీ తల్లిదండ్రులకు విధేయులై యుండుడి, ఇది ధర్మమే" అని దేవుని వాక్యం సెలవిచ్చుచున్నది. తల్లిదండ్రుల మార్గనిర్దేశనములకు పిల్లలు సమ్మతించకపోయినప్పటికిని, వారు తమ తల్లిదండ్రులకు విధేయులై యుండుట ఎల్లప్పుడు సరైనదే. ఇది కుటుంబము విషయంలో దేవుని ప్రణాళికయై యున్నది, గనుక పిల్లలు ఇష్టపూర్వకంగా తమ్మునుతాము తల్లిదండ్రుల అధికారపూర్వకమైన అండదండల క్రింద నుండుట అందరికీ మేలే.

(2) క్రమబద్ధీకరింపబడు పరిమాణము. పిల్లలు తమ తల్లిదండ్రులకు ఎలా విధేయులై యుండాలి? పిల్లలు "ప్రభువునందు ... విధేయులై యుండవలెనని" పౌలు ఆజ్ఞాపించుచున్నాడు (6:1). దీనర్థమేమిటి? తల్లిదండ్రులు క్రైస్తవులైనట్లయితే పిల్లలు విధైయులై యుండవలెను, కానీ వారు క్రైస్తవులు కానట్లయితే వారు విధిగా లోబడవలసిన అవసరంలేదనునది దీనర్థము

కాదు. పౌలు ఇచ్చట పిల్లలకిచ్చుచున్న ఆదేశములోని తాత్పర్యము, ఆయన కొలొస్సయులకు 3:18లో భార్యలకిచ్చిన నిర్దేశనములోని అదే తాత్పర్యమై యుండింది: భార్యలారా, మీ భర్తలకు విధేయులై యుండుడి, ఇది ప్రభువునుబట్టి యుక్తమై యున్నది." ఈ ప్రకారంగా, తమ భర్తలు క్రైస్తవులైనట్లయితేనే భార్యలు వారికి లోబడవలెనని అర్థమా? కాదు! దానికి బదులుగా, దేవునికి మహిమ తెచ్చు ప్రతి విధానంలో భార్యలు తమ భర్తల అధికారమునకు లోబడియుడవలెననునది పౌలు ఉద్దేశమై యున్నది. క్రీస్తును వెంబడించువారికి తగినదై యుండు రీతిలో వారు తమ భర్తలకు లోబడుచుండవలెను.

6:1లో, "ప్రభువునందు" అని చెప్పుటలో గల అర్థము ఇదే. దేవునికి మహిమ తెచ్చు రీతిలో పిల్లలు తమ తల్లిదండ్రులకు విధేయులై యుండవలెను.

తల్లిదండ్రులు తమ బిడ్డను ఏదైనా ఒక పని చేయుమని అడిగినప్పుడు, "ఆ సరేలే మమ్మీ!/సరేలే డాడీ! చేస్తానులే!" అను అమర్యాదపూర్వకమైన స్వరంతో సమాధానమిచ్చినట్లయితే, ఆ బిడ్డ తన తల్లిదండ్రులకు ప్రభువునందు విధేయుడై/ విధేయురాలై యుండుట లేదని అర్థం. తల్లిదండ్రుల నియమముల గూర్చి ఎప్పుడు చూచినా వాదోపవాదములు చేయుచుండు బిడ్డలు లేదా మమ్మి, డాడీ తెలుసుకొనలేరు అని అనుకొంటూ ఆ యా నియమములను ఉల్లంఘించు బిడ్డలు, ప్రభువునందు తమ తల్లిదండ్రులకు విధేయులై యుండుట లేదని అర్థం.

కొలొస్సయులకు 3:20 ఇలా సెలవిచ్చుచున్నది, "పిల్లలారా, అన్ని విషయములలో మీ తల్లిదండ్రుల మాట వినుడి; ఇది ప్రభువునుబట్టి మెచ్చుకొన తగినది." నియమములు ఎంత అన్యాయమైనవని తోచినప్పటికిని, పిల్లలు తమ తల్లిదండ్రులకు ప్రతి విషయంలో విధేయులైనప్పుడు వారు ప్రభువును సంతోషపర్చాలని ఆశిస్తున్నారనుటకు అదొక గురుతై యుంటుంది.

ఒక వేళ, దేవుని చిత్తమునకు విరుద్ధమైనదానిని తమ పిల్లలు చేయాలని తల్లిదండ్రులు అడిగినట్లయితే, అప్పుడేంచేయాలి? ఇటువంటి సందర్భము ఎప్పుడైనా తలెత్తినట్లయితే, దేవుని వాక్యమునకు విరుద్ధమైన పని చేయమని భర్త అడుగుచుండు భార్యకు వర్తించు అదే సూత్రము ఆ బిడ్డకు కూడా వర్తిస్తుంది: మనుష్యుని మార్గము కంటె, దేవుని విధానమునకు విధేయుడగుటకే బిడ్డ ఎన్నుకొనవలెను. ఈ సూత్రము యెడల నమ్మకత్వము ప్రదర్శింపబడుచున్నదనగా, సహజంగానే, తమ జీవితం ద్వారా దేవుడు మహిమపరచబడునట్లు, తమ తల్లిదండ్రుల కోరికలను ఉల్లంఘించుట వలన ఏర్పడు పర్యవసానములను అనుభవించుటకు పిల్లలు ఇష్టపడుచున్నవారై యుండవలెనని అర్థము.

(3) లాభాంశము లభించును. "నీకు మేలు కలుగునట్లు నీ తండ్రిని తల్లిని సన్మానింపుము, అప్పుడు నీవు భూమి మీద దీర్ఘాయుష్మంతుడవగుదువు, ఇది వాగ్దానముతో కూడిన ఆజ్ఞలలో మొదటిది" (6:2, 3). వాగ్దానం చేయబడిన ఈ లాభాంశంలో దేవుడు వ్యక్తిగతమైన మనుగడ గూర్చి చెప్పుచుండెనా లేక, జాతీయంగా మనుగడ సాగడం గూర్చి చెప్పుచుండెనా? బహుశా ఈ రెండూ ఉండియుండవచ్చును. తన తల్లిందండ్రులకు విధేయుడై యుండు బిడ్డ దీర్ఘ కాలం ఆనందాతిశయంతో బ్రతుకుటకు అవకాశములు కలవు. దీనికి గల కారణమేమనగా తన తల్లిదండ్రుల ఆలోచనా సలహాలను ఆలకిస్తూ లోబడుచుండు బిడ్డ వాని బ్రతుకు తెరువునకు హాని కలిగించు తీర్మానములు మరియు కార్యకలాపములకు

అల్లంత దూరముగా ఉంటూ తనను తాను కాపాడుకొనుచుండును.

దేవుడు ఇశ్రాయేలు ప్రజలకు ఆజ్ఞ ఇచ్చినప్పుడు, ఈ లాభాంశమును ఆయన దానికెందుకు జోడించినట్టు? బహుశా పిల్లలు వర్తమాన కాలంలో తమ తల్లిదండ్రులతో కలిగియుండు సంబంధం, వారు భవిష్యత్తులో కలిగియుండు సంబంధములకు కీలకమై యుండుట ఇందుకు కారణమై యుండవచ్చును. పిల్లలు తమ తల్లిదండ్రులను సన్మానించక, వారికి మర్యాద ఇవ్వనట్లయితే, వారు తమ సమవయస్కులతో, అధ్యాపకులతో, తోటి పనివారితో, లేదా వారు ఎదుర్కొను ఇతర అధికారులతో ఎలా మెలగాలో నేర్చుకొనలేరు. పిల్లలు ఈ లోకంలో వారి పనులను సరైన విధంగా చేసికొనగలుగునట్లు వారిని సిద్ధం చేయడానికి కుటుంబము దేవుడు ఏర్పాటు చేసిన శిక్షణ స్థలమై యున్నది.

విధేయులై యుండుట వలన ప్రాప్తించు దేవుని లాభాంశము వ్యక్తిగతమైన ప్రాముఖ్యత మాత్రమే కాదు, కానీ జాతీయ ప్రాధాన్యత కూడా తద్వారా లభించు ఒక లాభాంశమై యున్నది. దేశం యొక్క బలాబలాలు కుటుంబాల బలాబలాలపై ఆధారపడి యున్నవి. వారి కుటుంబములలో విధేయులై యుండుటకు నేర్చుకొనని పిల్లలు గల ఏ దేశమైనా ప్రమాదంలో పడ్డట్టే.

*దేవుడు తండ్రులకిచ్చుచున్న ఉత్తరువు.* “తండ్రులారా, మీ పిల్లకు కోపము రేపక, ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడి” (6:4).

(1) ఆత్మసమర్పణతో కూడిన అనురాగం అంతర్నిహితమై యున్నది. తండ్రులు వారి పిల్లలతో వ్యవహరించవలసిన దేవుని ప్రణాళికలో భాగమైయున్న మూడు సూత్రములను పౌలు ఇచ్చుచున్నాడు. మొదటిది, తండ్రులు వారి పిల్లలు యెడల ఆత్మసమర్పణతో కూడిన అనురాగం గలవారై యుండవలెను. 4వ వచనం ఈ విషయాన్నే ధ్వనించుచున్నది: “తండ్రులారా, మీ పిల్లలకు కోపము రేపకుడి.”

పిల్లలు ఆరోగ్యకరమైన విధానములో ఎదుగుచు పరిపక్వతకు చేరుకొనవలెనంటే, వారి తల్లిదండ్రులు వారి యెడల ఆత్మసమర్పణతో కూడిన అనురాగం గలవారై యున్నారను భావం వారి మనస్సుల్లో కలుగవలెను. ఇటువంటి అవగాహన లేని చోట, పిల్లల ఆత్మాభిమానము మరియు మానసిక శ్రేయస్సు తీవ్రంగా ఒత్తిడికి గురౌతాయి. పిల్లల్లో ఈ పరిస్థితి అక్షరాలా ఏర్పడాలంటే తండ్రి వారి మనస్సును నిరంతరం క్రుంగదీస్తే సరిపోతుంది (కొలొస్సయులకు 3:21).

(2) క్రమశిక్షణ ఉపదేశింపబడుట. “... శిక్షలోను బోధలోను వారిని పెంచుడి” (6:4). తండ్రులు తమ పిల్లలతో ఎలాంటి సంబంధములు కలిగియుండవలెనో యని చెప్పుచూ పౌలు ఇప్పుడు నిర్మాణాత్మకమైన కోణాన్ని తెలియజేస్తున్నాడు. శిక్షలోను బోధలోను వారు పెంచబడాలి. ఈ అంశాలు లేకుండా, పిల్లలు ఆధ్యాత్మికంగానైతేనేమి, భావోద్రేకముల విషయంలోనైతేనేమి, లేదా మానసికంగానైతేనేమి, ఆరోగ్యవంతమైన వ్యక్తులుగా పెంచబడజాలరు.

ఈ “బోధ” ఏమైయున్నది? అనగా, పిల్లలు తమ జీవితంలో పాటించుటకు అలవర్చుకొనవలసిన నియమములు, నిబంధనలు, మరియు సూత్రములు అని మామూలుగా చెప్పుకొనవచ్చును. తల్లులైతేనేమి తండ్రులైతేనేమి, వాస్తవికమైన ఈ ఉపదేశములను పిల్లలకు అబ్బుజేయాల్సిన బాధ్యత ఇరువురిపై నున్నది. ఇట్టి ఎరుక ద్వారానే పిల్లలు తప్పొప్పులను

ఎరుగుదురు, జీవితంలో ఏ యే విషయాలు దీవెనలు తెచ్చునో, ఏ యే విషయాలు శాపములు కలుగుజేయునో వాటిని తెలిసికొందురు.

ఇటువంటి ఉపదేశములు "శిక్షణ"తో స్థిరపరచబడవలెను. ఇచ్చట, పిల్లలు వారికి నేర్పించబడు నియమములు, నిబంధనలు, మరియు సూత్రముల ప్రకారం జీవించగలుగునట్లు తమ్మునుతాము ఒక క్రమశిక్షణకు అంకితం చేసుకొనునట్లు వారికి తోడ్పడుటయని అర్థమిచ్చుచున్నది. విధేయులైన వారికియ్యబడు ప్రతిఫలములను, మరియు అవిధేయులైనవారు ఎదుర్కొనవలసి యుందు పర్యవసానములను పిల్లలు ఎరిగియుండవలెను.

నేడు అనేక కుటుంబాల్లో పిల్లలకు ఉత్తరువులు జారీచేయబడుచున్నవి కానీ ఆ ఉత్తరువులను ఎలా పాటించాలో మార్గనిర్దేశనము ఇవ్వబడుట లేదు – లేదా ఆదేశములను సగౌరవంగా అమలుచేయనట్లయితే ఏర్పడు పర్యవసానములు వారికి తెలియజెప్పబడుట లేదు. ఇదొక విషాదాంతమైన పరిస్థితియై యుంటున్నది. ఇటువంటి అస్పష్టత పిల్లలను తికమకపెట్టుచు ప్రవర్తనలో వారిని పెడదారి పట్టిస్తుంది. దేవుని ప్రణాళికలో ఆదేశములు మాత్రమే గాక వాటిని ఆచరణాత్మకముగా అమలుచేయుటకు అవసరమైన నిర్దేశనములు కూడా కలవని పౌలు చెప్పుచున్నాడు.

(3) ఉద్దేశింపబడిన దిశా దర్శకత్వం ఉన్నది. "ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడి" (6:4). తండ్రులు తమ పిల్లలను ఎలా నడింపించాలో ఎన్నుకొనుటకు వారి ముందర రెండే రెండు నిర్దేశనములున్నవి: ప్రభువునందు లేదా ప్రభువునకు వెలుపల. పిల్లలకు బైబిలు బోధించుచున్న సూత్రముల ప్రకారము నేర్పించవచ్చును లేదా మానవతావాద సూత్రములనైనా నేర్పించవచ్చును. మొదటి విధానము కుటుంబములో సంతోషము, సమాధానము, మరియు సామరస్యము కలుగజేస్తుంది. రెండవది, పిల్లలు ఇతరుల గూర్చి ఆలోచించకుండానే తమ కొరకు తామే జీవించు తీరును నేర్పిస్తుంది. ఒకటి, విచారపడవలసిన విషయాలు లేని జీవితమునకు దారి తీస్తుంది; మరొకటి జీవితకాలమంతయు ఇతరులతో మెలగవలసిన విషయాల్లో అనేక హృదయవేదనలు కలుగజేస్తుంది.

వారి పిల్లలకు నేర్పించు క్రమశిక్షణలోను బోధలోను సరైన దిశాదర్శకత్వాన్ని తల్లిదండ్రులు సమకూర్చవలెను. ఈ పని పాఠశాలల్లోని పంతులమ్మలకు, శాసన సభ సభ్యులకు, లేదా సంఘానికి అప్పజెప్పబడకూడదు. వీరందరు తోడ్పడవచ్చును, కానీ తమ పిల్లల జీవితాల్లోనికి దైవికమైన దిశాదర్శకత్వాన్ని ప్రవేశపెట్టుట సంపూర్తిగా తల్లిదండ్రుల బాధ్యతాయుతమైన కర్తవ్యమై యున్నది.

*ముగింపు.* మన కుటుంబాలు ఏమై యుండవలెనని సంకల్పించి దేవుడు సృజించాడో, అవి అవే అయియుండవలెనని ఆయన ఆశించుచున్నాడు; మనము ప్రాపంచిక పద్ధతుల్లో చిక్కుబడునట్లు చేయు ఒత్తిడులకు గురి కాకూడదని ఆయన మనలను కాపాడుచున్నాడు. క్రైస్తవ కుటుంబాలు విడిపోయి విచ్ఛిన్నం కాకూడదు. క్రైస్తవ వివాహాలు జీవితాంతము వరకు కలిసి కొనసాగుచుండవలెను. మన వివాహములలో, కుటుంబాలలో, మరియు మన జీవితాలలో నుండు ప్రతి విషయాన్ని దేవుని ఆత్మ యొక్క అధీనమునకు అప్పగించుకొనవలెను.

**పనుల్లో ఆత్మపూర్ణులై యుండుట (6:5–9)**

యజమానులకును దాసులకును మధ్య నుండు సంబంధముల గూర్చిన నాలుగు వచనాల్లో నుంచి మూడు వచనాలు దాసుల సంబంధానికే కేటాయింపబడినవి. ఇది ఆశ్చర్యమును కలిగించు అంశమేమీ కాదు, ఏలయనగా అనేక మంది ఆది క్రైస్తవులు సమాజంలోని ఈ వర్గములో నుంచి వచ్చినవారే (1 కొరింథీయులకు 1:26 చూడుము). నేడు ఉద్యోగాల్లో ఉన్నవారికి ఈ సూత్రములే కొన్ని వర్తించుచున్నవి.

*ఉద్యోగి, యజమానుని యెడల చూపించు యథార్థమైన మర్యాద.* "దాసులారా, యథార్థమైన హృదయముగలవారై భయముతోను వణకువతోను క్రీస్తునకు వలె, శరీర విషయమై మీ యజమానులైనవారికి విధేయులై యుండుడి ..." (6:5, 6). దాసులు లోబడి యుండవలసినదని పౌలు తెలియజెప్పుచున్నాడు. ఉద్యోగికి ఇదే విధమైన సూత్రము వర్తించుచున్నది. ఉద్యోగి ప్రతి విషయంలోను – పర్యవేక్షకుడు అతని పనిని గమనించుచున్నప్పుడు మాత్రమే కాదు – తన యజమానునికి మర్యాద ఇచ్చుచుండువాడుగా ఉండవలెను. తన యజమానుని సంతోషపరచుటకు ప్రయత్నించుచుండవలెను, కానీ వాని ప్రధాన ధ్యేయం దేవుని సంతోషపరచుటయై యుండవలెను. ఎంతైనా, క్రైస్తవుడైయున్న ఉద్యోగి కార్యాలయములో, క్షేత్రములో, లేదా పనిచేయు చోట దేవుని ప్రతినిధియై యున్నాడు.

షరతులేమియు లేవు. అపొస్తలుడు, "మీ యజమానుల ఉత్తరువులకు అర్థమున్నట్లయితేనే వారికి లోబడి యుండుడని" చెప్పలేదు. "మీ యజమానులు మీకు అప్పగించు పని మీకు ఇష్టమైతేనే వారికి లోబడి యుండుడని" ఆయన చెప్పలేదు. కానీ, క్రైస్తవుడైన ఉద్యోగి మర్యాదతోను, గౌరవపూర్వకంగాను, మరియు మనఃపూర్వకంగాను పనులు చేయవలెనని చెప్పాడు.

ఉద్యోగి, సహకరించువాడు లేదా తన యజమానుని గౌరవించువాడు కానప్పుడు, వాడు దేవుడు ఈ విశాల విశ్వమంతటిలో నెలకొల్పిన ఆయన యొక్క ప్రాథమిక అధికారము మరియు లోబడుటయను సూత్రమునకు విరోధముగా తిరుగుబాటు చేయుచున్నవాడగును. యజమానుడు మరియు ఉద్యోగులకు మధ్య నుండు సంబంధములో ఈ నియమము ఉన్నత స్థానములో ఉంచబడవలెనని ఆయన ఆశించుచున్నాడు.

అవిధేయత దేవుడు ఏర్పాటుచేసిన అధికారము/లోబడుటయను సూత్రమును నాశనము చేయుట మాత్రమే కాదు, కానీ అది క్రైస్తవ సాక్ష్యమునకు కీడు కలుగజేస్తుంది. ఒక ఉద్యోగిగా విలక్షణమైన క్రైస్తవ ప్రమాణములను మరియు విలువలను ప్రదర్శించు విధంగా పనిచేయుట, ఒకడు పనిచేయు స్థలంలో సౌవార్తీకరణముకు ద్వారములు తెరువబడుటకు గల ఒకే ఒక్క సార్థకమైన మార్గమై యున్నది.

"నేను చేయుచున్న పనులు, అవి చేయబడుచున్న విధానములు నేను నా విశ్వాసమును నా యజమానునితో లేదా నా తోటి పనివారితో పంచుకొనుటకు ప్రయత్నించునప్పుడు నా సాక్ష్యము నమ్మదగినదని నిరూపించునా?" యని మనలను మనము ప్రశ్నించుకొనవలసిన అవసరమున్నది.

*ఒక ఉద్యోగి వాని యజమానుని యెడల ప్రదర్శించు ఇష్టపూర్వకమైన వైఖరి.* "దాసులారా, ... క్రీస్తునకు వలె ... మీ యజమానులైనవారికి విధేయులై యుండుడి ...

మనుష్యులకు చేసినట్టు కాక ప్రభువునకు చేసినట్టే యిష్టపూర్వముగా సేవచేయుడి" (6:5-7). దీనికి సమానాంతరమైనది. పౌలు కొలొస్స క్రైస్తవులకిచ్చిన ఆదేశము ఈ సందర్భములో జ్ఞానబోధకమైనదై యున్నది: "... మీరేమి చేసినను అది మనుష్యుల నిమిత్తము కాక ప్రభువు నిమిత్తమని మనస్ఫూర్తిగా చేయుడి ..." (కొలొస్సయులకు 3:23, 24). క్రైస్తవుడైన పనివాడు యేసు తన ఇహలోక పర్యవేక్షకుడై యున్నాడని ఎంచుకొనుచు వానికి అప్పగింపబడిన పనులను చేయుచుండవలెను. మనము పనులు చేయునప్పుడు, "నేను ఈ ఇంటిని యేసు ఇందులో నివసింపబోవుచున్నాడని నిర్మిస్తాము;" "నేను ఈ పరికరమును యేసు దీనిని ఉపయోగించబోవుచున్నాడని సరిచేస్తాను" అని మనము ఆలోచించుచుండవలెను. మనము అక్షరాలా యేసు కొరకు పనిచేయుచున్నవారమై యున్నట్లయితే, మనము నిస్సందేహముగా ఎటువంటి వాదోపవాదములు చేయకుండా లేదా ఆలస్యమేమియు చేయకుండా ఆయనకు లోబడుచు పనులు చేయవలెనని ఇష్టపడి యుండుటకు సిద్ధపడి యుందుము. పౌలు ఆదేశముల మేరకు, మన యజమానుల యెడల మనము ప్రతిస్పందించవలసిన విధానము ఇదే.

క్రైస్తవుడైన ఉద్యోగి ఇష్టపూర్వకమైన వైఖరితో పనులు చేయజాలకపోయినట్లయితే, అతడొక ఎంపిక చేసుకొనవలెను: అతడు తన ఉద్యోగమునైనా మార్చుకొనవలెను, లేదా తన వైఖరినైనా మార్చుకొనవలెను. మొదటి శతాబ్దమునాటి దాసులు ప్రభువైన యేసును సేవించుచున్నట్టే వారి యజమానులను సేవించగలిగినట్లయితే, మనము కూడా వైఖరితో సేవించగలము! మనము చేపట్టు ఏ పనైనను మన జీవితములలో గల పరిశుద్ధాత్మను ఉత్తమంగా ప్రదర్శించులాగున దానిని మనము ఎలా భిన్నంగా చేయగలమని మనలో ప్రతి ఒక్కరము యోచించవలెను.

*ఒక ఉద్యోగి తన యజమానుని పనులను వాని శాయశక్తులా చేయుటకు గల సక్రమమైన హేతువు.* ఆత్మపూర్ణుడైన పనివాని యొక్క విశిష్టమైన పనికి మరియు వైఖరికి లేఖనములు రెండు కారణములిచ్చుచున్నవి. ఒకటి నిర్మాణాత్మకమైంది; రెండోది వ్యతిరేకార్థకమైంది. నిర్మాణాత్మకమైన హేతువు 8వ వచనంలో ఇవ్వబడి యున్నది: "దాసుడైనను స్వతంత్రుడైనను, మీలో ప్రతివాడును ఏ సత్కార్యము చేయునో, దాని ఫలము, ప్రభువు వలన పొందునని మీరెరుగుదురు."

పౌలు దినములలో దాసులు, వారు ఎంతటి విద్యావంతులై యుండినప్పటికిని దానితో నిమిత్తము లేకుండా, యజమానుల సొత్తైయున్నట్టుగా వ్యవహరింపబడ్డారని మనము ఇదివరకే గమనించాము. విద్యావంతుడు, సంస్కారవంతుడునై యుండి క్రైస్తవుడైన దాసుడు వాని నూతన విశ్వాసమునుబట్టి మరి ఎక్కువ కఠినముగా వ్యవహరింపబడవచ్చుననునది వాస్తవమై యుండింది. వారు తమ శాయశక్తులా చేయుచుండుట మానివేయవద్దని పౌలు ఆ దాసులను ప్రోత్సాహించాడు, ఏలయనగా వారి విశ్వసనీయమైన సేవలనుబట్టి ప్రభువే వారికి ప్రతిఫలము నిచ్చు ఆ రోజు రానైయుండింది.

ఉద్యోగులముగా, మనము యోగ్యులమైయున్న ప్రతిఫలము మనకు ఈ జీవితములో ఎల్లప్పుడు లభించకపోవచ్చును. వేతనము తక్కువ, పని భారము మితిమీరి ఎక్కువై యుండవచ్చును. ఏది ఏమైనా, ప్రతిఫలమును ప్రభువు సమతుల్యము చేయ ఆ రోజు రానైయున్నది. క్రైస్తవుడు చేయు పనికి వానికియ్యబడు వేతనమే వాని పూర్తి

జీతము కాదు. ఏదో ఒక రోజున యేసు విశ్వసనీయులైన తన వారికి "స్వాస్థ్యమును ప్రతిఫలముగా" ఇచ్చును. నిజముగా, మనము మన పనులలో కష్టపడి పనిచేయునప్పుడు, ఆయనను సేవించుచున్నవారమౌదుము. మనము పని చేయునది ఎక్కడైనా సరే, ఎవరి యొద్దనైనా సరే, యేసే మన అసలైన యజమానుడై యున్నాడు. మనము అనునిత్యము అనుభవించుచుండు అన్యాయము ఏదైనను, అది మన ప్రవర్తనను నియంత్రించకూడదు. మనము పూర్ణహృదయముతో పనులు చేసినట్లయితే, మనము తగిన కాలమందు పూర్తి ప్రతిఫలము పొందునట్లు ప్రభువే చూచును.

ఇటువంటి సేవకు గల వ్యతిరేకార్థకమైన హేతువు కొలొస్సయులకు 3:23–25లో కలదు: "మీరు ప్రభువైన క్రీస్తునకు దాసులై యున్నారు. అన్యాయము చేసినవానికి తాను చేసిన అన్యాయము కొలది మరల లభించును, పక్షపాతముండదు."

క్రైస్తవులు వారి ఉద్యోగములలో ఎన్నడును తప్పు చేయరాదు. అందుకు అనువైన నెపము ఏదియు లేదు. మనము చేసిన తప్పులకు మనము ఇతరులను నిందించజాలము. సమస్తమును చూచు దేవుడు మనము చేసిన తప్పులకు తగిన ప్రతిఫలమిచ్చును.

సందర్భవశాత్తు, తోటి క్రైస్తవుడైన ఒక యజమాని యొద్ద పనిచేయుటకు గల ప్రత్యేకార్హతనుబట్టి, అతడు తక్కువగా శ్రమించవచ్చునని లేదా తక్కువ ఉత్పాదకమైనవాడు యుండవచ్చునని అర్థం కాదు. ఇందుకు విరుద్ధంగా, క్రీస్తునందు సహోదరుడైయున్న యజమాని పనులను ఉత్తమోత్తమంగా చేయుచు అతనిని అత్యంత మర్యాదపూర్వకంగా గౌరవించవలెను.

*ఉద్యోగుల యెడల యజమాని విధి.* "యజమానులారా, మీకును వారికిని యజమానుడైనవాడు పరలోకమందున్నాడనియు, ఆయనకు పక్షపాతము లేదనియు ఎరిగినవారై, వారిని బెదరించుట మాని, ఆ ప్రకారమే వారి యెడల ప్రవర్తించుడి" (6:9). దాసులను సొంతం చేసుకొన్న మొదటి శతాబ్దము నాటి యజమానులకు ఈ మాటలను ఆచరణలో పెట్టడానికి ఎంత కఠినంగా తోచినవో కదా! రోమా సామ్రాజ్యములోని యజమాని తన దాసులపై పూర్తి అధీనం కలిగియుండెను, ఇంకా కొంచెం వివరంగా చెప్పుకొంటే, వారి చావుబ్రతుకులపై సహితము అధికారము కలిగియుండెను. ఇచ్చట, ఆత్మపూర్ణుడైన యజమాని విశిష్టమైనవాడై యుండవలసినదే అంటూ పౌలు తన పాఠకులకు ఆదేశములిచ్చుచున్నాడు. ఈ యజమాని తన దాసుల యెడల న్యాయసమ్మతముగా వ్యవహరించవలెను, నీతియుక్తము మరియు న్యాయమైన విధానములో వ్యవహరింపవలెను.

ఇంతకూ ఇచ్చట నేర్పింపబడుచున్న నియమమేమిటి? అది మత్తయి 7:12లో వ్రాయబడి యున్న "సువర్ణ సూత్రము" కంటె తక్కువైనదేమీ కాదు. యజమానుల చేతి క్రింద ఉద్యోగములు చేయువారు యజమానులై యుంటున్నవారితో ఎలా వ్యవహరింపవలెనని ఇప్పుడు యజమానులై యున్నవారు కోరుదురో ఆలాగుననే వారును వారి చేతి క్రింద ఉద్యోగములు చేయువారితో వ్యవహరింపవలసి యున్నది.

క్రైస్తవుడైన యజమాని ఆయన అధికారము క్రింద పనిచేయువారి యెడల గురుతరమైన బాధ్యత కలిగియున్నాడు. "... ఆ ప్రకారమే వారి యెడల ప్రవర్తించుడని" పౌలు చెప్పుచున్నాడు గనుక యజమాని తన కొరకు పనులుచేయువారి సంక్షేమమును కోరుచుండవలెను. ఆయన కొరకు పనిచేయువారు వారి శాయశక్తులా పనిచేయవలెనని

యజమాని ఆశించినట్లయితే, ఆయన కూడా తన అధికారము క్రింద ఉద్యోగములు చేయువారి కొరకు తన శాయశక్తులా పనిచేయవలెను.

*ఉద్యోగుల యెడల యజమాని యొక్క సరైన వైఖరి.* ఉద్యోగము చేయువారిని యజమానులు నోటి మాటలతో దూషింపరాదు, ఏలయనగా "బెదరించుట మానుడని" పౌలు యజమానులకు ఆదేశములిచ్చుచున్నాడు. అది ఒక పనివానిని ప్రోత్సాహించు పద్ధతి కాదు. యేసు ఆయనను వెంబడించుచుండిన వారితో ఆ విధంగా ఎన్నడును ప్రవర్తించలేదు.

పనివానికున్నట్లే, పరలోకమందు అతనికి కూడ యజమానుడున్నాడని కార్యసార్థకమైన యజమాని జ్ఞాపకముంచుకొనవలెను. ఈ యజమాని సహితము తీర్పు నిమిత్తమై అదే దేవుని యెదుట నిలువబడవలసి యున్నది. క్రైస్తవులై యుండి కూడా తమ శాయశక్తులా పనులు చేయుటకు విఫలులగు ఉద్యోగుల యెడల పక్షపాతము చూపనట్లయితే, దైవికమైన నియమములను అనుసరించుచు తమ పరిపాలనలో యజమానులు ప్రదర్శించు బుద్ధిపూర్వకమైన వైఫల్యమును కూడా ఆయన పట్టించుకొనకుండా ఉండడు.

*ముగింపు.* మనము "సామాజికపరమైన సువర్తమానమును" ప్రకటించము, కానీ సామాజికపరమైన అంతర్భావములు కలిగియున్న సువార్తను ప్రకటించుచున్నాము. మన జీవితములు దేవునికిని పరిశుద్ధాత్మ అధీనమునకును సమర్పింపబడినవైనట్లయితే, మనము పనులు చేయుచుండు తీరు, ఇతరులు చేయుచుండు తీరునకు భిన్నమైనదై యుంటుంది. క్రైస్తవ్యము కేవలము ఆరాధించుటకు సమావేశమగు సంఘము కొరకు కాదు; అది మనము పనులుచేయుచుండు పరిసర ప్రాంతముల కొరకు కూడ ఉద్దేశింపబడినదై యున్నది! మనము చేయుచుండు పనుల ద్వారా పరిశుద్ధాత్మ యొక్క ప్రభావములు మన జీవితములలో ప్రదర్శింపబడునట్లు మనము అనుమతించినట్లయితే, మన ఆరాధనలోగల సాక్ష్యమును మన తోటిపనివారు అంగీకరించుటకు వారికెటువంటి కష్టమైనను కలుగదు!

క్రిస్ బుల్లార్డ్

**మన శత్రువు (6:10–12)**

సాతాను మనపై అపవాదులు మోపువాడు మరియు మన విరోధియునై యున్నాడు. వాడు శక్తిమంతుడై యున్నాడు (1 పేతురు 5:8 చూడుము) గనుక వాడు మనకు విరోధముగా కుతంత్రములను లేక పన్నుగడలను ప్రయోగిస్తుంటాడు. వాడు మనపై దాడి చేయుటకు కుటిలమైన వ్యూహములను మరియు సాధనములను ఉపయోగిస్తుంటాడు. వాడు గతించిన తరముల యందంతటను చేసినట్లే, నేడు సహితము వాడు ప్రజలను పెడదోవ పట్టిస్తూ పాపములో పడవేయుచున్నాడు. భక్తుడైన యోహాను, "శరీరాశ మరియు నేత్రాశ మరియు జీవపు డంబమును" 1 యోహాను 2:15–17లో పేర్కొన్నాడు. "శరీరాశ" అనగా శరీర అవయవముల ఆకలి, "నేత్రాశ" అనగా కనబడిందెల్లా కావాలని కోరుట, "జీవపు డంబము" అనగా తెగింపుతో దేనిమైనను సాధించవలెనను ఆశ.

ఆదికాండము 3:6లో వ్రాయబడి యున్నట్టుగా సాతాను హవ్వను ఈ మూడు విధానాల్లోను శోధించాడు. నిషేధింపబడిన ఫలము "ఆహారమునకు మంచిదియు" (శరీరాశ), "కన్నులకు అందమైనదియు" (నేత్రాశ), "వివేకమిచ్చు రమ్యమైనదియునై" (జీవపు డంబము) యుండినదని హవ్వ చూచింది.

యేసు అరణ్యములో శోధింపబడినప్పుడు, సాతాను ఆయనను ఇదే విధానములలో సమీపించాడు. రాళ్లను రొట్టెలుగా మార్చుట గూర్చిన శోధన శరీరాశకు ఆకర్షణీయమైనదై యుండింది. లోక రాజ్యములను నీకిచ్చెదనని పలుకుట నేత్రాశకు సముచితమైనదై యుండింది. దేవుడు ఆయనకు అనుగ్రహించు కాపుదలను రుజువు చేయుటకు యేసు దేవాలయ శిఖరము మీది నుంచి క్రిందికి దూకవలెనని సాతాను చేసిన సూచన, జీవపు డంబమునకు చెందినదై యుండింది (మత్తయి 4; లూకా 4).

మనము కూడ ఈ రోజుల్లో ఇటువంటి శోధనలనే ఎదుర్కొనుచుందుము. సాతాను నేడు సహితము ప్రజలను ఈ మూడు విధానాల్లో ముట్టడించుచున్నాడు. శరీరాశలైతేనేమి, నేత్రాశలైతేనేమి మరియు జీవపు డంబమైతేనేమి, ఇవేవియు తమంతట తాము తప్పు కావు; కానీ అవే మన జీవితములలో మొట్టమొదటి స్థానాన్ని ఆక్రమించుకొన్నట్లయితే లేదా అక్రమంగా తీర్చుకొనబడుచున్నట్లయితే, అప్పుడు అవి తప్పుడు పనులు మరియు విధానాలౌతాయి.

తన మరణము మరియు పునఃరుత్థానము ద్వారా క్రీస్తు సాతానును ఓడించాడనునది శుభవర్తమానమై యున్నది (హెబ్రీయులకు 2:14, 15; ప్రకటన 20:10 చూడుము).

జేయ్ లాక్‌హార్ట్

**దైనందిన పోరాటములు: శత్రువును, అనగా సాతానును ఎరిగియుండుట (6:10–12)**

మనము దేవుని కొరకు జీవించుచున్నట్లయితే, మనకు ఎదురయ్యే పోరాటములు ఎన్నో ఉన్నవి. క్రైస్తవుడు తన జీవితములో యుద్ధ భూమిలోనికి పిలువబడ్డాడే కానీ, ఆటలాడుకునే స్థలానికి కాదు. ఇంకా, ఎదుర్కొనబడవలసినయున్న శత్రువు మానవ శరీరము ధరించినవాడు కాదు; దానికి బదులుగా, పోరాటము ప్రాణాంతకమైన ఆధ్యాత్మిక అంధకార శక్తుల సమూహమునకు విరోధముగా జరుగుచున్నదై యున్నది. అది వెలుగునకును చీకటికిని, జీవము మరియు మరణమునకును, పరలోకమునకును నరకమునకును మధ్య జరుగుచున్న పోరాటమై యున్నది. యేసు నామమును ఎలుగుగెత్తి పలుకుచుండు ప్రతివారు ఈ పోరాటంలో నిమగ్నులై యుంటారు. ఏ కారణము చేతనైనను ఏ ఒక్కరును మినహాయింపబడలేదు; అందరూ పోరాడాల్సిందే.

మనమెలా పోరాడాలి? మనము విజయాభవులమగు సమర్థవంతులను గావించుటకు ఏదైన ఒక వ్యూహము రచింపబడియున్నదా? అంధకార శక్తులన్నింటిపై విజయమును సాధించగల దైవికమైన వ్యూహమును పౌలు మనముందుంచుచున్నాడు.

విజయానికి మొదటి మెట్టు 6:10–12లో చూడనగును. మనము శత్రువు యొక్క పన్నుగడలకు విరోధముగా పోరాడవలెనంటే ప్రభువు బలముపై ఆధారపడవలసినదే.

> తుదకు ప్రభువుయొక్క మహాశక్తిబట్టి ఆయనయందు బలవంతులై యుండుడి. మీరు అపవాది తంత్రములను ఎదిరించుటకు శక్తిమంతులగునట్లు దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి. ఏలయనగా మనము పోరాడునది శరీరులతో కాదు, గాని ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకారసంబంధులగు లోకనాథులతోను, ఆకాశమండలమందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము (ఎఫెసీయులకు 6:10–12).

ఏ సైన్యము యొక్క రహస్య సమాచార విభాగం అధికారులైనను ఆ సైన్యము చేపట్టు యుద్ధములో అత్యంత కీలకమైన పాత్ర వహిస్తారు ఏలయనగా శత్రువు యొక్క సత్తా ఏమిటో తద్వారా పై అధికారులకు తెలియజేయబడుతుంది గనుక వారు దానిని అర్థంచేసుకొంటారు. శత్రువు ఎవరై యున్నారు, ఎక్కడ ఉన్నారు, మరియు వారేంచేయగలరు, మొదలగు విషయాలు మనము తెలిసికొనియుంటే తప్ప, వానిని మనము ఎలా ఓడించగలము? దేవుని వాక్యము ప్రకారం, అపవాదే మన అసలైన విరోధియై యున్నాడు.

సాతాను ఆరంభాల గూర్చి దేవుడు మనకు మామూలుగా తెలియజెప్పలేదు, కానీ సాతాను ఎలా వుంటాడు, వాడేంచేస్తుంటాడు, మరియు వాడెక్కడికి వెళ్లనై యున్నాడు, మొదలగు విషయాలు మనకు తెలియజెప్పాడు. దుష్టుని శక్తులకు విరోధముగా అతడు చేయుచుండు వ్యక్తిగత పోరాటంలో విజయమొందాలని ఆశించు క్రీస్తు యొక్క ప్రతి సైనికుడు శత్రువు గూర్చి నేర్చుకొన్నవాడై యుండవలెను.

సాతాను దేవుడు కాడు గనుక, వాడు సృష్టింపబడిన యొక ప్రాణియై యున్నాడు, దేవుడు తానే నిత్యుడైయున్నట్టుగా వాడు నిత్యుడు కాడు. తత్ఫలితంగా, వాడు తన తెలివితేటల్లోను కార్యకలాపాల్లోను పరిమితము గలవాడై యున్నాడు. వాడు సర్వజ్ఞాని, సర్వశక్తిమంతుడు, లేక సర్వవ్యాపి కాడు. మనము మన జీవితములలో దేవుని శక్తిగలవారమై యున్నట్లయితే, అపవాది అజేయుడు కాడు. మన విరోధి, అనగా అపవాది గూర్చి పౌలు ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక ఆరవ అధ్యాయంలో చెప్పిన విషయాలను మనము గమనించుదాము.

*సాతాను కుతంత్రములు చేయువాడు* (6:11). ఎవరైనను పరలోకమునుగాని లేదా నరకమునుగాని కోరుకొనవచ్చునని సాతాను వారికి ఒక ఎంపికనిచ్చునా? సహజంగానే, ఇవ్వడు. ఎవరైనను నిత్య చిద్విలాసమునకు బదులుగా, నిత్య యాతనను బుద్ధిపూర్వకంగా ఎంపికచేసుకొనరని వానికి తెలియును. కాబట్టి వాడు కుతంత్రములకు పాల్పడును, మరియు మన ఆత్మల కోటగోడలను ముట్టడించుటకైన వాని ప్రణాళికలు జిత్తులమారితనముతో నిండినవై యుండును. వాని ఎత్తుగడకు పైఎత్తుగడ మనమే వేయాలి కానీ అందుకు అపవాదిని మనము అనుమతించకూడదని పౌలు మనలను హెచ్చరిస్తున్నాడు, "ఏలయనగా సాతాను తంత్రములను మనము ఎరుగనివారము కాము" (2 కొరింథీయులకు 2:11).

ఆ కుతంత్రములేమిటి? సాతాను మూడు విధాలుగా దాడిచేస్తాడు: శరీరాశకు, నేత్రాశకు, మరియు జీవపు డంబమునకు మనలను ఆకర్షితులను గావిస్తాడు (1 యోహాను 2:15-17 చూడుము). ఒక సారి లేదా మొదటిసారి మనము చెడు చేసినప్పటికిని మనము తప్పించుకొనగలమని మనము అనుకొనునట్లు మనలను కుయుక్తితో మోసంచేస్తాడు. ప్రస్తుతానికైతే ఈ లోకంలో మన అవసరములే అత్యంత ప్రాముఖ్యమైన అంశాలని మనలను ఒప్పిస్తాడు. ఎప్పుడో ఒకప్పుడు ఏర్పడు దండన కంటె పాపము వలని తత్క్షణ సుఖానుభూతులే గొప్పవని మనకు తెలియజెప్పును. కుయుక్తిగాను, పద్ధతి ప్రకారంగాను, వాడు ప్రజలను ఆధ్యాత్మిక తిరుగుబాటు బాటలో పెడదోవ పట్టిస్తాడు. మానవ ఊహ, మేధావి, మరియు చాతుర్యము అపవాది జిత్తులమారితనము ముందు సాటిరావు. అపవాది కుతంత్రములకు విరోధముగా జరుగుచుండు ఈ పోరాటమును మనము జయించుటకు మనకు దేవుని సహాయము అత్యావశ్యరమై యున్నది.

*సాతాను ఆధ్యాత్మిక ప్రాణియై యున్నాడు* (6:12). ఆధ్యాత్మికమైయున్న ప్రతి

విషయము నీతితో కూడినది కాదని క్రైస్తవులు తెలుసుకొన్నప్పుడు అది ప్రభువు యొక్క సంఘమునకు ఒక గొప్ప దినమై యుండును. పరిశుద్ధ బైబిలు ఇలా సెలవిచ్చుచున్నది, "ప్రియులారా, ... ప్రతి ఆత్మను నమ్మక, ఆ యా ఆత్మలు దేవుని సంబంధమైనవో కాదో పరీక్షించుడి" (1 యోహాను 4:1). సాతాను ధ్వజము క్రింద మోసపుచ్చుచున్న అనేక ఆత్మలు లోకము లోనికి ప్రవేశించాయి.

మన పోరాటము కైవశంచేసికొనబడగల, ఖడ్గముతో రెండు ముక్కలుగా నరికివేయబడగల, లేదా ఒక తుపాకి తూటాతో పేల్చివేయబడగల శత్రువుకు విరోధముగా జరుగుచున్నది కాదు. అది దయ్యపు శక్తులతో జరుగుచున్నదై యున్నది, అబద్ధములు, అబద్ధ సిద్ధాంతములు, నకిలీ మతములు, అబద్ధ తత్త్వశాస్త్రములు, మరియు తెలివితో వక్రీకరింపబడిన సత్యము, మొ॥ వాటి యుద్ధోపకరణములై యున్నవి. మన విరోధి ఒక ఆధ్యాత్మిక ప్రాణియై యున్నాడు, గనుక వాని ప్రధాన కార్యాలయములు కంటికి కనబడని మరొక పరిమాణములో నున్న ప్రదేశాల్లో ఉన్నవి.

*సాతాను బలవంతుడు* (6:12). సాతాను బ్రహ్మాండమైన శక్తిగలవాని వలె చిత్రింపబడి యున్నాడు; వాడు కేవలము రక్తమాంసములు గలవారమైన మనకు భీకరమైన ప్రత్యర్థియై యున్నాడు. మన ఆధ్యాత్మిక వైరి యొక్క బలమును తక్కువగా అంచనా వేయుట అదొక ప్రాణాంతకమైన పొరపాటే ఔతుంది.

వాడు ఒంటరివాడు కాకపోవుటయే, సాతాను ఇంత శక్తిమంతుడుగా నుండుటకు గల ఒక హేతువై యున్నది. వాడు అంధకార సంబంధులగు దురాత్మల సమూహమునకు అధిపతియై యున్నాడు, గనుక ఈ సమూహము వానికి ఆధ్యాత్మిక దుర్మార్గ కార్యములలో తోడ్పడుచుండును. 6:12లో అవి, ప్రధానులు, అధికారులు, అంధకార సంబంధులగు లోకనాధులు, మరియు ఆకాశమండలమందున్న దురాత్మల సమూహము అని వర్ణింపబడి యున్నది. ఈ దుర్మార్గపు సైన్యములో దురాత్మల సమూహములు ఎన్ని వున్నాయో మనకు తెలియదు.

వానిని ఒక హాస్యరసపూరితమైన పొట్టి మనిషిగా, ఎరుపు దుస్తులు ధరించినవానిగా, తలపై రెండు కొమ్ములున్నవానిగా, చేతిలో ఒక పంగలకొయ్య ఒకటి పట్టుకొని అటూ ఇటూ పరుగెత్తుచున్నట్లుగా చిత్రిస్తూ ప్రజలు సాతాను యెడల ఎగతాళిగా నవ్వుతూ కొట్టిపారేయటం ఎంత విషాదాంతమైన విషయమై యున్నదికదా! సాతాను ఈ విశాల విశ్వానికి ఒక రాజా హాస్యగాడు *కాదు.* వాడు ఈ యుగ సంబంధమైన దేవత అని పౌలు ఘోషిస్తున్నాడు (2 కొరింథీయులకు 4:4 చూడుము). వాడు శక్తిమంతముగా ఏలుచున్నాడు. వాడు బలహీనుడు కాదు; వాడు శక్తిమంతుడు. వాడు బలవంతుడై యున్నాడు, గనుక వాని అధికారము మనము ఒంటరిగా తట్టుకోలేనంత గొప్పదై యున్నది. మనమే బలహీనులము. మనము ఎదుర్కొనుచున్న ఓటములలో అధిక శాతం, పోరాటంలో విజయం సాధించుటకు అవసరమైన బలము మనలోనే ఉన్నదని మనము అనుకొనుట వలన కలుగుచున్నవి. "ప్రభువు యొక్క మహా శక్తినిబట్టి ఆయన యందు బలవంతులమై యుండుటయే" విజయము సాధించుటకు గల ఒకే ఒక్క మార్గమై యున్నది (6:10).

*సాతాను దుర్లక్షణాలుగలవాడై యున్నాడు.* గమనిస్తున్నారు కాదా మన శత్రువు ఎటువంటివాడై యున్నాడో! దేవుడు కాని దానంతటికి సాతాను ప్రతినిధియై యున్నాడు.

దేవుడు వెలుగై యున్నాడని చెప్పబడుచుండగా, సాతాను అంధకారములో వాని పరిపాలన కొనసాగిస్తున్నాడని గుర్తించవచ్చును. వాడు అబద్ధికుడనియు, అబద్ధమునకు జనకుడైయున్నాడని యేసు సెలవిచ్చాడు; వాడు నరహంతకుడై యున్నాడని కూడా ఆయన సెలవిచ్చాడు (యోహాను 8:44).

మనిషిని అవినీతిపరుని జేయునదేదైనను – మనుష్యుని గాయపర్చునదేదైనను, చెడు, చీకటి, ద్వేషము, మరియు ఒప్పింపబడనిది ఏదైనను – దుష్టుని నుండి కలుగుచున్నది. అవినీతి మరియు కళంకపర్చు దానంతటికి వాడు మంత్రియై యున్నాడు. వాడు దీవించిన ఒక్క జీవితమైనా లేదు; ఒకడు మంచిని లేదా మేలుకరమైన మరియు పవిత్రమైన పనులు చేయునట్లు వాడు ప్రోత్సాహించిన ఒక్క ఆత్మయైనా లేదు. మనకు శత్రువైయున్న వాడు బొత్తిగా దుర్లక్షణాలుగలవాడై యున్నాడు.

*ముగింపు.* సాతాను పోరాడుచున్నది మనతో కాదు. ఆరాటంతో కూడిన వాని అసలైన పోరాటం ఈ విశాల విశ్వమంతటికీ పరిశుద్ధుడైనవాడై యున్న వానితో జరుగుచున్నది, కానీ వాడు క్రైస్తవులకు విరోధముగా దాడులు చేయుచున్నాడు ఏలయనగా దేవుడు తన ప్రేమను మరియు అనురాగమును క్రైస్తవులైన మన మీద కుమ్మరించుచున్నాడని వానికి బాగుగా ఎరుకే. ఈ పోరాటమును జయించవలెనంటే, వాని దుర్లక్షణ స్వభావం గూర్చి మనము నేర్చుకొనుచు వాని శక్తి గూర్చి జాగరూకులమై యుండవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

**దైనందిన పోరాటములు: సంగ్రామమునకు సంసిద్ధమగుట (6:13–20)**

దేవుని ఏలుబడిని కూలద్రోసి ఆయనను తన సొంత రాజ్యములో నుంచే పరాజితున్ని చేసి పారదోలుటకు వెదకుచున్న ఒక గొప్ప గర్భశత్రువు ఆయనకున్నాడు. రెండు సింహాసనములు ప్రాణాంతకమైన పోరాటంలో చిక్కుకొని యున్నవి. దేవుడు స్త్రీపురుషుల హృదయాల్లో రాజులకు రాజై యుండి ఆయన తన న్యాయసంగతమైన స్థానమును కొనసాగించుటకు వెదకుచున్నాడు, కాగా అట్టి దేవుని అధికారమును అన్యాయంగా అపహరించుటకు సాతాను ఎడతెరిపిలేకుండా వెదకుచున్నాడు. దేవుని పిల్లలముగా, మన దేవుని సింహాసనమును ఆక్రమించుటకు సకల విధాలా ప్రయాసపడుచున్న ఈ గొప్ప శత్రువుకు సంబంధించిన విషయాలలో నీతియుక్తమైన శక్తులతో చేరవలెనని మనము పిలువబడి యున్నాము.

ఈ పోరాటాన్ని జయింపగోరుచున్న ప్రతి క్రైస్తవ విశ్వాసి ముందర మూడు ప్రతిరక్షణ సాధనోపాయములున్నవి. మొదటిది: మన విరోధి గూర్చి మనలను మనము విద్యావంతులము గావించుకొనవలెను. క్రైస్తవ సైనికుని సార్థకమైన వ్యూహములోని ఇంకా రెండు భాగముల గూర్చి యోచించి వాటిని కార్యాచరణలోనికి దింపవలెను.

*మనలను మనము దేవుడిచ్చు సర్వాంగ కవచముతో సన్నద్ధం గావించుకొనవలెను.* మనము పోరాడుచున్నది రక్తమాంసములతో కాదు కానీ ఆకాశమండల మందున్న ఆధ్యాత్మిక వైరులతో, గనుక విజయము సాధించునట్లు మనకు దేవుడిచ్చు కవచము ఆవశ్యకమై యున్నది.

(1) నడుమునకు సత్యమను దట్టి (6:14). పోరాటం లోనికి ప్రవేశింపక మునుపు ఒక రోమా సైనికుడు చేయవలసి యుండిన మొట్టమొదటి విషయమేమనగా, వాడు ధరించిన బిగుతైన లోపలి ఉడుపు యొక్క మూలలను పైకెత్తి పట్టుకొని వాటిని తన నడుమునకున్న

దట్టీ లోపలికి దూర్చవలెను, వాడు ధరించిన వస్త్రములను గట్టిగా ఒక్క చోట బిగించి యుంచి, పోరాట సమయంలో వాని కదలికలు స్వేచ్ఛాపూరితమైనవై యుండునట్లు సాధ్యత కలిగించింది నడుమునకున్న ఆ దట్టీయే.

సైనికుడు తన దట్టీపై ఆధారపడుచుండెను. ఈ దట్టీ నేడు అనేక మంది పురుషులు ధరించు సన్నని బెల్టు వంటిది కాదు. అది వెడల్పైన తోలు దట్టీయై యుండెను గనుక అది లోదుస్తులను మాత్రమే గట్టిగా వాటి స్థానంలోనే అదిమిపెట్టి యుంచలేదు కానీ వాని ఖడ్గము కూడా దాని స్థానంలో కదలకుండా ఉండునట్లు తోడ్పాటు నిచ్చింది. రణరంగములోనికి ప్రవేశించుచుండిన వారి యుద్ధోపకరణములలో ఈ దట్టీ కీలకమైనదై యుండింది.

అలాగైతే, క్రైస్తవుని దట్టీ ఏమైయున్నది? సత్యమే క్రైస్తవుని దట్టీయై యున్నది. మన విరోధియైన అపవాది కుయుక్తిగలవాడు, పన్నుగడలు చేయువాడు, మరియు వంచించు బుద్ధిగలవాడని మనము ఇదివరకే చర్చించాము. సత్యము వానిని ఓడించుటకు మనముందున్న ఒకే ఒక్క మార్గమై యున్నది. సత్యము శత్రువు యొక్క అబద్ధములన్నింటిని బయటపెట్టును. పరిశుద్ధ బైబిలు ఈ సత్యమునకు మూలాధారమై యున్నది. యేసు, "సత్యమందు వారిని ప్రతిష్ఠ చేయుము, నీ వాక్యమే సత్యమని" ప్రార్థించాడు (యోహాను 17:17).

తప్పిదము, అసత్య సిద్ధాంతములు, మరియు ఆధ్యాత్మిక హేతుబద్ధీకరణములు మొదలగు వాటితో అపవాది మనపై దాడులు చేయుచుండును. మనలను మనము సత్యముతో సంతృప్తీకరణము గావించుకొనుట వాని వంచనలకు విరోధముగా మనము శక్తిమంతులముగా నిలువబడుటకు గల ఒకే ఒక్క మార్గమై యున్నది. మనము దేవుని వాక్యాన్ని చేతబట్టి, దానిని పుష్కలంగా భుజించి, దానితో మన ఆత్మలను నిండుగా నింపుకొని, ఆ తరువాత దానిని గ్రహించగల కృపనిమ్మని ప్రార్థించాలి. ఈ సత్యమే మనము దురాత్మల సమూహమునకు విరోధముగా పోరాడు పోరాటములో సమస్తమును చక్కగా అమర్చబడి బిగుతుగా ఉండునట్లు చేయగల మన దట్టీయై యుంటుంది.

(2) నీతి యను మైమరువు (6:14). పౌలు దినములలో, మైమరువు రెండు విభిన్న విధానాల్లో తయారు చేయబడింది. కొన్ని పర్యాయములు అది భారీ నూలుతో అల్లబడింది, దానిపై కప్పబడినట్లుగా లోహపు గుండ్రని బిళ్లలు వ్రేలాడదీయబడినవి. లోహపు గట్టి పదార్థమును లేదా ఒక విధమైన అల్లిక వంటి లోహపు గొలుసును ఉపయోగిస్తూ ఒక మైమరువును తయారుచేయు పద్ధతి ఎక్కువ సామాన్యమైన విధానమై యుండింది. అది ఏ విధంగా తయారుచేయబడినా, మైమరువు చేయుచుండిన పని, చేయవలసి యుండిన పని ఒక్కటే: సైనికుని ప్రాణాధారమైన అవలయవములను కాపాడుట. అది వాని శరీరమును మెడ మొదలుకొని నడుము వరకు, ముందు మరియు వెనుక భాగమును కప్పివేసింది, మరియు వాని మొండెమునకు ఎవ్విధంగానైనను హాని కలుగకుండునట్లు వాస్తవంగా కాపాడింది. ఏ సైనికుడైనను ఈ మైమరువు లేకుండా రణరంగంలోనికి ప్రవేశించలేదు.

క్రైస్తవ సైనికుని మైమరువు నీతియై యున్నది. ఇది క్రీస్తునందున్న వాని నీతి మాత్రమే కాదు (2 కొరింథీయులకు 5:21 చూడుము), పవిత్రమైన జీవితము యొక్క ఆచరణాత్మకమైన నీతి కూడా అయియున్నది (ఎఫెసీయులకు 4:24 చూడుము). మనకు ఈ మైమరువు అవసరమైయున్నది. సాతాను తప్పిదమును బాణముతోను – దీనికి మనకు సత్యమను దట్టి అవసరమై యున్నది – మరియు అపవిత్రతతోను మనపై దాడిచేయును.

మనము పరిశుద్ధాత్మ శక్తి చేత దైవభక్తిగల జీవితములు జీవించుచున్నవారమైనట్లయితే, వాడు విసిరే అగ్ని బాణములు మనలోనికి చొచ్చుకొనిపోజాలవు. మన అనుదిన జీవితములలో భాగమైయున్న ప్రయోగాత్మకమైన పవిత్రతను పక్కనబెట్టుట వలన మనలను మనమే శత్రువు యొక్క దాడులకు అనువైనవారముగా వాని యెదుట బాహాటముగా బయటపెట్టుకొనుచుందుము.

(3) సువార్తవలనైన సిద్ధమనస్సను జోడు (6:15). రోమా సైనికులు *caliguli*[64] అనిపిలువబడిన భారీ బూట్లు ధరించారు, అవి బూటు మడమకు అడుగు భాగమున కొట్టబడు పెద్ద తల గల మేకులు కలిగియుండి, సైనికుడు రణరంగములో వాని పాదము మోపునప్పుడు గట్టి పట్టు ఇచ్చుచుండిన ఒక ప్రత్యేక రకమైన పాదరక్షలై యుండినవి. అవి ఒక మాదిరిగా నేటి క్రీడాకారులు ధరించు బూట్లు కలిగియుండిన గూటములు గలవై యుండినవి. అవి పాదములకు మంచి పట్టును ఇచ్చుచుండినవి గనుక సైనికుడు వీటితో ముండ్ల పొదల్లోను మిట్టపల్లాలుండిన విశాలమైన ప్రదేశాల్లోను దౌడు తీయగలుగుచుండెను.

మనము పోరాడుచుండు ఆధ్యాత్మిక పోరాటంలో, మనము సులభంగా తొట్రిల్లి పడిపోవునట్లు సాతాను సకల ప్రయత్నాలు చేస్తుంటాడు. కాబట్టి మనము భీకరమైన వాని దాడులను ఎదిరించుటకు శక్తిమంతులముగా నిలువబడునట్లు మన పాదములకు గట్టి పట్టు నిచ్చు బూట్లు ధరించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ బూట్లు “సమాధాన సువార్తవలననైన సిద్ధ మనస్సను జోడు” అని పిలువబడుచున్నవి. క్రైస్తవుని సమాధానము “కాగా ఇప్పుడు క్రీస్తు యేసు నందున్నవారికి ఏ శిక్షావిధియు లేదను” ఒప్పింపును కలుగుజేయుచున్నది (రోమీయులకు 8:1). అవి ధరించుకొని మనము నిలువబడునప్పుడు, సాతాను మనలను పడద్రోయజాలడు.

(4) విశ్వాసమను డాలు (6:16). మొదటి శతాబ్దములో రెండు డాళ్లు ప్రాముఖ్యమైనవై యుండినవి. ఒకటి దాదాపు చిన్నది, అది సైనికుడు మల్ల యుద్ధము చేయుచుండిన సమయంలో వాడబడింది. అది వాని ఎడమ చేతితో పట్టుకొనబడి, వాని ప్రత్యర్థి కత్తులతో గుచ్చునప్పుడు వాటిని ప్రక్కకు లేదా కిందికి వంచుచుండింది. ఇచ్చట పౌలు మనస్సులో ఉండిన డాలు ఇటువంటిది కాదు. ఇటువంటి దానికి బదులుగా, నిర్దిష్టముగా ఒక పెద్ద డాలును, సుమారు నాలుగడుగుల పొడవు మరియు రెండున్న అడుగుల వెడల్పుండిన డాలును సూచించిన ఒక పదాన్ని పౌలు ప్రయోగించాడు. సర్వసాధారణ ంగా, అది లావుపాటిదై, రెండు కర్ర ముక్కలతో చేయబడి, గట్టి తోలుతో కప్పబడినదై యుండింది. స్పష్టంగా, దగ్గర దగ్గరగా, ఎదురెదురుగా జరుగుచుండిన పోరాటములలో అది వాడబడలేదు. ఇది చేయల్సిన పని ఒక్కటే: దాడి జరుగుచుండిన సమయంలో శరీరమునకు సంపూర్తి కాపుదలను సమకూర్చుట.

ఒక వరుసలో నిలువబడి యున్న సైనికులు మొత్తం వారి డాళ్లను ఒకదానితో మరొకటి తాళంవేయబడినట్లుగా వరుసగా జోడించుకొని అందరు కలిసి ఒక బలమైన గోడగా శత్రువును ఎదుర్కొనుటకు ముందడుగు వేయగలుగునట్లు ఈ డాళ్ల అంచులు తయారుచేయబడినవి. అది, సహజంగానే, ఈ పోరాటంలో మనము ఒంటరిగా లేము, కానీ అనేక మంది సైనికులతో కూడిన ఒక పెద్ద సమూహముగా అందరికీ శత్రువైయున్న వానికి విరోధముగా పోరాడుచున్నామని మనము జ్ఞాపకం చేసుకొనునట్లు మనకు సహాయం

చేస్తుంది.

మనలను కాపాడుచు, సందేహములు, అబద్ధములు, దేవదూషణలకు దారి తీయు ఆలోచనలు, మరియు పాపము చేయవలెనను తీవ్రమైన కోరికలకు దూరంగా తొలగించు ఈ డాలు ఏమైయున్నది? మనకున్నది ఒకే ఒక్క డాలు: అది మన విశ్వాసమే. అది మనలను ఆదుకొనువాడు దేవుడే అను మన నమ్మకము మరియు ఆత్మవిశ్వాసమై యున్నది. మనము ఆయన యందు మరియు ఆయన వాగ్దానముల యందు విశ్వసించుచున్నాము. మనము ఆయన వాక్యములో నుంచి ప్రోత్సాహము పొందుచున్నాము. దీనిని భక్తుడైన యోహాను ఇలా వర్ణిస్తున్నాడు, "లోకమును జయించిన విజయము మన విశ్వాసమే" (1 యోహాను 5:4). మనకు దేవుడనుగ్రహించిన విశ్వాసము మనకు భారీ ప్రతిరక్షణ వరుసయై యున్నది.

(5) రక్షణ యను శిరస్త్రాణము (6:17). క్రైస్తవుని మనస్సు రక్షణ గూర్చిన సంపూర్ణ అభయముతో నిండియున్నది. దేవుడు మన మనస్సులను ఈ యుగ సంబంధమైన అవినీతిమయమైన ఆలోచనల నుంచి కాపాడి సంరక్షిస్తూ మన ఆలోచనా ప్రక్రియను అదుపులను ఈ యుగ సంబంధమైన అవినీతిమయమైన ఆలోచనల నుంచి కాపాడి సంరక్షిస్తూ మన ఆలోచనా ప్రక్రియను అదుపుచేయుటకు ఆరంభించునప్పుడు, సాతాను మనలను పెడదోవ పట్టించజాలదు. మనము దేవుని వాక్యమును అధ్యయనము చేసినప్పుడు, మనము దాని నియమములలో మనలను మనము స్థిరముగా నిలబెట్టుకొన్నప్పుడు, సాతాను వంచనలకు మనము తికమకపడజాలము. మన దైనందిన పోరాటములను మన రక్షణ నిశ్చయతతో పోరాడుటకే మనము సమర్థవంతులమై యుందుము.

(6) **ఆత్మ** ఖడ్గము (6:17). రోమా సామ్రాజ్య సైనికుల ప్రతి ఒక్కని ప్రక్కలో, వాని కత్తి, వాని దట్టి నుంచి వ్రేలాడుచుండింది. ఒక ప్రక్క శత్రువును ఎదుర్కొనుటకును మరొక ప్రక్క తనను తాను కాపాడి సంరక్షించుకొనుటకును కార్యసార్థకమైనది, వాని సర్వాంగ కవచములోని భాగము అదొక్కటే. శత్రువుతో మల్ల యుద్ధము వోలె జరుగుచుండిన పోరాటంలో, ప్రతి సైనికునికి ఈ ఖడ్గము అనివార్యముగా ఆవశ్యకమైనదై యుండింది. దగ్గర దగ్గరగా ఎదురెదురుగా జరుగుచుండిన పోరాటంలో, శత్రువు యొక్క ప్రధాన కేంద్రముపై దాడిచేయుటకు బహుగా ఖచ్చితమైనదై యుండిన ఆయుధమై యుండింది.

క్రైస్తవ యోధుడు కూడా ఒక ఖడ్గము కలిగియున్నాడు. అదే దేవుని వాక్యం. క్రైస్తవుడు తనను తాను కాపాడుకొనుచూ శత్రువుకు విరోధంగా ధైర్యముతో ముందడుగు వేయునట్లు ఇది దేవుడిచ్చిన ఒక యుద్ధోపకరణమై యున్నది. "... నా సంఘమును కట్టుదును; పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని" యేసు చెప్పినప్పుడు ఆయన అనుచరులు శత్రువుపై యుద్ధప్రాతిపదికన పోరాటం చేయుచుందురని కళ్లకు కట్టినట్లుగా చూసాడు (మత్తయి 16:18).

*మనలను మనము దాడిలో నిమగ్నము చేసుకొనుట.* సాతానుకు విరోధముగా కొనసాగుచున్న పోరాటములో జయమొందుటకు దైవికమైన మన వ్యూహములోని అంతిమ అంకము వాస్తవమునకు శత్రువుకు విరోధముగా కొనసాగు పోరాటములో నిమగ్నమై యుండుటయై యున్నది. మనము నిశ్చేష్టమైన సైనికులముగా ఉండుటకు దేవుడు మనలను పిలువలేదు. వాస్తవముగా పోరాటము ఎక్కడ మొదలౌతుందో తెలియనందు వలన మనము ఆశ్చర్యపడవచ్చును.

> ఆత్మవలన ప్రతి సమయమునందును ప్రతి విధమైన ప్రార్థనను విజ్ఞాపనను చేయుచు, ఆ విషయమై సమస్త పరిశుద్ధుల నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపనచేయుచు మెలకువగా ఉండుడి. మరియు నేను దేనినిమిత్తము రాయబారినై సంకెళ్లలో ఉన్నానో, ఆ సువార్త మర్మమును ధైర్యముగా తెలియజేయుటకు నేను మాటలాడ నోరుతెరచునప్పుడు, దానినిగూర్చి నేను మాటలాడవలసినట్టుగా ధైర్యముతో మాటలాడుటకై వాక్శక్తి నాకు అనుగ్రహింపబడునట్లు నా నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపనచేయుచు మెలకువగా ఉండుడి (ఎఫెసీయులకు 6:18–20).

ప్రార్థన అనేది పోరాటమునకు సిద్ధపడుట కాదు; ప్రార్థనయే పోరాటము ప్రారంభమగు చోటై యున్నది. పోరాటమునకు మనము ఒక సారి సంపూర్తిగా సన్నద్ధమయ్యామంటే, మన విరోధి ఎవరో మనము ఒక సారి తెలిసికొన్నామంటే, మన మిత్రమండలి సభ్యులెవరో మనము ఒకసారి చూసామంటే, మనము దాడి చేయుటకు సిద్ధంగా ఉన్నామని అర్థం. దేవుని సైన్యము మోకాళ్ల మీద యుద్ధప్రాతిపదికన ముందుకు వెళ్తుంది.

క్రైస్తవులు ప్రార్థన చేయకూడదనే అపవాది ఎల్లప్పుడు ఆశిస్తాడు. ఇతరమైన పనులు మనము ఏమి చేసినా వాడు పట్టించుకొనడు, ప్రార్థన విషయమునే పట్టింపుగా పట్టించుకొంటాడు. అపవాది మన ప్రణాళికలను అవహేళన చేస్తాడు, కానీ మన ప్రార్థనలంటే వానికెంతో భయం. ప్రతి క్రైస్తవుడు గెలిచినా ఓడిపోయినా ఈ విషయంలోనే అని వానికి బాగుగా తెలియును.

మనము ఎన్నడును మన ప్రార్థనలను మించి బలవంతులమై యుండజాలము. ప్రభువు యొక్క ఏ సంఘమైనా ఎప్పుడైనా గాని సంబంధిత సంఘ సభ్యుల ప్రార్థనా జీవితముల కంటె శక్తిమంతమైనదై యుండజాలదు. యేసు, "మీరు శోధనలో ప్రవేశించకుండునట్లు మెలకువగా ఉండి ప్రార్థన చేయుడి ..." అని హెచ్చరించాడు (మత్తయి 26:41). సంఘమునకు ఆవశ్యకమై యున్నదెల్లా – సజీవుడైన దేవుని సైన్యమునకు అత్యవసరమైనదెల్లా – ఎక్కువ మంది ప్రార్థనా యోధులే. వారు దేవుని దీవెనలు, ఆయన బలము, మరియు విరోధికి వ్యతిరేకమైన దైవికమైన వనరులను సాధికారపూర్వకంగా రాబట్టుకొను సైనికులై యున్నారు.

*ముగింపు.* గ్రీకు ఇతిహాసం ప్రకారం, ట్రోజాన్ యుద్ధంలో యోధుల్లో అఖిల్లెస్ అత్యధికంగా ప్రసిద్ధికెక్కిన యోధుడై యుండెను. సంబంధిత కథ ప్రకారం, అఖిల్లెస్ పిల్లవాడై యున్నప్పుడు, అతని తల్లి పవిత్రమైన స్టైక్స్ నది నీటిలో అతన్ని ముంచినంది. ఇది అతనిని తన మడిమెలో తప్ప, అనగా ఆ నీళ్లలో ముంచినప్పుడు తన తల్లి తన చేత్తో ఎత్తిపట్టుకొన్న బాగము తప్ప, నీటిలో మునిగిన శరీరంలోని ఇతరమైన ఏ భాగంలోనైనను ఎటువంటి హానినైనను పొందజాలనివాడుగా చేసింది. ట్రోజాన్ యుద్ధం జరుగుచుండినప్పుడు, అఖిల్లెస్ విషపూరితమైన ఒక బాణముతోవాని మడిమెలో కొట్టబడ్డాడు గనుక అతడు చచ్చిపోయాడు. వాస్తవానికి అతడు శత్రువు దాడుల మూలమున ఎటువంటి హానినైనను పొందజాలనివాడై యుండవలసి యుండింది, కానీ శరీరంలోని ఒక్క స్థలంలో అతడు తనను తాను కాపాడుకొనలేనివాడై యుండెను.

మనము దేవుని గర్భశత్రువుతో, అనగా అపవాదితో కొనసాగుచున్న ఒక గొప్ప పోరాటంలో నిమగ్నమై యున్నాము. కాబట్టి మనము మన శరీరంలోని అర అంగుళము

స్థలాన్నైనా శత్రువు దాడి నుంచి కాపుదలగా కప్పుకొకుండా విడిచిపెట్టజాలము. పౌలు మన కొరకు ఒక సంపూర్తి పోరట వ్యూహమును వివరించాడు. మన విరోధి మరియు వాని తంత్రముల గూర్చి మనము నేర్చుకొనవలెను. మనలను మనము దేవుడిచ్చు *సర్వాంగ* కవచము ధరించి సన్నద్ధం చేసుకొనజాలము. ఆ తరువాత, మనము కార్యచరణ కోసం రణరంగంలోనికి ప్రవేశించవలెను, ఈ పోరాటంలో దేవుడు మనకు తమ సహాయమును అనుగ్రహించవలెనని ప్రార్థించుచుండవలెను.

క్రిస్ బుల్లార్డ్

**మన మిత్రమండలి సభ్యులు (6:13–20)**

క్రైస్తవులు శక్తిమంతుడైన శత్రువును, సాతానును ఎదుర్కొనవలెను; కానీ మనము పోరాడు పోరాటంలో మనము ఒంటరిగా లేము. విజయము సాధ్యమౌతుందని మనకు జ్ఞాపకము చేయుటకు గొప్ప సాక్షి సమూహము మేఘము వలె మనలను ఆవరించి యున్నది (హెబ్రీయులకు 12:1, 2).

దేవుని, అనగా మనకు సహాయం చేయుటకు ఎల్ల వేళలందు సంసిద్ధుడైయున్నవాని విశ్వసనీయతను మనమెన్నడును మర్చిపోకూడదు (1 కొరింథీయులకు 10:13). ఆయన ఒక సంపూర్తి యుద్ధోపకరణమును మరియు మనలను వైరికి విరోధముగా సంసిద్ధము చేయుచు కాపాడుటకు ప్రార్థనయను సరఫరా మార్గమును సహితము సమకూర్చి యున్నాడు (6:13–20).

తుదకు, మన పక్షమున క్రీస్తు రక్తమును కలిగియున్నాము (ప్రకటన 12:11), మనకు విజయమును సాధ్యము చేయునది అదే. మనము "మనలను ప్రేమించినవాని ద్వారా అత్యధిక విజయమును పొందుచున్నాము" (రోమీయులకు 8:37).

జేయ్ లాక్‌హార్ట్

---

సూచనలు

[1]Josephus *Antiquities* 4.8.24. [2]Andrew T. Lincoln, *Ephesians,* Word Biblical Commentary, vol. 42 (Dallas: Word Books, 1990), 403. [3]6:2, 3లో ఇవ్వబడిన ఆజ్ఞ పాత నిబంధనలో నుంచి ఉల్లేఖించి చెప్పబడినందు వలన, మాటలు NASBలో చిన్న కేపిటల్ అక్షరములలో అగుపించుచున్నవి (నిర్గమకాండము 20:12; ద్వితీయోపదేశకాండము 5:16 చూడుము). [4]Kenneth S. Wuest, *Wuest's Word Studies from the Greek New Testament for the English Reader: Ephesians and Colossians* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1953), 136. [5]పాతనిబంధనలో, "దినముల పొడవు (కాలవ్యవధి)" దేవుని యెడల విధేయత చూపుటతో సంబంధముగలదై యున్నది (సామెతలు 3:1, 2; ద్వితీయోపదేశకాండము 30:20 చూడుము). [6]Ibid., 137. [7]Lincoln, 406. [8]Ibid., 409. [9]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 3d ed., rev. and ed. Frederick William Danker (Chicago: University of Chicago Press, 2000), 748. [10]C. G. Wilke and Wilibald Grimm, *A Greek-English Lexicon of the New Testament,* trans. and rev. Joseph Henry Thayer (Edinburgh: T. & T. Clark, 1901; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1977), 473.

[11]Lincoln, 407–8. [12]S. D. F. Salmond, "The Epistle to the Ephesians," in *The Expositor's Greek Testament,* ed. W. Robertson Nicoll (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1967), 3:377. [13]Lincoln, 408. [14]1 కొరింథీయులకు 7:21, 22; కొలొస్సయులకు 3:22; 4:1; 1 తిమోతి

6:1, 2; తీతు 2:9, 10; 1 పేతురు 2:18–25 చూడుము. [15]Spiros Zodhiates, ed., *The Complete Word Study New Testament,* 2d ed. (Chattanooga, Tenn.: AMG Publishers, 1991), 963. [16]Ibid, 965. [17]Salmond, 378–79. [18]Zodhiates, 889. [19]Lincoln, 422. [20]Salmond, 378–79.

[21]Lincoln, 423–24. [22]ఈ పదము ఫిలిప్పీయులకు 3:1; 4:8; 2 థెస్సలొనీకయులకు 3:1లో "మెట్టుకు" అని అనువదింపబడినది. [23]Lincoln, 441. [24]Ibid., 442. [25]Ibid. [26]Salmond, 382. [27]Lincoln, 443. [28]Salmond, 383. [29]Lincoln, 444. [30]2:2; 2 కొరింథీయలకు 2:11; 10:4; 1 పేతురు 5:8 చూడుము.

[31]2 కొరింథీయులకు 11:14; 1 తిమోతి 4:1; ప్రకటన 2:9 చూడుము. [32]Ethelbert W. Bullinger, *A Critical Lexicon and Concordance to the English and Greek New Testament* (London: Samuel Bagster and Sons, n.d.; reprint, Grand Rapids, Mich.: Zondervan Publishing House, Regency Reference Library, 1975), 893. [33]Wuest, 142. [34]గలతీయులకు 5:1; 1 థెస్సలొనీకయులకు 3:8; 2 థెస్సలొనీకయులకు 2:15 కూడా చూడుము. [35]"[అక్షరాలా], మీ మనస్సుల నడుములు" అని NASB యొక్క కొన్ని ముద్రణలలోని అధః సూచిక చెప్పుచున్నది. [36]Wuest, 143. [37]ఎఫెసీయులకు 1:13; 2 థెస్సలొనీకయులకు 2:10, 12; 1 తిమోతి 3:15; 1 పేతురు 1:22 చూడుము. [38]"సత్యము" మరియు "విశ్వసనీయత" ఒకే హెబ్రీ పద మూలము నుండి ఉత్పత్తియగుచున్నవి. (Robert Young, *Young's Analytical Concordance to the Bible,* 22d American ed., rev. [New York: Funk and Wagnalls Co., 1936], 325, 1004–5.) [39]Salmond, 386. [40]Ibid.

[41]Warren Baker, ed., *The Complete Word Study Old Testament* (Chattanooga, Tenn.: AMG Publishers, 1994), 2357. [42]Bullinger, 693. [43]Josephus *Wars* 6.1.8. [44]Lincoln, 449. [45]Wuest, 144. [46]Lincoln, 449. [47]Salmond, 387. [48]Lincoln, 449–50. [49]Zodhiates, 862. [50]Ibid., 866.

[51]Bullinger, 754. [52]Zodhiates, 954. [53]Salmond, 388. [54]Zodhiates, 951–52. [55]రోమీయులకు 1:9, 10; ఎఫెసీయులకు 5:20; ఫిలిప్పీయులకు 1:4; కొలొస్సయులకు 1:3; 4:12; 1 థెస్సలొనీకయులకు 5:17 కూడా చూడుము. [56]Wuest, 145. [57]Salmond, 390. [58]Ibid. [59]Lincoln, 454. [60]Bullinger, 222, and Bauer, 226.

[61]Bauer, 916. [62]అపవాది గూర్చి మనము చేయుచున్న అధ్యయనములో జేయ్ లాక్‌హార్ట్ చేత రచింపబడిన వివరము యొక్క భాగమును ఇది ముగించుచున్నది. మిగిలిన అధ్యయనము క్రిస్ బులార్డ్ చేత రచింపబడింది. [63]James Dobson, *Dare to Discipline* (Wheaton, Ill.: Tyndale House Publishers, 1970), 15. [64]క్యాలిగ్యుల అను పేరు, నికృష్టుడైన ఒక రోమా సామ్రాజ్యాధికారి, "చిన్న బూట్లు" అని అర్థమిచ్చుచున్నది.